ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ    మాతృ దేవోభవ ! పితృ దేవోభవ ! ఆచార్య దేవోభవ ! అతిథి దేవోభవ !    సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డా॥ ప్రణవ్‌పండ్యా
సంపాదకులు
బి.సి.హెచ్.వి. సుబ్బారావు
(అశ్విని)
ఉప సంపాదకులు
ముక్కామల రత్నాకర్
సంపాదక మండలి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్
డి.వి.ఆర్. మూర్తి

సంపుటి 20 - సంచిక 04
**సెప్టెంబర్ 2015**

పత్రిక అందనివారు మరియు
పత్రికకు సూచనలు, సలహాలు
ఇవ్వదలచినవారు ఈ క్రింది
ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
**040-23700722**
**99491 11175**
**94407 69798**

# ఖచ్చితంగా తిరిగి రానున్న సంస్కృతిని గూర్చిన సత్యములు

**'మాతా భూమిః పుత్రోఽహం పృథివ్యా!'** అన్నది శ్రుతివాక్యము. 'భూమి నా మాతృమూర్తి! నేను పృథ్వీపుత్రుడను!' ఈ శ్రుతివాక్యమును మరియు దాని విస్తృతభావార్థమును మనమున దాల్చి 'ఈ పుడమి సదాసర్వదా శుభప్రదముగా విరాజిల్లాలి' అన్న ఏకైక ఆకాంక్షకు బద్ధులై తమ యావజ్జీవితమును తపో-తితీక్షలతో హోమము గావించిన అలనాటి ఋషుల ప్రజ్ఞను గాంచి మన మనస్సు శ్రద్ధతో నిండిపోతుంది. ఎందుకంటే మనది ఋషుల వారసత్వము కదా! కనుక మనము ఒంటరిగా మన గురించి, మన కుటుంబము గురించి ఆలోచిస్తూ అంతవరకే పరిమితమవ్వకుండా; ఈ సమస్త వసుధను ఒక కుటుంబముగా భావిస్తూ సమిష్టిగత హితమును గురించి చింతన చెయ్యాలి. ఈ **దివ్యభావసంవేదన కారణముగానే ఒకానొక సమయాన భరతభూమి జగద్గురువుగా తేజరిల్లినది. ఇట్టి దైవీచింతన హృదయమంతా నిండి ఉండుట చేతనే ప్రాచీన కాలములోనే దేవసంస్కృతీ సందేశమును ఇంటింటికీ, మనిషి మనిషికీ చేర్చినది. ప్రాచీనులైన నాటి ఆర్యులు 'శ్రేష్ఠ వ్యక్తిత్వముతో, ఉదారమైన ఆలోచనాశైలిగల ఒక మహోన్నతమైన జీవితమును గడిపిన బ్రాహ్మణోత్తములు!**

ఈనాడు తిరిగి అట్టి దివ్యభావపరంపర, తదనుగుణ్యమైన ఆచరణ పునరావృత్తము కావలసి ఉన్నది. ఈ దివ్యగుణాలు శతాబ్దాల పాటు జాతి వంశపరంపరలో పదిలంగా ఉంటూవచ్చాయి. మనము ఋషుల వారసులము! దేవపురుషులము! మనము వీటికి గర్వించవచ్చు. ఇది స్వాభావికము కూడా. పైగా అది ఆవిధముగానే భావించబడాలి కూడాను. ఐతే ఈనాడు మనం ప్రసుప్తావస్థ నుండి మేల్కొని గతకాలపు స్వర్ణిమయుగమును తిరిగి తీసుకురావాలి. మళ్ళీ భరతజాతి విశ్వమానవతకు మార్గదర్శనము చెయ్యాలి. 'ఇప్పటికే మనం భావరాహిత్యంతో దిశానిర్దేశాన్ని కోల్పోయి జీవిస్తున్నాము. దీనికితోడు ఆధునిక సభ్యతా పోకడలకు బానిసలమై నిస్సారమైన జీవితాన్ని జీవిస్తున్నాము. మనలో తమోగుణము రాజ్యమేలుచున్నది. వీనిని అధిగమించి జాతిని చైతన్యం గావించి ఋషుల మార్గంలో పయనించిన రాబోయే కొలది సంవత్సరములలోనే విశ్వాసరాహిత్యము సమసిపోయి, నలువైపులా ఋతుంభరాప్రజ్ఞ యొక్క సువిశాల సామ్రాజ్యపు చల్లని పాలన దృగ్గోచరమౌతుంది. దుర్గమ హిమవత్పర్వతములలో నివసించే ఋషిసత్తా తగిన మార్గదర్శనాన్ని అందించుటకు ఎంతగానో తహతహలాడుచున్నది. పరోక్షజగత్తులోని ఋషుల ప్రయాసకు మన పురుషార్థమును కూడా జోడించినచో సంస్కృతీపురుషులైన గురుదేవులు నినదించిన '21వ శతాబ్దము-ఉజ్జ్వల భవిష్యత్తు' అన్నది సార్థకమై, సత్యమై మన కళ్ళెదుట ఆవిష్కృతమౌతుంది. మహాకాలుడు ఈ యుగసాధననే మన నుండి అభిలషిస్తున్నాడు.

– *అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**ఆటలో గెలవాలనుకున్నవాడు మైదానంలో ఉండాలి**

# విషయసూచిక


1. **సంపాదకీయం :** ఖచ్చితంగా తిరిగి రానున్న సంస్కృతిని గూర్చిన సత్యములు 3
2. **విషయసూచిక-సద్గురువాణి :** సామాజిక సేవయే మానవ జీవన పురుషార్థం 4
3. **మానవునికి మాంసాహారం అవసరం లేదు** 5
4. **యుగనిర్మాణ చిత్రావళి-6 :** ఊర్మిళ ద్వారా లక్ష్మణునికి కర్తవ్యపాలనా ప్రేరణ 6
5. **అశ్వమేధం-7 :** శతపథ బ్రాహ్మణములో అశ్వమేధము 7
6. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర - 39 :** స్వాతంత్ర్య ఉద్యమ పోరాట సంఘటనలు 9
7. **శ్రీకృష్ణ జన్మాష్టమి ప్రత్యేకం:** భగవంతుడు సాక్షిభూతుడు! నిరంతరం మన కర్మల అవలోకిస్తూ ఉంటాడు 12
8. **జీవనసాధనకు బంగారుసూత్రములు-5 :** కర్మకాండలు భావసంవేదనలతో కలవాలి 14
9. **స్వాధ్యాయం - దాని లాభాలు** 18
10. **కర్మకాండ ఎందుకు-ఎలా? - 5 :** గాయత్రీ ఉపాసన 20
11. **పరమపూజ్య గురుదేవుల అమృత వచనాలు:** మానవ జీవిత "నిరూపణలో" నిగ్గుతేలిన సత్యాలు-1 23
12. **చెయ్యెత్తి జై కొట్టు! ఓ భారతీయుడా! గతమెంత ఘనకీర్తి గలవోడా!-2:** 'మానవతకు ప్రతిరూపం భారతీయతకు చిరునామా' - అబ్దుల్ కలాం 25
13. **అతీంద్రియవిజ్ఞానం-5 :** శ్రవణ-దర్శనములకు సంబంధించిన దివ్యశక్తులు 29
14. **వందనీయ మాతా భగవతీదేవి పుణ్య స్మరణ** 32
15. **అఖండ అగ్ని - అఖండదీపము** 34
16. **పూజ్య గురుదేవుల అమృతవాణి:** ఆధ్యాత్మిక ఔన్నత్యమునకు సోపానాలు యోగము మరియు తపస్సు - 1 36
17. **నా వారితో నా మాట:** అత్యాధునిక విజ్ఞానమే జ్యోతిర్విద్య 39
18. **ఆయుర్వేదవైద్యం-5 :** నిమ్మకాయలోని ఆరోగ్య రక్షణ గుణాలు 42
19. **స్ఫూర్తిదాయక గాయత్రీపరివార్ సభ్యులు-16** 45
20. **9 రోజుల సంజీవని సాధనాశిబిరము - ప్రవచనముల పాఠము-4** 47
21. **వార్తలు :** రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు 49




## సద్గురు వాణి

## సామాజిక సేవయే మానవ జీవన పురుషార్థం

ఒక చిన్న రాతిముక్క మైలురాయి రూపంలో బాటసారికి ఎంతో మార్గదర్శనం చేస్తున్నది. అట్లే మట్టితో తయారై రూపాయి విలువ చేసెడి మట్టిప్రమిద వెలుగునిస్తూ రాత్రివేళలందు బాటసారులకు మార్గాన్ని చూపుతుంది. పైనుదహరించిన మైలురాయి కన్నా, రూపాయి విలువ కలిగిన మట్టిప్రమిదకన్నా తెలివిలో, విద్యలో, బుద్ధికుశలతా సామర్థ్యంలో, యోగ్యతలో మిన్నగానున్న మనిషి మాత్రం సమాజం పట్ల మౌనంగా, క్రియారహితంగా ఉండుట మిగుల ఆశ్చర్యాన్ని గొల్పుచున్నది. ఆత్మవిశ్వాసంతో, నిష్ఠాశ్రద్ధలతో మనకు అనుకూలమైన క్షేత్రాలలో రంగాలలో సేవలనందించిన నాడే మానవ జీవితానికి అర్థము, పరమార్థము - ఇదే మానవ జీవన పురుషార్థము.


## యుగశక్తి గాయత్రి

**విడి ప్రతి రూ॥ 15/-** **సం॥ చందా రూ॥ 150/-**
**3 సం॥ చందా రూ॥ 420/-** **10 సం॥ చందా రూ॥ 1300/-**

చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా (at par cheque) లేక డి.డి.ద్వారా కాని పంపగలరు. యం.ఒ. ద్వారా కూడా పైకం పంపించవచ్చు. కానీ యం.ఒ. ద్వారా వచ్చినప్పుడు పూర్తి అడ్రస్సు ఉండుట లేదు. అందువలన యం.ఒ. ద్వారా పైకం పంపినప్పుడు క్రింద ఇచ్చిన ఫోన్ నంబర్లను సంప్రదించి మీ వివరాలు అన్నీ ఇవ్వ ప్రార్థన. రూ. 5,000 లేక అంతకన్నా ఎక్కువ పంపదలచుకున్నప్పుడు ఆన్‌లైన్ ద్వారా పంపవచ్చును. దీనికన్నా తక్కువ పంపే వారు, రూ. 50/- అదనంగా చేర్చి పంపాలి.

ఖాతాపేరు: **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**
బ్యాంకు పేరు: **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
**ఎర్రగడ్డ శాఖ, హైదరాబాద్**
ఖాతా నెం.: **32506416087**
IFSC Code: **SBIN-0013272**

ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంక్ చలానా జిరాక్సు కాపీని మీ చిరునామా తెలుపుతూ తప్పక మాకు పంపించాలి.

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**
**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట
అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.
ఫోన్: 040-23700722, సెల్: 9949111175


**చూస్తూ కూర్చుంటే పనులు జరుగవు, చేస్తూ ఉంటే అయిపోతాయి**

# మానవునికి మాంసాహారం అవసరం లేదు

ఆహారానికి మేధస్సుతో అతిసన్నిహిత సంబంధముంది. మేధస్సు లేదా మనస్సు ఆహారము యొక్క అతి సూక్ష్మమైన సారం నుండి తయారవుతుంది. అత్యధికంగా మాంసకృత్తులున్న ఆహారాన్ని తీసుకొనరాదు. అట్టి ఆహారం కాలేయాన్ని, మూత్రపిండాలను అధికమైన ఒత్తిడికి గురిచేస్తుంది. రక్త ప్రసరణ మండలం సక్రమంగా పనిచేయాలన్నచో రక్తం క్షార లక్షణాలను కలిగివుండాలి.

ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు మున్నగునవి భగవంతుడు మానవజాతికి ప్రసాదించిన వరాలు. ఇవి పాలతో సమానమని చెప్పెదరు. ఇవి శరీర పెరుగుదలకు, పోషణకు ఎంతో ఉపకరిస్తాయి. అంతేకాదు శరీరానికి రక్షణ నిచ్చేందుకు తోడ్పడతాయి. ఆకుకూరలలో గల క్షారగుణకారకాలైన ఖనిజ లవణాలు, వ్యాధికారక క్రిముల బారి నుండి శరీరానికి తగిన రక్షణనిచ్చి మనలోని వ్యాధినిరోధకశక్తిని పెంపొందిస్తాయి.

మాంసాహారాన్ని అధికంగా, తరచుగా తీసుకొన్నందున శరీరంలో రోగసంబంధమైన విష పదార్థాలను ఉత్పత్తి చేస్తుంది. మూత్రపిండాలపై భారం అధికమై అవి రోగగ్రస్తమయ్యేడి ప్రమాదమున్నది. తక్కువ మాంసకృత్తులున్న ఆహారము శరీరానికి మేలు. ప్రతిరోజు 60 గ్రాముల మాంసకృత్తులు శరీరానికి సరిపోతాయి. మనుష్యునికి కావలసినది కొద్దిగా రొట్టె, పప్పు. ఇవి మనిషి ఆరోగ్య సంరక్షణకు కావల్సిన శక్తిని, చైతన్యాన్ని అందించుటకు సరిపోతాయి.

అహింసను పాటించుట మానవుని మొట్టమొదటి ధర్మం. ప్రాణం ఇవ్వలేనివారికి ప్రాణం తీసే హక్కులేదు. ఇతరులను నొప్పించినా, హింసించినా అది అట్టి వ్యక్తిని స్ప్రింగ్ మాదిరి బలంగా తాకి నొప్పిస్తుంది, హింసిస్తుంది. మాంసాహారానికి, మద్యపానానికి అతి సన్నిహిత సంబంధముంది. మనోవికారాన్ని, కామాన్ని, మోహాన్ని, క్రోధాన్ని మాంసాహారం ప్రేరేపిస్తుంది. క్యాన్సర్ మరణాలు అత్యధికం.

మనిషి శరీరావయవ నిర్మాణం శాకాహారపు జంతువులను పోలి ఉంది. దాన్నిబట్టి భగవంతుడు మానవుడిని శాకాహారిగా మాత్రమే పుట్టించాడని బోధపడుతుంది.

మాంసాహారాన్ని త్యజించి, దానికి బదులుగా పాలు, పెరుగు, జున్ను, సోయా, మొక్కజొన్నలు, చిక్కుళ్ళు విరివిగా వాడండి.

– హిందీ మూలం: పండిత శ్రీరామశర్మ ఆచార్య
అనువాదం: వేణుగోపాలరెడ్డి

## పండుగలు

**సెప్టెంబర్ 2015**

| | |
|---|---|
| 05-09-2015 | శ్రీకృష్ణ జన్మాష్టమి, డా॥సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి |
| 17-09-2015 | వినాయకచవితి |
| 18-09-2015 | ఋషిపంచమి |
| 27-09-2015 | మాతా భగవతీదేవిశర్మ మహాప్రయాణం |

**అక్టోబర్ 2015**

| | |
|---|---|
| 01-10-2015 | మాతా భగవతీదేవిశర్మ జయంతి |
| 02-10-2015 | మహాత్మాగాంధీ జయంతి<br>లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి |
| 10-10-2015 | పం. శ్రీరామశర్మ ఆచార్య జయంతి |
| 21-10-2015 | దుర్గాష్టమి |
| 22-10-2015 | విజయదశమి |

## పొట్ట తగ్గుటకు చిట్కా-ఉలవల జావ

*కావలసిన పదార్థాలు: ఉలవలు–50 గ్రా॥; నీళ్ళు–500 గ్రాములు (ఉలవలకు 10 రెట్లు); అల్లం–1 గ్రా॥; జీలకఱ్ఱపొడి – 1 గ్రా॥; సైంధవలవణము–2 గ్రా॥; మిరియాలపొడి–1 గ్రా॥. అన్నీ కలిపి మెత్తని పొడిగా చేసి జావ కాచుకొని త్రాగిన పొట్ట తగ్గుతుంది. సాగిన పొట్ట కూడా యథాస్థితిని పొందుతుంది. 100 కేలరీలు ఖర్చు చేయుటకు నడక – 45 ని॥ /పరుగెత్తుట – 16 ని॥ / ఈత – 17 ని॥ /మెట్లు ఎక్కుట – 16 ని॥ /టెన్నిస్–14 ని॥*


*– అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**బావి ఎండిపోయినప్పుడే నీటి విలువ తెలుస్తుంది**

## యుగనిర్మాణ చిత్రావళి-6

# ఊర్మిళ ద్వారా లక్ష్మణునికి కర్తవ్యపాలనా ప్రేరణ

మాతా కైకేయి కోరిక మేరకు మర్యాదా పురుషోత్తముడైన శ్రీరామచంద్రుడు-సీతాదేవితో వనవాసానికై బయలుదేరు చుండగా జరిగిన సంఘటన! లక్ష్మణుడు భార్యయైన ఊర్మిళను సమీపించి - "శుభప్రద! ఇప్పుడు నా అన్న రాముడు సంకటస్థితిలోనున్నాడు. ఆయన ఒంటరిగా వనవాసానికి బయలుదేరుచున్నాడు. దీనిపై నేను ఆలోచించగా నాకు ఈ భావన కలిగింది. ఒక సోదరుడు సంకటస్థితిలో నుండగా అతనిని ఆదుకొని, అతనికి సహాయకారిగానుండుట మరో సోదరుని కర్తవ్యము! నీవు నా ధర్మపత్నివై ఉన్నందున దీనిపై నీ సలహాను కోరుచున్నాను'' అన్నాడు.



ఊర్మిళ ఈ రీతిగా జవాబిచ్చింది! "స్వామీ! పెద్ద సోదరుడు కేవలము సోదరుడే కాదు తండ్రితో సమానము. మీదుమిక్కిలి రాముడు మానవులకు ఆదర్శ ప్రాయుడు. ఆయనతో పాటు మాతృసమానురాలయిన సీతాదేవి కూడా ఉన్నది. ఇప్పుడు వారున్న సంకటస్థితిలో, వారికి సహాయ మందించుట తప్పనిసరి. వారి క్షేమాన్ని మీరు కాక వేరెవ్వరు చూస్తారు? సోదర ప్రేమకు ఆదర్శంగా మీరు నిలవాలి. ఇది నాకు కూడా గౌరవాన్ని కొనితెస్తుంది."

"సఖీ! నేను వనవాసానికి వెళ్ళినచో వియోగానికి లోనై బాధపడవు కదా?" అని లక్ష్మణుడు ప్రశ్నించాడు. (చిత్తరువులో రాముడు సీతతో కూడి వనవాసానికి వెళ్ళుట చూడవచ్చును. మరియు రెండవదానిలో ఊర్మిళ భర్తయైన లక్ష్మణునికి రక్షా తిలకము దిద్ది సీతారాముల వెంట వనవాసానికి పంపుటను చూడవచ్చు)

"కర్తవ్యపాలనలో కష్టముల ఎదుర్కొనక తప్పదు. అప్పుడే మానవీయత ప్రతిష్ఠితమవుతుంది! ఇది ఎంతో శ్రేయస్కరము మరియు సంతోషదాయకం కూడా!" అని ఊర్మిళ జవాబిస్తూ ఇంకా ఇలా చెప్పసాగింది. "ప్రభూ! వివాహం యొక్క ఉద్దేశ్యం శారీరక సుఖాన్ని పొందుట లేక కోరికల తీర్చుకొనుట కొరకు కాదు, నేను మీతో కలిసి ఏడడుగులు కర్తవ్యపాలనకై వేశాను. మీకు గౌరవం పెరగాలనెడిదే నా ఆకాంక్ష. మీరు నా ప్రాణ సమానులైన భర్త! మీ వియోగం నాకు కష్టాన్ని కలిగిస్తుంది. కాని నేను వ్యక్తిగత సుఖానికి ప్రాధాన్యత నొసంగినచో కర్తవ్య పాలన, ఆదర్శవాదానికి ఎవరు విలువ నిస్తారు?" అన్నది ఊర్మిళ.

ధర్మపత్ని యొక్క విశాలతను గుర్తించిన లక్ష్మణుని హృదయం ఆనంద పారవశ్యాన్ని చెంది "ఊర్మిళా! నీవు నాకు కర్తవ్యాన్ని తెలియజెప్పావు! నాకు చాలా సంతోషంగా ఉంది" అన్నాడు.

నేటి యుగంలో వివాహం ఉద్దేశ్యం కలగగానే కామక్రీడ మదిలో మెదలుట సహజం. దీనికి భిన్నంగా ఊర్మిళ ఆదర్శ మార్గాన్ని తెలియజేసింది. దీని ద్వారా వివాహమనెడిది మానవ జీవన కర్తవ్యపాలన లక్ష్యసాధనకై ఇరువురు వ్యక్తులు అనగా స్త్రీ-పురుషుల పరస్పర అవగాహనతో, సహకారంతో ఏర్పాటు గావించిన భారతీయ సంస్కృతి×× ప్రక్రియ. భారతీయ సంస్కృతిలో భార్యను ధర్మపత్నిగా సంబోధించుట పరిపాటి! దీని అర్థము వివాహ ధర్మ కర్తవ్యపాలనలో భార్యాభర్తల పరస్పర సహకారం అత్యంతావశ్యకం. దీనిలో స్వార్థపరత్వానికి తావులేదు. దీనినే ఊర్మిళ అనుసరించింది. ఈ గీటురాయిపై స్థిరంగా నిలచింది. ఆమె ఆదర్శప్రాయ నడవడి ఆ యుగంలోనే కాక, నేటి యుగంలో కూడా స్త్రీలకు అనుసరణీయమే. భర్త యొక్క గౌరవాన్ని, కీర్తిని ఇనుమడింపజేయుట భార్య కర్తవ్యము. అట్లు కానిచో ఆమె కామోపభోగాలకే పరిమితమవుతుంది.

ధర్మపత్నికి ప్రతిరూపము ఊర్మిళే అనెడిది లోకవిదితమైంది. భర్తను కర్తవ్యతారూఢునిగా నిలుపుటకై భార్య తన వ్యక్తిగత సుఖాలను పణంగా పెట్టి వానిని తన మనస్సులోనికి రానివ్వదు.

లక్ష్మణుడు పదునాలుగు సంవత్సరాలు రాముని చెంతనే వనాలలో నివసించాడు. ఆయనను వేలకొలది కష్టములు చుట్టుముట్టినా, ఊర్మిళ ఏనాడు చెక్కుచెదరలేదు. ఆమె ఒకే ఒక్క లక్ష్య సాధనకై తపించింది. అదే "నా యొక్క భర్త లోకమంగళము కొరకై కష్టాలను సహిస్తూ ఉన్నాడు. యావత్ విశ్వంలో సోదరుల మధ్య ప్రేమకు ప్రతీకగా మరియు కర్తవ్యపారంగా లక్ష్మణుని జీవితం నిలుచుగాక!!

– *అనువాదం: పార్థసారథి*

**అవకాశాలు మనల్ని వెతుక్కుంటూ రావు - మనమే అవకాశాల్ని వెతుక్కుంటూ వెళ్ళాలి**

అశ్వమేధం - 7

# శతపథ బ్రాహ్మణములో అశ్వమేధము

దివ్య అనుభూతుల ఆధారంగా ఏర్పడ్డవి వేదాలు. అందుకే వీటిని ప్రామాణికాలుగా గుర్తించారు. వేదాలలో నాలుగు భాగాలు ఉంటాయి. 1) సంహితలు 2) బ్రాహ్మణములు 3) అరణ్యకాలు 4) ఉపనిషత్తులు. శతపథబ్రాహ్మణములో అశ్వమేధము గూర్చి చెప్పిన విషయాలు వేదవాక్కు గనుక ప్రామాణికముగా తీసుకొనవచ్చును.

***రాజా వ్యా ఏష యజ్ఞానాం యదశ్వమేధః***

*- శ.బ్రా. 13-2-2-1*

అనగా - యజ్ఞముల రాజు అశ్వమేధము

దీని ప్రభావాన్ని వర్ణిస్తూ

***నికామె - నికామె నః పర్జన్యో వర్షతు***

*- శ.బ్రా. 13-1-7-9*

ఈ యజ్ఞ ప్రభావం వల్ల ఇచ్ఛానుసారంగా, అవసరానికి అనుగుణ్యంగా పర్జన్యము వర్షిస్తుంది. (పర్జన్యము అనగా ఉత్పాదకత)

**ఫలవత్యో నః ఓషధయః పచ్యంతాం ।**

అనగా, యజ్ఞ ప్రభావం వల్ల మా వనస్పతులు, ఔషధులు పరిపక్వమై ఫలిస్తాయి.

అదే క్రమములో

**యోగ క్షేమేనః కల్పతామ్।** అనగా, మా యోగ (అప్రాప్తి యొక్క ప్రాప్తి) క్షేమాలు (పొందినదాని స్థిరత్వము) యజ్ఞ ప్రభావము వల్ల లభిస్తాయి.

**సర్వపాపానం తరతి యో అశ్వమేధేన యజతే**

అశ్వమేధము ద్వారా అన్నిరకాల పాపముల నుండి విమోచన కలుగుతుంది.

**సర్వమశ్వమేధః సర్వస్సాప్త్యై సర్వస్యావరుద్ధ్యై**

*- శ.బ్రా. 13-3-1-6*

అనగా - అన్ని అవరోధాలు దాటి అన్నీ పొందుటకు అశ్వమేధము సర్వసమర్థము.

వీటన్నిటివల్ల స్పష్టముగా అర్థమయ్యేది ఏమిటంటే అశ్వమేధము పుష్టి సంచాలన వ్యవస్థ రూపమైన దివ్యయజ్ఞ స్వరూపమే! ఈ యజ్ఞములు దివ్యసంకల్పము, దివ్యపురుషార్థము దివ్యసంరక్షణ-మార్గదర్శకత్వములోనే సంభవము. దుర్లభము, దుస్సాధ్యము ఐన ఈ యజ్ఞానుష్ఠానము చేయుటకు అనుమతి, సంరక్షణ, సహాయోగాలు ఋషులు సులభంగా ఇచ్చేవారు కాదు.

శతపథబ్రాహ్మణములో అశ్వమేధయజ్ఞము కొరకు 13-3-7-1 నుండి 12 వరకు అనేక పేర్లు తెలిపి ఆ క్షేత్రాలలో లభించే లాభాలను స్పష్టంగా తెలియజేశారు.

**ఏషవై ప్రభుర్నామ యజ్ఞః**
**యత్రై తేన యజ్ఞేన యజతే సర్వమేవ ప్రభూతం భవతి ॥1**

ఈ యజ్ఞం పేరు ప్రభువు. ఎక్కడ ఇది జరుపబడుతుందో అక్కడివారందరూ ప్రభుతా సంపన్నులవుతారు.

**ఏషవై విభుర్నామ యజ్ఞః ।**
**యత్రై తేన యజ్ఞేన యజతే సర్వమేవ విభూతం భవతి ॥2**

ఈ యజ్ఞము పేరు విభువు. ఎక్కడ ఇది జరుపబడుతుందో అక్కడివారందరూ విభూతివంతులవుతారు.

**ఏషవై వ్యష్టిర్నామ యజ్ఞః ।**
**యత్రై తేన యజ్ఞేన యజతే సర్వమేవ వ్యష్టం భవతి ॥3**

ఈ యజ్ఞము పేరు వ్యష్టి. ఎక్కడ ఇది జరుపబడుతుందో అక్కడివారందరూ ఇష్ట ఉద్దేశ్యాలలో సాఫల్యము పొందుతారు.

**ఏషవై విధృతిర్నామ యజ్ఞః ।**
**యత్రై తేన యజ్ఞేన యజతే సర్వమేవ విధృతం భవతి॥4**

ఈ యజ్ఞము పేరు విధృతి. ఈ యజ్ఞానుష్ఠానము జరిగినచోట ఉన్న వారందరూ కీర్తివంతులవుతారు.

**ఏషవై వ్యావృత్తిర్నామ యజ్ఞః ।**
**యత్రై తేన యజ్ఞేన యజతే సర్వమేవ వ్యావృతం భవతి॥5**

ఈ యజ్ఞము పేరు వ్యావృతి. దీనివల్ల అందరూ సురక్షితంగా ఉంటారు.

**తీరాన్ని విడిచిపెట్టి సముద్రంలోనికి వెళ్ళుటకు భయపడేవాడు సముద్రాన్ని శోధించలేడు**

**ఏషవై ఊర్జస్వాన్నామ యజ్ఞః ।**
**యత్రై తేన యజ్ఞేన యజతే సర్వమేవ వోర్జస్వద్ భవతి॥6**

ఈ యజ్ఞము పేరు ఊర్జస్వాన్! (దివ్యశక్తిని ప్రదానము చేసేది) దీనివల్ల అందరూ ప్రాణవంతులవుతారు.

**ఏషవై పయస్వాన్నామ యజ్ఞః ।**
**యత్రై తేన యజ్ఞేన యజంతే సర్వమేవ పయస్వద్ భవతి॥7**

ఈ యజ్ఞము పేరు పయస్వాన్. దీనివల్ల అందరూ దివ్య రసపానము చేసేవారవుతారు.

**ఏషవై బ్రహ్మవర్చసి నామ యజ్ఞః ।**
**యత్రై తేన యజ్ఞేన యజంతఽ**
**బ్రాహ్మణో బ్రహ్మవర్చసి జాయతే॥8**

ఈ యజ్ఞము పేరు బ్రహ్మవర్చసి, ఈ యజ్ఞానుష్ఠానములో పాలుపంచుకొన్నవారు బ్రహ్మవర్చస్సును పొందుతారు.

**ఏషవై అతివ్యాధీనామ యజ్ఞః ।**
**యత్రై తేన యజ్ఞేన యజంతఽ**
**రాజన్యోఽతి వ్యాధీ జాయతే॥9**

ఈ యజ్ఞము పేరు అతివ్యాధి. ఈ యజ్ఞానుష్ఠానములో పాల్గొన్న వారందరూ క్షేత్ర ధర్మాన్ని పాటించి తమ లక్ష్యాన్ని సాధిస్తారు.

**ఏషవై దీర్ఘోనామ యజ్ఞః ।**
**యత్రై తేన యజ్ఞేన యజంతఽ**
**దీర్ఘారణ్యం జాయతే॥10**

ఈ యజ్ఞము పేరు దీర్ఘ ..... ఈ యజ్ఞానుష్ఠానము వల్ల వన సంపద వృద్ధి అవుతుంది.

**ఏషవై క్లుప్తిర్నామ యజ్ఞః ।**
**యత్రై తేన యజ్ఞేన యజంతే**
**సర్వమేవ క్లుప్తం భవతి॥11**

ఈ యజ్ఞము పేరు క్లుప్త. ఈ యజ్ఞానుష్ఠానము చేసిన వారందరిలో కార్యకుశలత పెరుగుతుంది.

**ఏషవై ప్రతిష్ఠానామ యజ్ఞః ।**
**యతేన యజేన యజంతే సర్వమేవ ప్రతిష్ఠితం భవతి॥12**

ఈ యజ్ఞము పేరు ప్రతిష్ఠ. ఈ యజ్ఞానుష్ఠానము చేసిన వారందరికి సత్ప్రతిష్ఠ లభిస్తుంది.

ప్రజాపతి బ్రహ్మ అశ్వమేధయజ్ఞానికి ఎంత ప్రాముఖ్యత ఇచ్చాడంటే, మిగతా యజ్ఞాలన్నింటిని దేవతలకి పంచి దీనిని తనకు మాత్రమే ఉంచుకున్నాడు. కాని దేవతలు చాలా బ్రతిమాలుకున్న తరువాత వారికికూడా అశమేధయజ్ఞములో భాగం ఇచ్చాడు. – *శ.బ్రా. 13/2/1/1*

## శ్రమయే సమృద్ధికి మూలం

*మగధదేశంలో భయంకరమైన కఱువు విలయతాండవం చేస్తున్నది. భయంకరమైన ఎండతో నేల జ్వలించిపోతున్నది, ఆకలితో జనం అల్లాడిపోతున్నారు. సామ్రాట్ చంద్రగుప్తుడు ప్రజలకు సహాయం చెయ్యటానికి తన కోశాగారాన్ని తెరిపించాడు. అలాగే వరుణదేవుడు సంతృప్తి చెంది, తమ రాజ్యంలో వర్షాలు కురిపించగలడనే ఆశతో, అన్ని ప్రదేశాలలోనూ యజ్ఞాలు జరపమని ఆదేశాలిచ్చాడు. పాటలీపుత్రంలో కూడా యజ్ఞం ఏర్పాటు చెయ్యబడింది. రాజు వారంరోజుల పాటు నిరాహారంగా ఉంటూ స్వయంగా ముఖ్య యజమానిగా యజ్ఞంలో పాల్గొన్నాడు.*

*తర్వాత మహారాణితో కలసి సామ్రాట్ చంద్రగుప్తుడు బంజరునేలలో స్వయంగా నాగలిపట్టి దున్నటం ప్రారంభించాడు. నాగలి నేలను తాకుతుండగానే అక్కడ ఒక ఆకృతి ప్రత్యక్షమై, చంద్రగుప్తుడిని సంబోధిస్తూ, "ప్రజలు శ్రమ పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. అందుచేత ఈ దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజలు తిరిగి శ్రమపడటం ప్రారంభిస్తే మళ్ళీ మంచిరోజులు రాగలవు" – అని పలికింది. ఈ దృశ్యాన్ని చూసిన ప్రజలకు శ్రమ యొతక్క ప్రాముఖ్యత బోధపడింది. కొంచెంసేపు శ్రమపడి ఒక కాలువను త్రవ్వగా, అందులో నుండి జలం పెల్లుబికి బంజరుభూమిపై ధారలుగా ప్రవహించింది. శ్రమ దేవత తిరిగి అందరికీ సమృద్ధిని ప్రసాదించింది.*

– *అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

**ఎటువెళ్ళాలో తెలియనివారికి ఏదారయినా ఒకటే**


పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-39

# స్వాతంత్ర్య ఉద్యమ పోరాట సంఘటనలు

*(గతసంచిక తరువాయి...)*

### ప్రేలుడుతో నాశనము

రైలు నిలిచిపోగానే 10–12 మంది యువకులు రైలు నిలచిన ప్రదేశములో నున్న పొదలమాటు నుండి వెలుపలికి వచ్చారు. వారు తుపాకులు కలిగినట్లున్నారు. తుపాకు మొనలు ఒక సంచిలో దాచి ఉంచారు. పొదలమాటు నుండి వెలికి రాగానే వారంతా "భారత్‌మాతాకి జై" "వందేమాతరం" అంటు నినాదాలు చేస్తూ రైలు సంరక్షకుడు (గార్డు) ఉన్న బోగీ వద్దకు చేరుకున్నారు. వారిలో కొందరు మొదటి తరగతి పెట్టెను చేరుకున్నారు. రైలు సంరక్షకుడిని (గార్డు) రైలు నుండి దింపి ఇరువురు ఆయనను చుట్టుముట్టారు. అతను భయంతో వణకసాగాడు. మొదటి తరగతి బోగిలో నున్నవారిని రైలు దిగిపొమ్మని హెచ్చరిస్తూ, రైలును తగులబెట్టనున్నామని ప్రకటించారు. ప్రయాణికులు భయపడి రైలు దిగసాగారు. మొదటి తరగతి బోగీని రైలు నుండి వేరుచేయమని సంరక్షకుడిని ఆదేశించారు. అతను ఇంజను డ్రైవరు సహాయంతో, ఇతర రైల్వే ఉద్యోగస్థుల సహాయంతో బోగీని విడదీశాడు.



పొలాల్లోని గ్రామప్రజలు వెలికివచ్చి ఈ యువకులకు సహాయపడసాగారు. చుట్టుప్రక్కల నున్న గ్రామీణ యువత కూడా వీరితో చేరిపోయారు. యువత, తమతో తెచ్చిన కిరోసిన్ మరియు ఇతర ఇంధనాన్ని బోగీపై చల్లి బోగీకి నిప్పుపెట్టారు. రైలుబోగీలో ముందుగానే ఎండు కట్టెలను, ఎండుగడ్డిని పెట్టివుంచారు. బోగి వెంటనే మంటల్లో కాలిపోసాగింది. శ్రీరామ్ మరియు గంగాసింగ్‌లు వెంటనే ఆ ప్రాంతాన్ని వీడిపోవలసిందిగా తమ సహచరులకు చెప్పి తాము కూడా నెమ్మదిగా అచ్చటి నుండి నిష్క్రమించారు.

ఈ వార్త దావానలంలా చుట్టుప్రక్కల గ్రామాలకు, పట్టణాలకు వ్యాపించింది. ఈ వార్తను పత్రికల్లో ప్రచురించారు. కాని వివరాలు వెల్లడించలేదు. దీనితో ప్రజల్లో వాస్తవాలకు భిన్నంగా అతిశయోక్తుల ప్రచారం జరిగింది.

ఈ రైలు బోగీని తగులబెట్టిన వారి ఆచూకీకై పోలీసులు ఎంత ప్రయత్నించినా తెలియరాలేదు అనేకమంది గ్రామీణులను హింసించి, కొట్టినా ఆచూకీని పోలీసులు తెలిసికొనజాలకపోయారు. రైలులో గూండాలు, రౌడీలు ప్రయాణీకుల దోచుకోనుటకై వచ్చారు. వానిని ఎదుర్కొని వారితో పోరుసల్పుటలోనే తమ సమయమంతా గడచిపోయింది అన్నారు గ్రామీణులు.

### తిరుగుబాటు చర్యల సంవత్సరాలు

ఈ రైలు బోగీకి నిప్పంటించిన వారానికి ఆ గ్రామ సమీపంలో ఫిష్ ప్లేట్ తొలగించినందున రైలు పట్టాలు తప్పింది. ఆరోజుల్లో రైళ్ళు అతి తక్కువ వేగంతో నడిచేవి. దీనివలన రైలు బోగీలు తలక్రిందులగుట కాని, ప్రాణాపాయ సంఘటనలు కాని, ఆస్తినష్టం కాని జరిగేది కాదు. ఈ సందర్భంగా టెలిఫోన్ తీగలను కత్తిరించి, సమాచారవ్యవస్థను భంగపరచే పనిని శ్రీరామ్‌కు అప్పగించారు. ఈ పనిని శ్రీరామ్ అత్యంత పకడ్బందీగా చేసేవారు.

తనతోపాటు మరికొందరిని కూడా దీనిలో కలుపుకొన్నారు శ్రీరామ్. విద్రోహచర్యలు జరిపే సమయంలో ఏ ఒక్కరికి ప్రాణహాని జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసికొనేవారు శ్రీరామ్ మరియు ఆయన అనుచరులు కూడా. మన లక్ష్యం ఆంగ్లేయుల పాలనను అంతంచేయుట తప్ప, మరొకరిని బాధించుట కాదు అని చెప్పేవారు.

జాతీయ కాంగ్రెసుపార్టీ సమావేశాన్ని ఏప్రిల్ 1933 లో కలకత్తాలో జరపాలని ఢిల్లీ సమావేశంలో నిర్ణయించారు. ఢిల్లీ సమావేశాల అనంతరము స్వాతంత్ర్య పోరాటంలో సంస్థ అనేకానేక ఒడుదుడుకుల నెదుర్కొంది. మహాత్మాగాంధీగారి నిరాహారదీక్ష, పూనా ఒడంబడిక, ముస్లింల సమావేశం రిజర్వేషన్ల తీర్మానాలు తదితర చారిత్రక సంఘటనలు చోటు చేసుకున్నాయి. దీనితో కలకత్తా సమావేశాలు ప్రాధాన్యతను సంతరించుకొన్నాయి. కొంతకాలంపాటు శ్రీరామ్ తన

ఎప్పుడూ పనిచేసేవాడికన్నా ఏ పనిచెయ్యనివాడే ఎక్కువ అలసిపోతాడు

తిరుగుబాటు కార్యకలాపాల నిలిపివైచి ప్రజలతో కలిసిమెలిసి తిరుగసాగాడు. సమావేశాల ఏర్పాటుపై శ్రద్ధ వహించాడు. ప్రజలకు తగిన శిక్షణనిస్తూ వారిని దేశ స్వాతంత్ర్య పోరాటానికై సంసిద్ధుల చేయసాగాడు.

అప్పటి కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడైన శ్రీ అన్నసాహెబ్– కలకత్తా పార్టీ సమావేశాలకు అధ్యక్ష్యునిగా శ్రీమదనమోహనమాలవ్యా గారి పేరును సూచించుట జరిగింది. ఈ సమావేశంలో 1929 లాహోర్‌లో జరిగిన పార్టీ తీర్మానాన్ని పునరుద్ఘాటిస్తూ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని కోరుచూ తిరిగి తీర్మానించారు. తదుపరి చర్యగా సహాయనిరాకరణ ఉద్యమానికి పార్టీ అంగీకారాన్ని తెలియజేస్తూ తీర్మానాలు చేయ సంకల్పించారు. దీనిలో భాగంగా విదేశీ తయారీ వస్తువులను, దుస్తులను భారతీయులు ఉపయోగించరాదు అనెడి తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టుటకు ప్రతిపాదనను సిద్ధం చేశారు. ఈ సమాచార మంతా ఆంగ్లేయ ప్రభుత్వ పెద్దలకు వారి వేగుల ద్వారా చేరింది. దీనితో కలకత్తా సమావేశాలను జరుపనివ్వరాదని అవసరమైనచో అనేకమందిని నిర్బంధించవలయునని ప్రభుత్వం నిశ్చయించిది. కఠినమైన చర్యల తీసుకొని సమావేశాలు జరుగకుండా చూడాలని నిశ్చయించింది.

## కలకత్తా సమావేశాల ముగింపు

ప్రభుత్వ నిర్ణయం తెలియగానే ప్రజలలో మరింతగా స్వాతంత్ర్య పోరాట యోధులలో దీనిని ఎదిరించి నిలువాలనే ఉత్సుకత పెరుగసాగింది. దీనితో కాంగ్రెస్ నూతన స్వచ్ఛంద సేవకులను చేర్చుకోసాగింది. కలకత్తా సమావేశాలకు ముందు గానే 1000 మంది సేవకులను కాంగ్రెస్‌లో చేర్చుకోవాలని శ్రీరామ్ నిర్ణయించాడు. నలుగురి అనుచరుల ఒనగూర్చుకొని ఈ కార్యక్రమాన్ని శ్రీరామ్ చేపట్టాడు. ఇది కొనసాగుచుండగానే కలకత్తా సభలకు ఎక్కువమందిని చేకూర్చాలనెడి సందేశం చేరింది. ప్రభుత్వం ఈ సమావేశాలను అడ్డుకుంటుందని ముందుగనే ఊహించి కాంగ్రెస్‌పార్టీ తగు రీతిలో సిద్ధం కాసాగింది. ప్రజలను ముందస్తుగానే నిర్బంధించి వారిపై కేసులు బనాయించి, ఏదో ఒక రీతిలో సమావేశాలను భగ్నం చేయటానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని కాంగ్రెస్‌పార్టీ భావిస్తున్నది. దీనితో స్వచ్ఛంద సేవకులు అన్నివిధాలా ప్రభుత్వ దమనకాండను అడ్డుకొని ఎక్కువమంది పార్టీ సమావేశాలకు హాజరయ్యేలా చూడమని పార్టీ అధిష్ఠానం కార్యకర్తల ఆదేశించింది.

బరోడా వద్ద జరిగిన యజ్ఞ ప్రక్రియ శ్రీరామ్‌కు చక్కని అనుభవాలను అందించింది. అట్లే గోవర్ధనగిరియాత్ర ద్వారా తాను నేర్చుకొని పొందిన అనుభవాలను ఆచరణలో పెట్టాలని శ్రీరామ్ నిశ్చయించుకున్నాడు. రేపల్లెవాసులు దేవరాజు ఇంద్రుడిని ఎదిరించి, ప్రకృతి విలయాలకు ఎదురొడ్డి నిలిపేలా చేసిన శ్రీకృష్ణుని మార్గదర్శనాన్ని తనకు చక్కని ప్రేరణగా మలచుకొన్నాడు శ్రీరామ్. ఇదే రీతిలో ప్రజలు– ఆంగ్ల ప్రభుత్వానికి ఎదురొడ్డి నిలచి తమ సంఘటితశక్తితో ప్రభుత్వానికి గట్టి హెచ్చరికలను అందించాలని నిశ్చయించుకున్నాడు శ్రీరామ్. యజ్ఞక్రతువును విడచిపెట్టి ప్రజల చేత కలకత్తా సమావేశాలకు తప్పక హాజరయ్యేదమని ప్రతిన చేయించి, గుర్తుగా వారి కుడిచేతికి సంకల్పసూత్రాలను ధరింపజేశాడు. ఇదే రీతిలో శ్రీరామ్ సహచరులు కూడా వారి వారి ప్రదేశాలలో ప్రజల చేత ఇదేవిధంగా ప్రతిన పూనింపజేశారు.

## ప్రమాదకర మనిషిపై సమాచారము

ఆంగ్ల ప్రభుత్వ గూఢచారి విభాగం మేలుకొని తమ వేగు పనిని వేగవంతం గావించింది. పూర్వము వలె శక్తివంతమైన తిరుగుబాటు యువకుల పేర్లను గుర్తించింది. వీరు చేసెడి పనులను, వాని ఫలితాలను, తీవ్రతను అంచనావేసింది. ఇన్‌స్పెక్టర్ మార్టిన్ శ్రీరామ్‌ను గురించి సమాచారాన్నంతా సేకరించి సిద్ధంగా ఉంచుకున్నాడు. ఆయన సమాచారపత్రంలో శ్రీరామ్‌ను గురించి “అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి కాని చూపరులకు ఒక సామాన్య కార్యకర్తగా కనిపిస్తాడు. పార్టీ పెద్దల వద్ద కూడా ఇతని మాటలు చలామణి అవుతాయి. అతని పని విధానము అత్యంత ఆశ్చర్యజనకంగా ఉంటుంది” అని వ్రాశాడు.

25–30 సంవత్సరముల వయస్సున్న యువకులందరు ఉత్సుకత మెండుగా ఉండి కూడా, వారిలో పరిణతి కొరవడి నందున పనిలో నేర్పరితనం చూపజాలకున్నారు. కాని శ్రీరామ్ వీరికి భిన్నమైనవాడు. పరిణతి, పనిలో నేర్పరితనము, చొరవ, మెళకువలు అత్యధికంగా ఉన్నాయి. దీనిని గుర్తించి కాంగ్రెస్ పెద్ద నాయకులలో ఒకరైన బాలకృష్ణ కేస్కార్ సైనిక్‌పత్రిక సంపాదకులైన కృష్ణదత్తపాలీవాల్ సూచన మేరకు శ్రీరామ్‌ను తన నమ్మకమైన అనుచరునిగా నియమించుకొనుట జరిగింది. కాని పాలీవాల్ తన నిర్ణయాన్ని మార్చుకొని తిరిగి శ్రీరామ్‌ను వెనుకకు పిలిపించుకున్నాడు.

**ఓటమికి భయపడేవాడు గెలుపు సాధించలేడు**

ఇన్‌స్పెక్టర్ మార్టిన్ తన సమాచార సేకరణ ప్రతిలో దీనిని ఉటంకించుట జరిగింది. మార్చి 1931 లో గాంధీ – ఇర్విన్ ఒడంబడిక జరిగింది. ఈ ఒడంబడికలో కాంగ్రెస్‌పార్టీ తన సహాయ నిరాకరణ ఉద్యమాన్ని కొనసాగించవచ్చు నని, రౌండ్ టేబుల్ సమావేశాలలో పాల్గొనుటకు వైస్రాయి ఇర్విన్ అంగీకరించుట జరిగింది. దీనితోపాటు అన్యాయ చట్టాలను రద్దుచేసి రాజకీయ ఖైదీల నందరిని విడుదల చేయుటకు వైస్రాయి అంగీకరించిరి. అట్లే అధిక పన్నుల తగ్గించుటకు అంగీకారం కుదిరింది.

## ప్రధాన బాధ్యతను అప్పగించారు

ఆరోజులలో కాంగ్రెస్‌పార్టీ కార్యకలాపాలనన్నింటిని శ్రీ పండిత గోవిందవల్లభపంత్ అజమాయిషీ చేస్తున్నారు. ఆయన అప్పుడు నైనిటాల్‌లో ఉన్నారు. ఆగ్రా ప్రాంత గణాంక వివరాలు వారికి అందలేదు. ఇదే విషయాన్ని సంఘ సభ్యుల దృష్టికి తెచ్చారు. గ్రామగ్రామానికి తిరిగి లెక్కలు వివరాలు సేకరించుట తప్ప మరోమార్గము కనిపించలేదు. ఈ బాధ్యతను ఆ ప్రాంతము తెలిసివున్న శ్రీరామ్‌కు అప్పగించుట మంచిదని రావత్‌జీ సూచించారు. సమావేశంలో ఈ సూచనను ఏకగ్రీవంగా ఆమోదించి శ్రీరామ్‌కు ఈ బాధ్యతను అప్పగించారు. సమావేశంలో నున్న శ్రీరామ్ వెంటనే తన పనికి శ్రీకారం చుట్టి ఇంటికి చేరి ప్రయాణానికి సిద్ధమై తన అనుచరులతో బయలుదేరాడు.

నాలుగు రోజులలో కావలసిన భూముల వివరాలను, వారి యజమానుల వివరాలను, గ్రామాల వారిగా 128 గ్రామాల నుండి చెల్లించెడి పన్ను వివరాలతో సహా సేకరించి సంసిద్ధం చేశారు. ఇంత త్వరగా ఇంతటి బృహత్తర పనిని వీరు కొద్దిమంది ఎట్లు చెయ్యగలిగారని విచారించగా, ఈ బృందసభ్యులు గ్రామాలలోని మున్సబ్ మరియు కరణాలను, తదుపరి తహశీలు కార్యాలయాలను పెద్ద గ్రామాలలోని భూకామందులను సంపర్కములో పెట్టుకొని కావలసిన సమాచారాన్నంతటిని సేకరించారు. ఈ వివరాలనన్నింటిని కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యాలయానికి అందజేశారు. దీనిని చూసి పండిత గోవిందవల్లభపంత్ ఆశ్చర్యచకితుడై శ్రీరామ్‌ను అభినందించాడు.

శ్రీరామ్ పనిచేసెడి విధానాన్ని తెలుపుచూ ఇన్‌స్పెక్టర్ మార్టిన్ తన నివేదికలో వ్రాశాడు. ఈ వార్త గాంధీజీ చెవిన పడింది. "శ్రీరామ్ లాంటి వ్యక్తి జిల్లాకు ఒకరు ఉన్నచో స్వాతంత్ర్య సముపార్జన లక్ష్యాలను ఒక నెలరోజుల్లో సాధించవచ్చు" అని గాంధీజీ అన్నారు. నైనిటాల్ సమావేశాల్లో, శ్రీరామశర్మను గాంధీజీ తన వద్దకు పిలిపించుకొని అతని పని విధానాన్ని మెచ్చుకుంటూ వివరాలు అడిగి తెలిసికొన్నారు. తదుపరి కార్యకర్తల సమావేశంలో శ్రీరామ్ పని విధానాన్ని శ్లాఘిస్తూ శ్రీరామ్ వంటి చురుకైన కార్యకర్తలున్నచో దేశ స్వాతంత్ర్యం అతి త్వరలో లభిస్తుంది, ఏ శక్తి దీనిని నిలువరింపజాలదు అని అన్నారట. దీనినే మార్టిన్ తన నివేదికలో శ్రీరామ్‌ను గురించి వ్రాశాడు.

## పాలకుల కుట్ర

మార్టిన్ రూపొందించిన నివేదికలోని అంశాలను జిల్లా పాలనా యంత్రాంగం తీవ్రంగా పరిగణించి, కాంగ్రెస్‌పార్టీ కలకత్తా సమావేశాలకు శ్రీరామ్ చేస్తున్న ప్రయత్నాలను ఒక కంట కనిపెట్టసాగింది. దీనితో పార్టీ సమావేశాలకు ముందుగనే శ్రీరామ్‌ను నిర్బంధించవచ్చుననెడి ప్రచారము ఊపందుకొంది.

దీనితో శ్రీరామ్ తన ఉనికిని, కదలికలను రహస్యంగా ఉంచాడు. కాంగ్రెస్‌పార్టీ కార్యకర్త వేషధారణను కట్టిపెట్టి ధోతీ కుర్తా ధరించసాగాడు. గడ్డమును పెంచసాగాడు. రైతు కుమారునిలా వేషాన్ని మార్చాడు.

గడ్డం పెరిగేటంత వరకు గ్రామంలోనే ఉన్నాడు. ఈలోపు 200 మంది కార్యకర్తలను తయారుచేశాడు. పట్టణాల్లో కూడా ప్రజలతో సంపర్కం పెట్టుకున్నాడు. కాని రెండు మాసాలకే తన ఆచూకీ బహిర్గతమైంది. దీనితో ఆయనపై పోలీసుల నిఘా పెరిగింది. శ్రీరామ్ జాగరూకత వహించి అప్పుడప్పుడు అచ్చటికి వెళ్ళుతూ, రోజంతా అనేకమందిని కలసి, చీకటి పడగానే ఆగ్రాలోని ఒకరి ఇంటిలో బసచేసేవాడు.

శ్రీరామ్ కదలికలను పోలీసులు ఎప్పటికప్పుడు నిఘావేసి ఉంచారని తెలుసుకున్న వెంటనే తన మకాంను ఆగ్రా నుండి మార్చివేశాడు. కలకత్తా అచ్చటికి 1300 కిలోమీటర్ల దూరంలో ఉంది. దారిలో కార్యకర్తల కలుస్తూ సమావేశాల నాటికి కలకత్తా చేరుకోవాలని నిశ్చయించుకున్నాడు. మార్చినెల మొదటి వారంలోనే రెండు జతల బట్టలతో గ్లాసు, కొన్ని పుస్తకాలున్న సంచితో ఆగ్రా నుండి కలకత్తాకు బయలుదేరాడు.

*(సశేషం)*

*– అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**మనం ఎంత ఇచ్చామన్నది ముఖ్యం కాదు - మనకున్న దానిలో ఎంత ఇచ్చామన్నది ముఖ్యం**

శ్రీకృష్ణ జన్మాష్టమి ప్రత్యేకం

# భగవంతుడు సాక్షిభూతుడు! నిరంతరం మన కర్మల అవలోకిస్తూ ఉంటాడు

బాల్యము నుండి ఉద్ధవుడు కృష్ణునితోనే ఉన్నాడు. ఆయన రథచోదకునిగా సేవలను అందిస్తూ ఉన్నాడు. కృష్ణుడిని ఎన్నడూ ఏమి యాచించి ఎఱుగడు – దీనిని గమనించిన కృష్ణుడు– తాను అవతారము చాలించే సమయం ఆసన్నమైనవేళ ఉద్ధవుడిని పిలిచి, 'ఎందరో నన్ను వరాలు అడిగారు. నీవు ఏమి అడగలేదు – ఇప్పుడు అడుగు ఇస్తాను. నీకు కూడా కొంత మేలు చేసిన తదుపరి ఈ అవతారాన్ని సంతృప్తిగా చాలిస్తాను' అన్నాడు. ఐనా ఉద్ధవుడు తన కొరకు ఏమి అడగలేదు. కృష్ణుని బోధనలకు, చర్యలకు మధ్యగల వ్యత్యాసాన్ని అర్థం చేసికొనుటకై ప్రయత్నించాడు. "మీరు మమ్ములను ఒక పద్ధతిలో జీవించమన్నారు. మీరు దీనికి భిన్నంగా జీవించారు. భారతకథలో మీరు ఆడిన నాటకం నాకు అర్థం కాలేదు. నాకు దీనిని వివరించమని" కృష్ణుడిని కోరాడు ఉద్ధవుడు.



**"దుర్యోధనుడు, శకునితో పాచికలాడెడి వేళ పాండవులను కృష్ణుడెందుకు రక్షించ లేదు?" అని అడిగాడు ఉద్ధవుడు.**

దీనికి కృష్ణుడే స్వయంగా చెప్పిన సమాధానము "ఉద్ధవా! యుద్ధభూమిలో అర్జునునికి భగవద్గీత బోధించాను. నేడు నీకు ఉద్ధవగీతను బోధిస్తున్నాను. సావధానచిత్తుడవై విను." "కృష్ణా! నిజమైన స్నేహితుడెవ్వరు?" అన్న ప్రశ్నకు "నిజమైన స్నేహితుడు అవసరానికి అడగకుండానే వచ్చి స్నేహితునికి సహాయమందిస్తాడు" అని జవాబిచ్చాడు కృష్ణుడు. "కృష్ణా! నీవు పాండవులకు ఆపద్బాంధవుడవు. నిన్ను వారంతా మనస్ఫూర్తిగా విశ్వసించారు. నీకు జరుగుచున్నది తెలుసు. జరుగబోయెడిది తెలుసు. నీవు గొప్పజ్ఞానివి. ఇప్పుడే నిజమైన స్నేహితునికి నిర్వచనం చెప్పావు. ఈ నిర్వచనానికి అనువుగా నీవు ఎందుకు పని చేయలేదు? ధర్మరాజును పాచికలాడకుండా ఎందుకు నిరోధించలేదు? ధర్మజునికి అనుకూలంగా అతని అదృష్టాన్ని ఎందుకు మార్చలేదు. కనీసం తన సంపదలను ఓడినప్పుడైనా ధర్మజుడిని జూదక్రీడ నుండి నిలిపి వుండవలసినది. తను తన రాజ్యాన్ని కూడా ఓడిపోయాడు. కనీసం ఆయన తన తమ్ములను పందెములో పణముగా పెట్టినప్పుడైనా నీవు జూదశాలకు వెళ్ళి ధర్మజుడిని నివారించలేదు. ద్రౌపదిని పందెంలో పణంగా పెట్టినవేళ ధర్మజుని తమ్ములను, సంపదలను, రాజ్యాన్ని తిరిగి ఇస్తానని దుర్యోధనుడు ప్రలోభ పెట్టినప్పుడైనా నీవు నీ దైవీశక్తిని ఉపయోగించి, జూదములో పాచికలాడే పావులను ధర్మజునికి అనుకూలంగా పడేలా చేయలేదు. పైపెచ్చు ద్రౌపదికి నిండుసభలో మానభంగము జరుగుచున్నప్పుడు నేను సహాయం చేశాను అని చెప్పుకొన్నావు. ద్రౌపదిని నిండుసభకు ఈడ్చుకొని వస్తూ ఉంటే చూస్తూ ఊరుకున్నావు. ఆమెను వివస్త్రను కావించుట మొదలుపెట్టిన పిదప చీరలిచ్చి నేను ద్రౌపదిని కాపాడానని చెప్పుకున్నావు! ఇదేమి ధర్మం? మనిషి ఆపదలోనున్నప్పుడు మాత్రమే సహాయ పడెడివానిని ఆపద్బాంధవుడని ఎలా పిలువగలము?" ఇలా మాట్లాడుతూ ఉన్న ఉద్ధవుని కన్నులు చెమర్చాయి!

పై ప్రశ్నలన్నీ భారతం చదివిన వారందరి మనస్సుల్లో మెదలుతాయి. మన తరపున ఉద్ధవుడు వీనిని లేవనెత్తాడు.

ఉద్ధవుని పలుకులను విన్న కృష్ణుడు నవ్వి ఇలా బదులు పలికాడు – "ప్రియమైన ఉద్ధవా! ఈ ప్రపంచాన్ని పాలించే

**సలహాలు ఇవ్వడం కన్నా సహాయాన్ని అందించడం ఉత్తమమైన పని**

చట్టము – "వివేకమున్నవాడే విజయాన్ని పొందుతాడు" అని చాటుచున్నది. దుర్యోధనునికి వివేకమున్నది. ధర్మజుడు దానిని కోల్పోయాడు, అందువలన ధర్మరాజు ఓడిపోయాడు." కృష్ణుని జవాబు విన్న ఉద్ధవుడు తికమకకులోనైనాడు, అవాక్కయ్యాడు! కృష్ణుడు తన జవాబును కొనసాగిస్తూ "దుర్యోధనుని వద్ద జూదమాడుటకు లెక్కకు మించిన ధనమున్నది. కాని ఆయనకు పాచికలతో ఆడుట తెలియదు. అందువలన తన వివేకాన్ని ఉపయోగించి తన మేనమామయైన శకుని సహాయం కోరి ఆయనతో పాచికలు వేయించాడు. కాని ధర్మజునికి ఇది లేనందున తనకు అప్పుడనైన నా సహాయాన్ని కోరలేదు. కాని నేను, శకునితో పాచికలాడి ఉన్నచో ఎవరు గెలిచేవారో నీవు ఊహించుకోగలవు. నాచేత ఆటను ఆడించాలనెడి వివేకాన్ని, విషయాన్ని ధర్మజుడు మరచాడు. ఇదేకాక వివేకాన్ని కోల్పోయిన ధర్మజుడు మరో తప్పు చేశాడు. నన్ను జూదశాలకు రావద్దని ప్రార్థించాడు, దురదృష్టం కొద్దీ తాను ఈ ఆట ఆడవలసి వచ్చిందని నాకు తెలియకూడదనుకున్నాడు. తన ప్రార్థనలతో నన్ను కట్టివేశాడు. చేసేది లేక నేను జూదశాల వెలుపల నిలబడ్డాను. ఎవరైనా నా సహాయాన్ని తమ ప్రార్థనతో కోరతారేమోనని ఎదురుచూస్తూ నిలబడ్డాను. భీమార్జున నకుల సహదేవులు పందెంలో ఓడిపోయినప్పుడు, వారు కూడా దుర్యోధనుడిని నిందించారే తప్ప నా సహాయాన్ని అర్థించలేదు. చివరకు దుశ్శాసనుడు తన కొప్పు పట్టుకొని ఈడ్చుచున్నప్పుడు కూడా ద్రౌపది నా సహాయాన్ని కోరలేదు. తనకున్న శక్తి యుక్తులతో తాను వాదించిందే తప్ప నన్ను పిలవలేదు. చిట్ట 1చివరకు దుశ్శాసనుడు తన వలువలు విప్పుట ప్రారంభించగా, శక్తిహీనురాలై తన శక్తి చాలదని గ్రహించి హరీ! హరీ! అని ఎలుగెత్తి నన్ను పిలిచింది. అప్పుడు ఆమెకు, పాండవులకు సహాయం చేయుటకు నాకు అవకాశం లభించింది. మరుక్షణంలో ఆమెను రక్షించాను. దీనిలో నా తప్పు ఏమిటో చెప్పు? అన్నాడు కృష్ణుడు.

"భళా! కన్నా! నీ వివరణ అద్భుతం కృష్ణా! నేను సంతృప్తి పడ్డాను. మరో ప్రశ్న నిన్ను అడుగుతాను అనుమతించు అనగా కృష్ణుడు తల పంకించాడు.

"ఐతే! నిన్ను ఏరి కోరి పిలిస్తేగాని వచ్చి సహాయపడవన్న మాట? నీ అంతటగా నీవు న్యాయాన్ని పరిరక్షించుటకు, సహాయం చేయుటకు రావన్నమాట?" అని ప్రశ్నించాడు ఉద్ధవుడు.

కృష్ణుడు నవ్వుతూ – "ఉద్ధవా! ఈ జన్మలో ప్రతివారి జీవితం వారి కర్మననుసరించి సాగుతుంది. నేను నడిపించను, నేను జోక్యం చేసికోను – నేను కేవలం సాక్షిగా మాత్రమే ఉంటాను. మీకు దగ్గరగా ఉండి, మిమ్ముల పరిశీలిస్తూ ఉంటాను. ఇదే దేవుని ధర్మము."

"ఓ! చాలా బాగుంది కృష్ణా! ఐతే మాకు దగ్గరగా ఉండి మా పనులను సాక్షిగా చూస్తూ ఉంటావన్నమాట. మేము తప్పుల మీద తప్పులు చేస్తూ ఉంటే నీవు చూస్తూ మా కర్మకు మమ్ముల వదిలేస్తావన్నమాట" అన్నాడు ఉద్ధవుడు.

"ఉద్ధవా! ఈ మాటలలోని అంతరార్థాన్ని గుర్తించు! నేను సాక్షిగా నీ ప్రక్కన నిలిచి ఉన్నప్పుడు, నీవు నన్ను గుర్తిస్తే తప్పు ఎలా చేస్తావు? నీవు నిజంగా తప్పు చెయ్యలేవు! కాని ధర్మజుడు ఇదే తప్పు చేశాడు. నేను చూస్తూ ఉన్నానని, నాకు తెలియకుండా ఉండదనెడి సత్యాన్ని మరచాడు. అందుకే జూదమాడాడు. నేను సాక్షిభూతంగా ఉన్నాననెడి సత్యాన్ని గుర్తించి ధర్మజుడు పాచికలాడి ఉన్నచో దాని ఫలితం వేరుగా ఉండేది సుమా!" అన్నాడు కృష్ణుడు.

దీనిని విన్న ఉద్ధవుని నోటివెంట మాటరాలేదు. భక్తిలో లీనమైపోయాడు! "ఎంత లోతైన ఆధ్యాత్మికత? ఎంతటి నిజము దాగి ఉంది. భగవంతునికై ప్రార్థన, పూజ, ఆయన సహాయాన్ని కోరుట మున్నగువన్నీ మనలోని భావాలు మరియు మన నమ్మకము. ఆయన ఎఱుకలేనిదే ఏదీ జరుగదు అని మనం నమ్మితే ఆయన సాక్షిగా ఉన్నాడనెడి సత్యాన్ని మరువం!"

భగవద్గీత పొడవునా కృష్ణుడు దీనినే అర్జునునికి బోధించాడు. ఆయనే అర్జునుడి రథసారథిగా నిలచి, మార్గదర్శకుడై నడిపించాడే కాని, తనంతతానుగా యుద్ధము చేయలేదు. ఆయనను మన లోపల – మన వెలుపల సాక్షిగా గుర్తించుట మరువవద్దు. ఆయనలో లీనం కండి. ఆ చైతన్యాన్ని అనుభూతి చెందండి. నీలోనున్న ఆ దివ్యశక్తిని అవలోకించు. విశుద్ధమైన ఆ ప్రేమను, చిదానందాన్ని, పరమచైతన్యాన్ని అనుభూతి చెందు.

'తత్త్వమసి' – నీవే బ్రహ్మం

*సంకలనం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**మనకు కోపాన్ని, దుఃఖాన్ని కలిగించే విషయాల కంటే మన కోపం, దుఃఖమే మనల్ని ఎక్కువ బాధిస్తాయి**

జీవన సాధనకు బంగారు సూత్రములు-5

# కర్మకాండలు భావసంవేదనలతో కలవాలి

భగవంతుడిని ఎవరూ చూడలేదు మరియు ఆయన సర్వవ్యాపి, నిరాకారుడైన కారణంగా చూచే వస్తువు కాదు. ఆయన ప్రతీకగా ప్రతిమ తయారుచేయబడుటకు కారణము ఏమనగా మానవ కళేబరంలో ఉత్కృష్టతకు సంబంధించిన భావ – శ్రద్ధలను ఈ మాధ్యమం ద్వారా జోడించి పరబ్రహ్మం యొక్క ప్రత్యేకతలను మననం చేసుకొనుట సాధారణమైన వారికి వీలగుట కొరకే. జాతీయపతాకంలో దేశభక్తి యొక్క భావశ్రద్ధలను జోడించి దానిని గర్వంతో, గౌరవంతో ఎగుర వేయుట ద్వారా దానిపట్ల సముచిత మర్యాద చూపించబడు తుంది. అదేవిధంగా సర్వవ్యాపి, న్యాయనిష్ఠాశక్తిని ప్రతిమలో ఆపాదించి, భావశ్రద్ధలను ఆ స్థాయికి పెరుగునట్లు చేయబడు తుంది. ఈవిధంగా అతను సత్ప్రవృత్తుల సమూహమైన పర బ్రహ్మతో జోడించబడి గొప్ప యోగ్యుడిగా తయారుకాగలడు.

భగవంతుడిని దర్శించుకోవాలని ఉవ్విళ్ళూరుతున్న అర్జునుడు, కాకభుశుండి, యశోద, కౌసల్య మొదలైనవారి సాకారదర్శనము యొక్క ఆసక్తి అలాగేవుంటే వారికి తత్త్వ జ్ఞానము యొక్క ప్రకాశ ప్రేరణ ఈ విశాల విశ్వమే–విరాట్ బ్రహ్మ యొక్క ప్రతీక అని తెలియజేసింది. **విశ్వరూప దర్శనము వివరిస్తూ గీతాచార్యుడు విశ్వవ్యాపి ఉత్కృష్టతే ఉపాసన చేయదగిన ఈశ్వరసత్తా అని తెలిపాడు.** ఆయనను సమస్త విశ్వబ్రహ్మాండం యొక్క నియామక సూత్రసంచాలకుడని తెలుసుకోవాలి. ఆయనను క్రమశిక్షణ, సంతులనము, సునియోజనము మొదలైనవాటి రూపమని వైజ్ఞానికదృష్టితో తెలుసుకొనవచ్చును. ఆయన యొక్క అనుభూతి భావశ్రద్ధల రూపంలో మాత్రమే కలుగుతుంది. తన్మయత్వం చెంది తద్రూపంగా కాగలిగితేనే ఆయనను పొందగలము.

అగ్నితో కలిసి ఏకాత్మత చెందడానికి ఇంధనం ఆత్మ సమర్పణ చేయవలసి ఉంటుంది మరియు తన స్వతంత్ర అస్తిత్వమును రద్దుచేసుకొని తదనుగుణముగా అయ్యే సాహసము సమకూర్చుకొనవలసి ఉంటుంది. భగవంతుడు మరియు జీవుని కలయిక ఇదే ప్రక్రియ. కాలువ నదిలో కలవాలి. నీరు పాలతో కలిసిపోయి అటువంటి రుచినే ధారణ చేయవలసి ఉంటుంది. భార్యాభర్తలు ఇటువంటి సమర్పణ మానసికస్థితిని అవలంబించి ద్వైతం నుండి అద్వైతస్థితికి చేరుతారు. **మనిషి కూడా ఎప్పుడు దైవత్వసంపదను కలిగి ఉంటాడో అప్పుడు దేవుడుగా తయారౌతాడు** మరియు ఎప్పుడు అతనిలో పరమాత్మ వంటి వ్యాపకత కలిసిపోతుందో అప్పుడు ఆత్మయొక్క స్థితి పరమాత్మ వలె అవుతుంది. అతనిలో చాలా పరివర్తనములు చేయగలిగే అలౌకికత వస్తుంది. ఋషులు మరియు సిద్ధపురుషులకు ఇదే ఆధారంపై మంచి పేరు, గౌరవము ఇవ్వబడుతుంది.

## ప్రతీక పూజ యొక్క తత్త్వదర్శనము (జ్ఞానము)

వేరువేరు మతములు మతాంతరములకు అనుగుణంగా విభిన్న విధాలైన పూజ–పద్ధతులు, క్షేత్రం లేక సాంప్రదాయాల్లో ఆచరణలో చూడగలము. వాటన్నింటి వెనుకనున్న ఒకే నిజం మరియు రహస్యం ఏమిటంటే తనని తాను సంస్కరించుకుని సువ్యవస్థితముగా తయారగుట. ఇదే భగవంతునికి చేసే ఒకే పూజ, ఉపాసన మరియు అభ్యర్థన. విశ్వవ్యవస్థలో నిరంతరం లగ్నమై ఉన్న పరమేశ్వరునకు ఇంత మంది భక్తుల ప్రార్థనలను విని చిత్రవిచిత్రమైన కానుకలను స్వీకరించుటలో సమయము గడుపునంత తీరికలేదు. అభ్యర్థన లనేవి తమను తాము ఉత్కృష్టత మార్గములో పయనించుటకు స్వయం–సంకేత రూపములో నిర్మించబడ్డాయి.

భగవంతునిపై ఎవరియొక్క పొగడ్త లేక నిందల యొక్క ప్రభావం ఉండదు. పూజారి నిత్యం ప్రశంసలను వినిపిస్తుంటాడు మరియు నాస్తికుడు వేలాది తిట్లు వినిపిస్తుంటాడు. ఈ వ్యర్థ ప్రలాపముల ప్రభావము ఆయనపై ఉండదు. దీనంగా వేడుకొన్నా, ప్రార్థించినా సెలక్షన్‌బోర్డు ఎవరినీ అధికారిగా నియమించదు. స్కాలర్‌షిప్ పొందుటకు మంచి మార్కులు సంపాదించి పోటీలో గెలుచుట తప్ప వేరే ఏవిధంగా కూడా పని జరుగదు. భగవంతుడికి కూడా సునిశ్చితమైన విధానము ఉన్నది.

**నిన్నటి గురించిన పశ్చాత్తాపం, రేపటి గురించిన భయంలేనివాడు తృప్తికరంగా బ్రతుకుతున్నట్లే**

**భగవంతుని ప్రసన్నత ఒకే కేంద్రబిందువు వద్ద కేంద్రీకృతమై ఉంటుంది. అదేమిటంటే ఆయనయొక్క విశ్వ ఉద్యానవనమును సుందరము, సమున్నతముగా తయారు చేయుటకు ఎంత సమర్పించారు. ఉపాసనాత్మక కర్మకాండలు ఈ సునిశ్చిత వ్యవస్థను తెలుసుకుని - అంగీకరించి ఆచరించుటకు చేయబడతాయి.** కర్మకాండలు ఏదో మొక్కుబడిగా పూర్తి చేసి భగవంతుని ఆదేశము, క్రమశిక్షణను తిరస్కరిస్తూవుంటే ఇది కేవలం బాలక్రీడ అని అనుకోవాలి. దానివల్ల ఎవరికీ ఏవిధమైన మేలూ జరుగదు.

దైవపూజకు సంబంధించిన కర్మకాండలను ప్రతీకోపాసన అంటారు. దాని తాత్పర్యం సంకేతములను ఆధారము చేసుకొని క్రియాకలాపములను నిర్ధారణ చేయుట. దైవం యొక్క ప్రతిమ ఒక పూర్ణమానవుని ఊహ, ఆ ప్రతిమను ఉపాసించేవారు కూడా ఎట్టి పరిస్థితిలోనైనా సర్వాంగసుందరం మరియు నవ యువకులకు ఉండే మానసికస్థితిలో తయారైవుండాలి. దేవతలు మాతృశక్తికి ప్రతీకలు. యువతి మరియు సౌందర్యవతి అయి ఉన్నా కూడా వారిని చెడు దృష్టితో చూడరాదు. బదులుగా పవిత్రత యొక్క గౌరవమును పెంపొందింప జేసుకుంటూ వారికి శ్రద్ధతో నమస్కరించాలి. స్త్రీల యెడల ప్రతి ఒక్క సాధకుని యొక్క భావములు ఈ స్థాయిలో నిర్మించబడి అభివృద్ధి చెందాలి.

పూజ-అర్ఘ్యంలో జలం, అక్షతలు, చందనం, ధూపం, దీపం, నైవేద్యం మొదలైనవి సేకరించి ఉంచబడుతాయి. దాని తాత్పర్యమేమంటే వాటిని గురించిన సంకేతములను గుర్తుంచుకొని తమ పద్ధతులను నిర్ధారణ చేసుకోవాలి.



జలము యొక్క అర్థం - చల్లదనం. మనస్సు శాంతంగా, సౌమ్యంగా మరియు సంతులితంగా ఉండాలి.



ధూపం వెనుక ఉన్న దిశానిర్దేశమేమంటే మనము వాతావరణమును సత్ప్రవృత్తులతో నింపి సుగంధితం చేయాలి.



దీపం యొక్క గుర్తు ఏమనగా జ్ఞాన ప్రకాశమును వ్యాపింపచేయుటకు మనము మన సాధనలు, శక్తులను సమర్పించుటకు తయారుగా ఉండాలి.



చందనమనగా సమీపముగా ఉండే వారిని మన మాదిరిగానే సుగంధితం చేయాలి. మోసము, ఒత్తిడి కలుగజేసే వికట పరిస్థితులున్నప్పుడు కూడా ఆనందించి, ఆనందాన్ని కలుగజేసే నైజాన్ని వదలరాదు.



పుష్పములనగా చక్కగా నవ్వుతూ-నవ్విస్తూ, ఆడుతూ-ఆడిస్తూ ఉండే మంచి స్వభావమును అలవరచుకోవాలి.



అక్షతల అర్థమేమనగా తన ఆదాయంలో ఒక భాగము దివ్య ప్రయోజనాల కొరకు నియోగించుటలో అచంచల నిష్ఠ కలిగి ఉండుట, ఉదారంగా ఉండగలుగుట వగైరా.

భగవంతునికి ఈ వస్తువులతో అవసరం ఉంటుందని కాదు. ఈ ప్రతీక సమర్పణ ద్వారా మనము దైవత్వమును పొందుటకు మన వ్యక్తిత్వమును పాత్రతతో సుసజ్జితము చేసుకునేవిధంగా మనకు మనమే సుశిక్షితుల మౌతున్నాము.

రైలుగార్డు ఎఱుపు మరియు పచ్చని జెండాలను చూపుతాడు. రంగులలో ఏమీ వుండదు కానీ జెండాలను చూపగానే ఆగుటకు మరియు సాగిపోవుటకు సంకేతము లభిస్తుంది. దానిని అర్థము చేసుకొని పనిచేయుటలోనే రైలు-వ్యవస్థ నిర్మించబడినది. ఉపాసనకు సంబంధించిన క్రియా కృత్యాలలో భగవంతుడిని సంతోషపరచుట, బుజ్జగించుట వల్ల ఏమీ పొందలేము. పాత్రతను నిరూపించుకోకుండా, పురుషార్థమునవలంభించకుండా మనస్సు కోరిన కోరికలు కించిత్తయినా నెరవేరవు. సాధారణంగా ప్రజలు భ్రమలోనే మునిగివుంటారు. విత్తనములు చల్లి నీరు పోయకుండా కేవలం ప్రార్థన, బ్రతిమాలుట వల్ల పంట చేతికి రాదు.

## ఉపాసన - ధ్యానము - ధారణ యొక్క స్వరూపము మరియు మర్మము

పూజావిధానంలో ప్రజ్ఞాపరివార పరిజనులు సాధారణంగా తమ తమ ఇష్టము మరియు వీలుని బట్టి జపం, ధ్యానము

**దుఃఖాన్ని నివారించుకొనుటకై మరో కొత్త విషయాన్ని నేర్చుకోండి**

మరియు ప్రాణాయామముల నాచరిస్తారు. ఈ మూడింటి యొక్క ప్రాణప్రవాహం వరముగా అవతరించుటకు ఈ మూడింటి వెనుక అవిచ్ఛిన్నంగా కలిసి ఉండే ప్రేరణలను అవలంభించాలి.

**నామజపం యొక్క తాత్పర్యమేమిటంటే ఏ పరమేశ్వరుడిని, ఆయన నియమములను సాధారణంగా మర్చిపోతుంటామో, మరియు పలుమార్లు స్మృతిపటలంపై ముద్రించుకుని మరచిపోయే తప్పిదము చేయకుండుట.**

సురదుర్లభమైన మానవ జీవితము యొక్క గొప్పతనము దానితో కలిసున్న స్రష్ట యొక్క ఆకాంక్షను అర్థము చేసుకుని ఆచరించే మానసికస్థితి కలిగుండుటకు నిత్యము ప్రయత్నం చేయుటయే నామజపము యొక్క మాహాత్మ్యం. సబ్బుతో రుద్దితే శరీరం మరియు బట్టలు కూడా శుభ్రపడతాయి. రుద్ది రంగు అద్దితే గుర్తులుపడుటకు మరియు మెఱయుటకు అవకాశం కలుగుతుంది. జపం చేసేవారు తమ వ్యక్తిత్వమును ఈ ఆధారం పైనే వికసింపజేసుకోవాలి.

ఎవరిని ధ్యానం చేస్తామో వారిని లక్ష్యంగా పెట్టుకొని తద్రూపంగా తయారగుటకు ప్రయత్నం చేయబడుతుంది. రాముడు, కృష్ణుడు, శివుడు మొదలైనవారి ధ్యానధారణ యొక్క ప్రయోజనము ఇదియే అనగా ఆ స్థాయి గొప్పతనముతో మనం ఓతప్రోతమవ్వాలి. పరిజనులు తరచుగా గాయత్రీమంత్ర జపం మరియు ఉదయించే సూర్యుణ్ణి ధ్యానం చేస్తారు.

### గాయత్రీ అనగా సామూహిక వివేకశీలత!

ఈ ప్రక్రియతో ప్రేరేపించబడుటయే గాయత్రీజపము. సూర్యుని యొక్క రెండు ప్రత్యేకతలు సుపరిచితమే. ఒకటి ఉష్ణము, రెండు ప్రకాశము. మనము జ్ఞాన రూప ప్రకాశము నుండి ఎల్లవేళల ప్రగతిశీలతను, సత్ప్రవృత్తులను వ్యాపింప చేయాలి. స్వయంగా ప్రకాశించండి. ఇతరులను ప్రకాశింప జేయండి.

**వెచ్చదనము మరియు కాంతి యొక్క ప్రకాశం జీవితంలోని ప్రతిక్షణంలో, ప్రతి కణములో పడుగు-పేకలవలె కలిసి పోవాలి. ఇదే సూర్యధ్యానం వలన ముఖ్య ప్రయోజనము.**

ధ్యాన సమయంలో శరీరంలో ఓజస్సు, మస్తిష్కములో తేజస్సు మరియు అంతఃకరణంలో వర్చస్సు యొక్క అవిచ్ఛిన్న వర్షం కురుస్తున్న భావన చేయబడుతుంది. ఈ ప్రక్రియను కల్పన-జల్పన అని అనుకుని వదలివేయరాదు. బదులుగా తదనుగుణంగా తన్ను తాను నిర్మించుకునే ప్రయత్నం కూడా ప్రాణములను పణంగా పెట్టి చేయాలి.

ప్రాణాయామంలో ముక్కు ద్వారా బ్రహ్మాండంలో వ్యాపించి ఉన్న ప్రాణతత్త్వమును లాగుట, ధారణ చేయుట మరియు లోపల దాగి ఉన్న అశుభమును చిమ్మివేసే భావన చేయబడు తుంది. ప్రపంచములో మంచీ-చెడూ రెండూ ఉన్నాయి. కానీ మన కొరకు దివ్యత్వం పొందుట మాత్రము తగినట్లు అనుకోవాలి. శ్రేష్ఠము, ఉత్కృష్టము ఐనదానినే పట్టుకుని, మనలో ప్రతిష్ఠించుకొనే ప్రయత్నం చేయాలి. నిరంతరం విరక్తుడు, దుర్బలుడు, పిరికివానిగా ఉండవలదు. బదులుగా తమలో, తమ పరిసరాల్లో ఉప్పొంగిన పాణచైతన్యమును వ్యాపింపజేయుటలో లగ్నమయ్యే విధంగా శక్తివంతులుగా తయారవ్వండి.

జపము, ధ్యానము మరియు ప్రాణాయామ క్రియ-ప్రక్రియలను సాధకులు చాలాకాలం నుండి ఆచరిస్తూ వస్తున్నారు. ఏమైనా సందేహములుంటే దగ్గరలో ఉన్న ఎవరైనా తెలిసినవారిని అడిగి ఆ లోపమును పూరించుకొనవచ్చును. తన వీలునుబట్టి సమయం మరియు కృత్యములలో అవసరమైన మార్పులు కూడా చేసుకొనవచ్చును. కానీ ఒక్క విషయము మాత్రం మర్చిపోకూడదు, కర్మకాండల వెనుక ఆత్మవికాసము మరియు సమాజము యొక్క అభివృద్ధికి చెందిన ఏ సూచనలు నిండివున్నాయో వాటిని ముఖ్యమైనవిగా భావించాలి. కర్మకాండను గ్రుడ్డిగా అనుసరించుట కాక ప్రేరణతో నిండిన మానసికస్థితిని సమున్నతము - సుసంస్కృతము చేయాలి.

సాధనతో పాటు చలామణిలో నున్న ఒక విషయ మేమిటంటే గురువారంనాడు తేలికగా ఉపవాసం చేయాలి. బ్రహ్మచర్యము పాటించాలి. రెండింటి వెనుక సంయమన సాధన యొక్క జ్ఞానము కలిసివున్నది. ఇంద్రియసంయమం, సమయ సంయమం, అర్థసంయమం మరియు విచార సంయమమునకు సంబంధించిన ప్రక్రియ పెంచి, ఫలించి పుష్పింపజేస్తే పైన చెప్పిన ఆ నాలుగు సంయమములపై పట్టు చాలా గట్టి చేస్తూ సాధకులను నిజమైన అర్థములో తపస్విగా తయారుచేసే స్థితి వరకు నెట్టుకొని వెళ్తుంది. ఓజస్వీ, తేజస్వీ, మనస్వీగా

మృదువైన పదాలు కఠినమైన హృదయాలను కరిగిస్తాయి

తయారయ్యే త్రివిధ లక్ష్యం ప్రాప్తించుట కొరకు చేయు ప్రయత్న శీలురనే నిజమైన అర్థంలో తపస్వి అంటారు. తపము యొక్క దివ్యశక్తి, సామర్థ్యం వలన ఆధ్యాత్మికక్షేత్రంలోని ప్రతి అనుయాయి బాగుగా పరిచితం మరియు ప్రభావితం అవ్వాలి.

స్నానం, భోజనం, నిద్ర, మలవిసర్జన వంటి నిత్యకృత్యముల వలె ఉపాసన-ఆరాధన కొరకు కూడా నిత్యము కొంత సమయం ఉండాలి, ఆవిధంగా జీవిత లక్ష్యమును హృదయంగమము చేసుకొనుటలో మరపు లేక నిర్లక్ష్యము ఉత్పన్నము కాకూడదు. ప్రాతఃకాలమున కళ్ళు తెరిచిన వెంటనే క్రొత్త జన్మ జన్మించినట్లు భావించాలి మరియు ఈరోజులో వున్న అవధిని ఒక జీవితమని భావిస్తూ దినచర్యలో సమయం, శ్రమ, చింతన మరియు వ్యవహారములలో అధికమైన ఉత్కృష్టత ఉండునట్లుగా తయారు చేయాలి. ప్రాతఃకాలమున తయారై దానికి అనుగుణంగా ఆ రోజును గడపాలి. అందులో ఏవిధమైన నిర్లక్ష్యం, తడబాటు ఉండే అవకాశము ఉండరాదు.

ఇదేవిధంగా రాత్రి నిద్రపోయే సమయంలో ఒకరోజు జీవితంలో అంతమైపోయినట్లు భావిస్తూ ఆరోజున చేసిన క్రియా కలాపములను ఎంత కఠినముగా సమీక్షించుకోవాలంటే జరిగిన పొరపాట్లకు రెండవరోజు ప్రాయశ్చిత్తం చేసుకొన గలగాలి మరియు తరువాతి రోజు అధికమైన సత్కర్మలతో అధికమైన నిజాయితీ అవలంభించగలగాలి.

దానము, పుణ్యము, తీర్థయాత్ర, పరమార్థము వంటి ధర్మకార్యముల కొరకు అంతరంగములో తేలికైన లేక తీవ్రమైన ఉల్లాసం ఉంటుంది. దీనిని కూడా భగవంతుని సంకేతము లేక సలహాగా భావించి అవలంబించుటలో ఎంతో కొంత ప్రయత్నం చేయాలి. సమయమున కనుగుణంగా వీటన్నింటి సమన్వయం వివేక విస్తార ప్రక్రియలో కేంద్రీకృతమవుతుంది.

జ్ఞానయజ్ఞం, విచారక్రాంతి లేక లోకమానస సంస్కరణ, సత్ప్రవృత్తి సంవర్ధన మొదలైన పేర్లతో వీటినే ప్రతిపాదించారు. దీనినే సమయం యొక్క పిలుపు, విశ్వాత్మ యొక్క కేక అని కూడా అంటారు.

భ్రష్టచింతన మరియు దుష్ట ఆచరణే లెక్కలేనన్ని సమస్యలను మరియు సంకటముల సమూహమును నిలబెట్టాయి. వీటన్నింటియొక్క నివారణ, నిరాకరణ ఒకే ఉపాయ ఉపచారంతో సంభవమౌతుంది. అది-దూరదృష్టికల వివేక శీలతను జన మానసంలో పెంపొందించే ప్రయత్నం చేయుట. చింతన, నడవడిక మరియు వ్యవహారములో ఉత్కృష్టత యొక్క అభివృద్ధి, అంతఃకరణములో భావసంవేదన మేల్కొలుపుట ద్వారానే సాధ్యమవగలుగుతుంది. ఇదే మనకాలం యొక్క యుగ ధర్మము. దీనిని మహాకాలుని సవాలు లేక దివ్యశక్తి యొక్క భావపూర్ణ ఆహ్వానము అనికూడా అనవచ్చు. - *(సశేషం)*

*- ఊటుకూరి సత్యనారాయణ గుప్తా*

## మోహవశుడైనవాడు రాజైనా కర్తవ్యాన్ని మరుస్తాడు

*రాజా అశ్వినీదత్ తన మహల్ పట్ల, ధన సంపత్తుల పట్ల అత్యంత వ్యామోహం కలిగి ఉన్నాడు. ఈ మోహం క్రమక్రమంగా పెరుగుతూ ఉంది. దీనితో అశ్వినిదత్ తన రాజరిక కార్యాల పట్ల శ్రద్ధ చూపుట మానివేశాడు. దీనినంతా గమనించుచున్న ప్రధానమంత్రి అత్యంత చింతాక్రాంతుడై, దీనికి పరిష్కారాన్ని చూపమని కులగురువు సంత్ నాగానందుడిని ఆశ్రయించాడు. మంత్రి ప్రార్థన మేరకు కులగురువు రాజును కలిసికొనుటకై వచ్చాడు. రాజు కులగురువును సాదరపూర్వకంగా అనేకానేక బహుమానాలిచ్చి సత్కరించాడు. దీనికి బదులుగా కులగురువు రాజుకు ఒక కమలపుష్పాన్ని బహూకరిస్తూ ఇలా అన్నాడు - "మహారాజా! మీకు బహూకరించిన కమలం పూరేకులలో ఒక తుమ్మెద ఉన్నది." కాని రాజైన అశ్వనీదత్‌నకు కులగురువు చెప్పిన మాటలలోని అర్థము తెలియలేదు. దీనిని గమనించిన కులగురువు రాజు యొక్క సందేహాన్ని నివృత్తి చేయుటకై ఇలా అన్నాడు. మహారాజా! ఈ తుమ్మెద సాధారణమైనది కాదు. ఇది తుమ్మెదలలో రాజు వంటిది. ఈ తుమ్మెద ఎంతటి సామర్థ్యము కలిగి ఉంటుందంటే, అది కోరుకున్నచో గట్టి చెక్కనైనా తొలుచుకొని బయటకు రాగలదు. కాని అదే తుమ్మెద కమలం పైన పెంచుకొన్న మోహానికి బందీయై ఆ కమలపు పూరేకుల మధ్య చిక్కుకొని తన సహజ స్వభావాన్ని కోల్పోయింది! దీనితో రాజుకు కనువిప్పు కలిగి, తన మోహాన్ని వీడి తన కర్తవ్యమైన ప్రజాపాలనను నిర్వహించుటలో తిరిగి సంలీనమైనాడు.*

*- అనువాదం: ఎ. శారద*

**శ్రమదేహాన్ని బలపర్చినట్లు కష్టాలు మనిషి మెదడుని బలపరుస్తాయి**

# స్వాధ్యాయం - దాని లాభాలు

యుగ ఋషి పరమపూజ్య పండిత శ్రీరామశర్మ ఆచార్యులు స్వాధ్యాయంపై ఈ క్రింది లాభాలను తెలియజేశారు.

1. యుగ సాహిత్య స్వాధ్యాయం ద్వారా మానవునిలో దేవత్వము ఉదయిస్తుంది. భూమి స్వర్గంగా మారి యుగ నిర్మాణ సత్సంకల్పాలు పూర్తిచేయుటకు కావలసిన శక్తి లభిస్తుంది.
2. **దేవత్వము:** ఉత్తమ గ్రంథాల అధ్యయనం చేయుట ద్వారా మనిషి మహాపురుషునిగా, మహాత్మునిగా, ఋషి మరియు దేవతగా రూపుదాల్చగలడు.
3. **స్వర్గము:** స్వర్గము యొక్క రూపురేఖలు ఎక్కడా స్థల రూపంలో ఉండవు. ఉత్తమ పుస్తకముల మాధ్యమం సాన్నిధ్యం ద్వారా స్వర్గానుభూతిని పొందెదరు.
4. మంచి మంచి పుస్తకములు మనలను దేవతలగా మార్చి ప్రకాశవంతం గావిస్తాయి. వీనిని అధ్యయనం చేస్తూ మనన చింతనల గావించుట ద్వారా ఆచరణాత్మకమైన జీవన విధానాన్ని అలవరచుకొన్నచో తాత్కాలిక వరదానాలను పొంద వీలున్నది.
5. **దుఃఖనాశకము:** భీకర సంసార భవసాగరంలో మునిగి తేలెడి మనుష్యులందరికీ పుస్తకాలు సముద్రంలోని ఓడలకు వెలుగు నందించెడి వెలుగు స్తంభాల్లా మనిషికి మార్గదర్శనం చేస్తాయి. ఉత్తమ గ్రంథాల సహాయంతో మనుష్యులు భవ సాగరంలోని భయంకర అలలను (కష్టాలను) సరళతరం గావించి వానిని దూరం చేసుకోగలరు.
6. **సుఖము-శాంతి-సంతోషము:** జీవితము యొక్క ఆఖరి మరియు పరమ లక్ష్యము- విద్యావిస్తారం గావించి తద్వారా సుఖం, శాంతి మరియు సంతోషాల ప్రాప్తి గావించుకొనుట. అనగా దుఃఖము నుండి విముక్తి మరియు సుఖ ప్రాప్తిని పొందుట.
7. **పరమ పుణ్యము:** ధన ధాన్యాదులతో పాటు, సమస్త భూమండలాన్ని దానం చేయుట కన్నా మూడు రెట్లు లేక దాని కన్నా ఇంకా ఎక్కువ పుణ్యాన్ని చేకూర్చుతుంది.
8. **ఉపాసన పూజ:** ఉపాసన, పూజ, అర్చన, తపస్సు, వ్రతము, దానము వలన వానితో సమానంగా స్వాధ్యాయం చేయుట ద్వారా పుణ్య ప్రయోజనం లభిస్తుంది మరియు ఆదరపూర్వక ఆదరణ లభిస్తుంది.
9. **సమగ్ర రూపాంతరణ:** సంపూర్ణమైన మార్పును లేక సమగ్ర రూపాంతరాన్ని కోరుకొనెడివారు సద్విచారాల చదువుచూ, వాని అర్థాన్ని తెలిసికొంటూ, ఆచరణ చేసెడి ప్రయత్నం చెయ్యాలి
10. **వ్యక్తి నిర్మాణం:** ఆత్మశోధన మరియు ఆత్మనిర్మాణము అన్నింటికన్నా ప్రధానమైనవి-దీనికి స్వాధ్యాయం తప్పనిసరి.
11. **గురుదేవులతో సంభాషణ:** శ్రేష్ఠమైన సజ్జనులతో సంభాషించుట వారి సాహిత్యం ద్వారా చాలా సులభతర మవుతుంది. స్వాధ్యాయ మాధ్యమంగా ప్రతి నిమిషము ఇది లభిస్తూ ఉంటుంది.
12. **మంచి సంస్కారము:** సద్గ్రంథముల ద్వారా సన్నిహిత సాధువుల వాణిని నిరంతరం అధ్యయన, మననల చేయుటచే మనస్సున సుసంస్కారాలు స్థాపించబడతాయి. వీని ప్రభావముతో చిత్తము తనంతట తానుగా దుష్కార్యముల మార్గము నుండి వెనుతిరుగుతుంది.
13. **సరస్వతి:** సరస్వతిమాత స్వాధ్యాయుడిని అనుసరిస్తుంది.
14. **మనోరంజనం:** విద్య అధ్యయనం ద్వారా అత్యుత్తమ మనోరంజనను పొందెదము.
15. **సచ్చరిత్రత:** చారిత్రక ఉజ్జ్వలస్థితి, స్వాధ్యాయం యొక్క సాధారణ మరియు మనోవైజ్ఞానిక ఫలము.
16. **బుద్ధిమాని:** కావ్య శాస్త్రముల స్వాధ్యాయం చేసెడివారు కూడా బుద్ధిమంతులయ్యెదరు.
17. **ఈశ్వర ప్రాప్తి :** స్వాధ్యాయ యోగము, స్వాధ్యాయం లోపలి పరమాత్మను ప్రకాశవంతం గావిస్తుంది. స్వాధ్యాయం తగిన సాధనల ద్వారా పరమాత్ముడిని సాక్షాత్కరించుకొన గలిగే శక్తి నిస్తుంది. (వ్యాసభగవానుడు)

**విద్య, మనము బ్రతకటానికి ఏమి చేయాలో నేర్పుతుంది మరియు ఎలా బ్రతకాలో నేర్పుతుంది**

18. **మరుజన్మలో తోడు:** మరణించిన పిదప జ్ఞానము ఆత్మ ననుసరించి ఉంటుంది. ఈ జన్మలో ఎంత స్థాయి జ్ఞాన పరంగా ఎదిగాడో, మరుజన్మలో ఆ స్థాయి నుండి జ్ఞాన సముపార్జన ప్రారంభమవుతుంది. "ఇక్ జామినీ ఇజ్ బేటర్ దేనా ఏకజామినర" అనగా జతిక జన్మలో పఠించుట.

19. **కామధేను:** తత్త్వజ్ఞానియొక్క మాట (వాణి) కామధేనువు. ఇది వినెడివారికి ప్రగతినిస్తుంది. సమస్యలను సులభతరం గావిస్తుంది. శత్రువులను మంచి మిత్రులనుగా చేస్తుంది.

20. **పారస్‌మణి:** జ్ఞానాన్ని కూడా పారస్‌మణిగా భావిస్తారు. (లోహము) ఇనుము పారస్‌మణి స్పర్శతో బంగారంగా మారుతుంది అనెడిది నిజమో కాదో తెలియదు, ఇది సందిగ్ధము. కాని జ్ఞాని తన స్పర్శ ద్వారా (మాట ద్వారా) తుచ్ఛశ్రేణి వ్యక్తులను కూడా అత్యున్నత స్థానానికి చేర్చుతాడు. ఇది నిర్వివాద సత్యము.

21. **అమృతము:** దుఃఖభారంతో బాధలకు లోనైనవారిని, వారి దుఃఖాన్ని, బాధలను తగ్గించుటలో సద్గ్రంథాలు అమృతంలా పనిచేస్తాయి. స్వాధ్యాయం నిస్సందేహంగా ఇట్టి అమృతమే! సద్గ్రంథంలోని విషయాలు మనస్సులో ప్రవేశించి పాశవికతల నశింపజేసి పవిత్రుల గావిస్తాయి.

22. **అన్నింటికన్నా గొప్ప దానము:** జ్ఞానదానము అన్నింటి కన్నా గొప్పదానము.

23. **అన్నింటికన్నా గొప్ప సేవ:** విద్యావ్యాప్తి కూడా ఈ యుగం దానాలలోకెల్లా గొప్పది.

24. **సర్వోత్తమ ధర్మము:** ఝోలాపుస్తకాలన్ని నడిపించుట అన్నింటికన్నా లాభదాయకమైన ధర్మము.

25. **ఆనందాన్నిచ్చేది:** స్వాధ్యాయానికి మించిన ఆనందము లేదు.

26. **యోగా:** పుస్తకాల అధ్యయనం.

27. **సౌభాగ్యాన్నిచ్చెడి ద్వారము:** దేనిని చదివినచో మహత్తు తెలుస్తుందో దాని ద్వారా సౌభాగ్యాన్నిచ్చెడి ద్వారం తెరచుకొంటుంది.

28. **తల్లిదండ్రుల ధ్వనులు:** ధన్యజీవులైన తల్లిదండ్రులు తమ సంతానానికై మంచి పుస్తకాలను సంగ్రహించి పెడతారు.

29. **అమరుడు:** నిజమైన జ్ఞానము– ఇహపరలోకాల తరగని తత్త్వాన్ని తెలుపుతుంది. నిజమైన తోడుగా ఉంటుంది. తక్కినవన్నీ అశాశ్వతాలు, నశించేవి.

*– హిందీ సమర్పణ: యుగనిర్మాణ యోజన*
*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

## జీవితమంటే సుఖదుఃఖాల కూటమి

*ఒక నవ యువకుడు తన గుఱ్ఱాన్ని అధిరోహించి సుదీర్ఘమైన యాత్రకు బయలుదేరాడు. మార్గంలో గుఱ్ఱానికి దప్పిక అయింది. కొంత దూరం పయనించిన పిదప అతడు ఒక గ్రామాన్ని చేరుకున్నాడు. ఒక ప్రదేశంలో ఒక మోటారు (నీళ్ళుతోడే మోట) కనిపించింది. చుట్టుప్రక్కల వాకబు చెయ్యగా దగ్గరే ఉన్న గుడిసెలో ఉన్న మహిళ ఆ మోటారును నడుపుతుందని తెలిసింది. అతడు ఆమె వద్దకు వెళ్ళి నీటి కోసం ప్రార్థించగా ఆమె వెంటనే మోటారును ఆన్ చేసింది. మోటారు నడిచేటప్పుడు వచ్చిన పెద్ద శబ్దానికి గుఱ్ఱం బెదిరిపోయింది.*

*యువకుడు వెంటనే ఆమెను మోటారును నిలిపివేయమని అడిగాడు. మోటారును నిలిపివేయగానే నీళ్ళు రావటం ఆగిపోయాయి. యువకుడు ఆమెను నీళ్ళు ఇవ్వమని అడుగగానే ఆమె వెంటనే మోటారు నడిపింది. మోటారుతో పాటే పెద్దశబ్దం. 'సోదరీ! మోటారు నడిచినా శబ్దం కాకుండా ఉండే మార్గం లేదా?' అని యువకుడామెను అడిగాడు. 'అన్నా! అది ఎట్లా సాధ్యం? మోటారు నడుస్తుంటే ధ్వని వస్తుంది కదా! నీళ్ళు త్రాగాలంటే దానితోపాటు వచ్చే శబ్దాన్ని కూడా భరించాలి. మనుష్యులు కూడా ఇంతే. జీవితంలో లభించే సుఖాలను మాత్రమే కోరుకుంటారు, కానీ దుఃఖాల ననుభవించటానికి ఇష్టపడరు. జీవితమంటే సుఖదుఃఖాల కూటమి. రెండింటి కలయిక. ఒకదానిని విడచి రెండవది ఉండుట అసంభవం' – అని సమాధానమిచ్చింది ఆ మహిళ.*

*– అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

**మీ వ్యక్తిగత జీవితం మీ ప్రారబ్ధం - ఎలా చేసుకున్నారో అలా జరుగుతుంది**

## కర్మకాండ ఎందుకు? ఎలా?-5

# గాయత్రీ ఉపాసన

మేము గురుదేవులనిలా ప్రశ్నించాము. 'ఓ గురుదేవా! గాయత్రీ ఉపాసనతో ధనబలము, శరీరబలము, బుద్ధిబలము లభిస్తుందా?' గురుదేవు లిలా జవాబిచ్చారు. 'కుమారా! కేవలం నువ్వే కాదు, ప్రపంచములోని ప్రతి వ్యక్తి ఈ మూడు బలాలను పొందాలనే ఉవ్విళ్ళూరుతాడు. కానీ ఈ మూడు బలాలను మించిన మరొక శక్తి ఉంది. అది గాయత్రీ ఉపాసనతో లభించే ఆధ్యాత్మికబలము. ఈ శక్తితో పై మూడు బలములు కూడా ప్రాప్తిస్తాయి.

మొదటిదైన శరీరబలము కూడ అవసరమైనదే. దానితోనే కష్టసాధ్యమైన వ్యాయామము, నడుచుట- తిరుగాడుట మొదలైనవన్నీ చెయ్యటము సాధ్యపడుతుంది.

రెండో సమర్థమైన శక్తి-బుద్ధి. వైద్యుడు, న్యాయవాది మొదలైనవారందరూ ధనోపార్జన చేయుటకై తీక్షణమైన బుద్ధిని ఉపయోగించుకుంటారు.

మూడవదైన ధనశక్తితో మోటర్‌కార్లని కొనుగోలు చేయవచ్చును. ఇంటిని నిర్మించుకొనవచ్చును. అలాగే భౌతిక సాధనములను సమకూర్చుకొనవచ్చును.

**ఆధ్యాత్మికబలము ఈ మూడు శక్తుల కన్నా ఎంతో మహత్త్వపూర్ణమైనది. ఆ శక్తి లభించకుండా శరీరబలము, బుద్ధిబలము, ధనబలము మొదలైనవన్నీ నిరుపయోగమైనవే. ఆధ్యాత్మికత యొక్క ఈ చతుర్థశక్తిని ఈనాడు అందరూ మరచి పోయారు. దానిని తిరిగి పొందవల్సియున్నది.**

దుర్యోధనుడికి ఈ ఆధ్యాత్మికశక్తి కొరవడినది. అతని వద్ద లేనిదేమిటి? రాజసింహాసనము, ధన-సంపద, విశాలమైన సేనావాహిని, బుద్ధి-చతురత అన్నీ ఉన్నాయి కానీ ఆధ్యాత్మికశక్తి లేదు, ఈ కారణంగానే అతను సర్వనాశనమును చవిచూశాడు.

రావణాసురుడు మరణాసన్న వేళ ఇలా ఆలోచించాడు. 'నావద్ద ధనబలము, జనబలము, శరీరబలము మొదలైనవన్నీ ఉన్నాయి. అవతలివైపు వనవాసులైన రామలక్ష్మణులు. వారి వద్ద ఏమీ లేదు, ఐనప్పటికీనీ వారు ఘన విజయమునెలా వరించగలిగారు? ఈ జిజ్ఞాసకు సమాధానము నిమ్మని రాముడినే అడిగాడు. భగవంతుడైన రాముడిలా అన్నాడు. నీ వద్ద మూడు బలాలున్నాయి. కానీ ఆధ్యాత్మికబలమనే - నాల్గవ బలము లేదు.' రావణుడు తిరిగి ఇలా ప్రశ్నించాడు. ఈ నాల్గవ అధ్యాత్మబలము నీకు ఎక్కడినుండి వచ్చింది? శ్రీరామచంద్రుడు ఇలా బదులిచ్చాడు. ఈ బలము గాయత్రీ ఉపాసనతో వచ్చింది.

గురువశిష్టులవారు మాకు యజ్ఞోపవీత సంస్కార సమయములో ఈ మంత్రసాధనతో పాటు ఉన్నత ఆదర్శ సిద్ధాంతములను మాలో నిలుపుకొనగలుగుట మున్నగు సమస్త విషయములనూ బోధిస్తూ చక్కని మార్గదర్శనము చేశారు. అంతేకాక విశ్వామిత్రమహర్షి గాయత్రీ-సావిత్రీ మహావిద్యలను ఉపదేశించారు.

పూజ్యగురుదేవులు ఇలా తెలియజెప్పారు. 'గాయత్రీమంత్ర మూలభూత సిద్ధాంతములను జీవితములో దింపుకుని సమస్తమునూ ప్రాప్తింపజేసుకొనవచ్చును. చెడును త్యజించి, పవిత్రమైన, దివ్యమైన ఆలోచనలతో శుభం చేకూర్చే పనులను చేపట్టవలెను. వాటిలోని ఆదర్శములను, మర్యాదలను మీ జీవితములో సంపూర్ణముగా ఆచరించాలి, అప్పుడే ఇది ప్రాణవంతమై ప్రతిఫలిస్తుంది.

గురుదేవులు ఇంకా ఇలా అన్నారు. 'ధర్మమూర్తిశ్రీరాముని మందిరములకన్నా; హనుమంతుని మందిరములు అధికముగా ఉండటము నీవు చూసేవుంటావు. ఇదంతా ఆధ్యాత్మికత యొక్క ప్రతిఫలమే! భగవంతుడు కూడా భక్తుడిని తనకంటె అధికునిగా చేస్తాడు.

హనుమంతుడు మొట్టమొదటగా సుగ్రీవుని సేవకుడు. వాలి చంపుతాడనే భయముతో ఋష్యమూకపర్వతము మీద దాక్కొని జీవిస్తున్నాడు. ఆ హనుమే శ్రీరాముడిని కలిసినపుడు సముద్రోల్లంఘనము, పర్వతోత్థానము, సంజీవినిని తెచ్చుట మొదలైన అసంభవ కార్యములను చేయుటలో సైతము సమర్థుడైనాడు. సామాన్యవానరము ఆధ్యాత్మికతతో కలిసి ఇంత గొప్ప శక్తిశాలి ఐనప్పుడు మరి మనుష్యుడు దానితో ఏమి చెయ్యలేడు? ఎంతో చెయ్యగలడు.

మా హఠవాదన గురుదేవులకి పరిచితమే. మేమిలా ప్రశ్నించాము. 'గురుదేవా! హనుమంతుని దృష్టాంతము బహు పురాతనమైనది. దీనిలో అతిశయోక్తి కూడా ఉండి ఉండవచ్చు. ఏదైనా సజీవ-ఉదాహరణను ఇవ్వండి!'

**పట్టుదల అసంభవాన్ని సంభవం చేస్తుంది**

'కుమారా! నీవు గాంధీగారిని చూశావు కదా?' అన్నారు గురువర్యులు.

చూశాము గురుదేవా! మేము చూశాము. ఆయన 5 అడుగుల 2 అంగుళముల ఎత్తుతో, బలహీనమైన శరీరము కలిగి నిరాడంబర జీవనమును సాగించిన వ్యక్తి.

గురుదేవులు ఇంకా ఇలా అన్నారు. 'చూడు నాయనా! కరమ్‌చంద్‌గాంధీ ఒక న్యాయవాది. ఆఫ్రికాలో ఉన్న ఒక న్యాయస్థానములో ఒక వ్యాజ్యమును గురించి వాదనను చేస్తున్నప్పుడు రెండవపక్షపు న్యాయవాది చేసిన వాదనకు తగిన జవాబివ్వలేని అసమర్థస్థితిలో కాళ్ళూ చేతులు వణికిపోయాయి, మాట తడబడింది. ఆ స్థితిలో న్యాయస్థానము వెలుపలకి వచ్చేశాడు. అలా వచ్చినప్పుడు వకీలుని నియమించుకున్న ఆ వ్యక్తికి వ్యాజ్యపు రుసుమును కూడా గాంధీ తిరిగి ఇవ్వవల్సి వచ్చింది.

ఇంత బలహీనమైన మనస్సు గల గాంధీ ఆధ్యాత్మిక బలమును పొందిన తరువాత ఆయన హృదయములో ఎంత శక్తి వచ్చినదంటే ఆయన ఒక్క పిలుపుతో లక్షలాదిమంది వ్యక్తులు జీవితమును పణముగా పెట్టి స్వతంత్ర సేనానులై ముందుకు దూకారు. రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యము కూడా ఒకానొకనాడు భారతదేశమును వీడవల్సివచ్చింది.

**ఆధ్యాత్మికశక్తి జాగృతమైతే మనిషివద్దకు మిగిలిన మూడు బలములు స్వయముగా వచ్చిచేరుతాయి. ఆధ్యాత్మికతను అర్థం చేసుకొనగలిగినప్పుడే మనిషి పరిపూర్ణ మానవుడవుతాడని అర్థము చేసుకొనవలెను. దీనితో శరీరబలము, బుద్ధిబలము, ధనబలములు మాత్రమే కాదు ఇహపరాలు రెండూ చేకూరుతాయి.**

పిమ్మట పూజ్యగురుదేవులు స్వామీ వివేకానందుని దృష్టాంతమును వివరించారు. నరేంద్రుడనే పేరు గల ఒక చదువుకున్న పట్టభద్ర యువకుడు శ్రీరామకృష్ణపరమహంస వద్దకు తనకు ఉద్యోగము రావాలని అడగటానికి వచ్చాడు. పరమహంస 'వెళ్ళు, వెళ్ళి కాళీమాతను వేడుకో!' అన్నారు. అతను కాళీమాత మందిరములోకి వెళ్ళాడు. స్వామీ రామకృష్ణ పరమహంస కృప వల్ల అతని హృదయములో ఆధ్యాత్మిక ప్రకాశము ప్రవేశించినది. అందువలన అతని హృదయములో ఇప్పుడు ఎంతోమంది నిరుద్యోగుల యొక్క సమస్యల తాలూకూ కేకలు ప్రతిధ్వనిస్తున్నాయి. విశ్వమాతను తనకొరకు ఒక చిన్న వరమును యాచించుటయా? నేను విశ్వహితమును గురించి ఏదైనా అడగాలి అని తలంచాడు.

కాళీమాత ప్రతిమ సమక్షములో అతని మనస్సునుండి **'హేమాత! నాకు జ్ఞానమును ప్రసాదించు! భక్తి నిమ్ము! వివేకమును అనుగ్రహించు!** అన్న ప్రార్థన వెలువడినది. అతని అంతరాళములో ఈ సమస్త ప్రపంచములో నిండియున్న సమస్యలను గురించిన చింత మొదలైనది. నరేంద్రునికి తన సోదరి యొక్క వివాహము గురించిన చింత ఉన్నది. ఇంటిలో నున్న తల్లి అవసరములు తీర్చటానికిగానూ నరేంద్రునికి ఒక ఉద్యోగము అవసరము. ఐతే అతను తనకు కావల్సినవాటిని యాచించకుండా సర్వహితార్థమైన ఆశీర్వాదము నిమ్మని ఆ విశ్వమాతను కోరుకున్నాడు. ఆ నరేంద్రుడే అధ్యాత్మబలము తోడైనప్పుడు వివేకానందునిగా మారాడు.

గురుదేవులు ఇలా కొనసాగించారు. నీవు మాతోపాటు టాటానగర్ వచ్చావు కదా! అక్కడ మనము టాటా యొక్క కర్మాగారము చూడటానికి వెళ్ళినప్పుడు అక్కడి జనరల్ మేనేజర్ నీ సమక్షములోనే **'ఈ కర్మాగారము వివేకానందులు పెట్టిన భిక్ష'** అని చెప్పాడు.

జంషెట్‌టాటా తన యొక్క దినచర్యపుస్తకములో ఇలా వ్రాసుకున్నాడు. 'స్వామీ వివేకానందులతో నా సమాగమము విదేశములోని ఒక హోటల్లో జరిగింది. అక్కడ నేను స్వామి వారిని 'భారతదేశములో రాక్షసిబొగ్గు, ఇనుము మరియు నీరు ఈ మూడు ఒకేచోట లభించే స్థానమేదైనా ఉందా?' అని ప్రశ్నించాను.

స్వామి ఒక్కక్షణము కళ్ళు మూసుకుని ధ్యాన మనస్కులై తాము దర్శించిన ప్రాంతమును అనగా- భారతదేశ చిత్రపటములో బీహార్‌లోని సింహభూమి జిల్లాలోని ఒక ప్రాంతము అని సూచించారు. నేను భారతదేశమునకు తిరిగి వచ్చి అదే స్థానములో నా కార్యక్రమమును ముందుకు సాగించాను. ఇదంతా ఆయన చలవే!'

ఈనాడు అక్కడే స్వామీ వివేకానందుల యొక్క ఆధ్యాత్మిక తేజః ప్రతాపముతో ఒక విశాలమైన పారిశ్రామిక నగరము పరిఢవిల్లుతున్నది. ఈ టాటానగర్ ఖ్యాతి ప్రపంచమంతా వ్యాపించినది. టాటా తన సమస్త ప్రగతి యొక్క శ్రేయస్సునూ స్వామీ వివేకానందులకే ఇస్తూవుండేవారు.

ఇదంతా ఆధ్యాత్మికబల చమత్కారమే! ఈనాడు కూడా జంషెట్‌టాటా దినచర్యపుస్తకము అక్కడ ప్రస్ఫుటితముగా ప్రదర్శించబడుతున్నది. ఎవరైనా దానిని చదువవచ్చు. టాటానే బేలూరు మఠనిర్మాణము కావించాడు. అక్కడినుండే రామకృష్ణ మిషన్ కార్యక్రమములు నిర్వహించబడుతున్నాయి.

**క్రమశిక్షణ తోడైతే ప్రతిభ సామర్థ్యంగా రూపుదాల్చుతుంది**

నిజమైన ఆధ్యాత్మికత ఇదే. అసలు బంగారము-నకిలీ బంగారము వలెనే; నిజమయిన ఆధ్యాత్మికము- నకిలీ ఆధ్యాత్మికములో కూడా అదేవిధమైన భేదముంటుంది. **ఆధ్యాత్మికతకు అర్థము-లోకమంగళ కార్యాచరణ మరియు పవిత్ర జీవనయానము!!**

గురుదేవులు మరియొక విషయమును గుర్తుచేస్తూ ఇలా అన్నారు. 'నీవు మాతోపాటు గుజరాత్ కూడా వచ్చావు. అక్కడ బాపాజలారామ్‌గారి ప్రతిమను దర్శించావు. పుత్రా! బాపా జలారామ్ కూడా నిజమైన అధ్యాత్మజీవనమును సాగించాడు. అతనొక సాధారణ కృషీవలుడు. తన ఇంటినుండి ఎవ్వరూ ఆకలితో వెళ్ళరాదనేది అతని వ్రతము. పొలములో పండే పంటను పరోపకారమునకై వెచ్చించేవాడు. అతని ఈ వ్రతమే అతను భగవంతుని చెంతకు చేరటానికి సహాయపడింది.

ఒకనాడు ఒక వృద్ధసాధువు జలారాముని ఇంట బస చేశాడు. 'నాకు నాలుగుతీర్థముల యాత్ర చేయాలని ఉంది. మీరు నాచేత యాత్రను చేయించండి' అని అడిగాడు.

'నేను పొలం పనులు చూచే రైతును. నా ధర్మపత్ని మీ చేత నాలుగుతీర్థముల యాత్ర చేయిస్తుంది' అని అన్నాడు బాపా. వృద్ధసాధువు చేత యాత్ర చేయించటానికి అతని భార్య సేవావ్రతధారణ స్వీకరించింది. సాధువు సామానులు తీసుకొని ఆయన వెంట సాగిపోయింది. మార్గమధ్యములో ఒకచోట ఆ సాధువు తన సంచీని ఆమె చేతికిచ్చి శౌచనిమిత్తము ఎటో వెళ్ళాడు. ఆమె అతని రాకకై ఎదురుచూసింది. సాయంత్రమైనా ఆ సాధువు రాకపోయేసరికి ఆమె సాధువు తనకిచ్చి పట్టుకొమ్మని చెప్పిన ఆ సంచిని తీసికొని ఇంటికి తిరిగి వచ్చేసింది.

ఆనాటి ఆ సంచీ ఈనాటివరకు అక్కడే వ్రేలాడుతున్నది. వీరపురములోని ఆ జలారామ్ మందిరములో నిరంతర అన్నదాన వ్రతశాల నేడు కూడా అనవరతముగా నడుస్తున్నది.

ఇదే ఆధ్యాత్మికశక్తి యొక్క చమత్కారము. ఈ దృష్టాంతము లన్నీ విన్న తరువాత నీ సమస్త భ్రమలు దూరమై ఉంటాయి. ఒకవేళ ఇప్పటికీ సంతోషము కలుగకపోతే మా జీవితమును చూడు. ఎన్నో విషయములు తెలుస్తాయి.

మేము 18 గంటలు లోకహితమునకై నిరంతరము పని చేస్తున్నాము. మేము ఎప్పుడూ అస్వస్థుల మవ్వలేదు. బలహీనుల మవ్వలేదు. ఎవ్వరైనా మమ్ములను 'ముసలివారు' అనంటే మాకు చెడుగా అనిపిస్తుంది. తిట్టినట్టుగా ఉంటుంది. మేము ఈ వయస్సులో కూడా నవయువకులమే! జుట్టు తెల్లబడినంత మాత్రమున ఎవ్వరూ వృద్ధులవ్వరు. గొఱ్ఱెపిల్ల వెంట్రుకలు పుట్టినది మొదలు తెల్లగానే ఉంటాయి.

మేము లాంతరు వెలిగించి ఆ వెలుతురులో నాలుగు వేదములు, 18 పురాణములు మరియు 108 ఉపనిషత్తులకు భాష్యం వ్రాశాము. అఖండజ్యోతి మాసపత్రిక ద్వారా మేమే ఆధ్యాత్మికతను మరియు విజ్ఞానమును మేళవించాము. ఆధ్యాత్మికతకు మరియు విజ్ఞానమునకు మధ్య కుక్కకు-పిల్లికి ఉన్నటువంటి వైరమే ఉంటుందని వైజ్ఞానికులు భావిస్తుంటారు. కానీ మేము ఆ రెంటిని మిత్రులతో వలె కలిపి ఒకదాని ప్రక్కన ఒకటి చేర్చి పదకొండుతో సమానముగా చేశాము.

**జన్మభూమి ఆవల్‌ఖేడా, గాయత్రీతపోభూమి, శాంతికుంజ్, 2400 శక్తిపీఠములు, వీటికి చెందిన కోట్ల రూపాయల సమస్త ధన-వస్తు సంపద, లక్షలాదిమంది పరిజనుల సువిశాల సమూహము... ఇవన్నీ ఎక్కడినుండి సమకూరాయి? ఇవన్నీ కేవలము మా వ్యావహారిక జీవన ఆదర్శములు మరియు సిద్ధాంతముల చమత్కారము ద్వారా సమకూరినవే! నిజం చెప్పాలంటే మేము సంపాదించిన ఆధ్యాత్మికశక్తిని ఇనుపపెట్టెలో దాచిపెట్టాము. ఈ శరీరము త్యజించిన తరువాత ఆ సంపదను మీరందరూ స్వయముగా వీక్షిస్తారు.**

పూజ్యగురుదేవులు తమ గురించి చెప్పినదంతా ఈనాడు మేము ప్రత్యక్షముగా చూస్తున్నాము. గాయత్రీపరివార విస్తరణ మరియు అశ్వమేధమహాయజ్ఞము వంటి విరాట్ ప్రణాళిక యొక్క సాఫల్యము ఇవన్నీ గురుదేవుల సూక్ష్మసత్తా మరియు ఆయన తపోశక్తుల ఉపలబ్ధులు. ఎంతమంది రోగులు, దుఃఖితులు, సమస్యలతో చుట్టుముట్టబడినవారు, వ్యాకులపాటు చెందినవారు ఆయన వద్దకు వచ్చారో వారందరికి పూజ్య గురుదేవుల ఆశీర్వాద లాభము లభించినది. అలాంటి పరిజనులు ఎంతోమంది ఉన్నారు. వారందరికి ఆయన జీవన దానము చేశారు, మృత్యువు ఒడినుండి కూడా వెనక్కి తీసికొచ్చారు. ఈనాడు ఇదంతా ఒక లోతైన పరిశీలనా విషయము.

పూజ్యవరులు పైన చెప్పిన దృష్టాంతముల ద్వారా మేము అధ్యాత్మము వలన అన్నీ పొందగలము అన్న విషయమును విని పరిపూర్ణముగా సంతుష్టులమైనాము. ఈ ఆధ్యాత్మికతనే ఆయన మనిషి - మనిషికి నేర్పించారు. దాని వాస్తవిక స్వరూపమును అవగాహన చేసుకొనేటట్లుగా లెక్కకు మిక్కిలిగా ఉన్న సాధకులకు మార్గమును ప్రశస్తము చేశారు.

*(సశేషము)*

– *అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**నీ విజయాన్ని అడ్డుకునేది నీలోని ప్రతికూల ఆలోచనలే**

పరమపూజ్య గురుదేవుల అమృత వచనాలు

# మానవ జీవిత "నిరూపణలో" నిగ్గుతేలిన సత్యాలు-1

*మిత్రులారా!*

మనల్ని మనం మార్చుకొనుట లేక మనం మారుట అనెడిది మన చేతుల్లో ఉన్నది. పరిస్థితుల మార్చుట అనెడిది మన చేతుల్లో లేనిది. ఇతరులను మన ఇచ్ఛానుసారం మార్చుట అనెడిది కూడా మన చేతుల్లో లేదు. మన చేతుల్లో ఏదైతే లేదో దానిని గురించి ప్రయత్నించుట మరియు హైరానాపడుట వ్యర్థము. మన ఇంటి పరివారం మన మాటను గౌరవించాలి, మన బాటను అనుసరించాలి అని కోరుకుంటాం. కాని ఇలా ఆలోచించుట సరికాదు. ఇంటిలోని ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాన్ని పాలిస్తున్నారా? లేదా? అనెడిది మాత్రం చూడండి చాలు. ఇంతకు మించి ముందుకు పోకండి! పరిస్థితులు మీకు అనుకూలంగా తయారవుతాయి అని ఆలోచించకండి! మనిషికి అనుకూలంగా పరిస్థితులు ఎక్కడ తయారవుట లేదు!

శ్రీకృష్ణభగవానుడు తన జీవితకాలమంతా తన పురుషార్థాన్ని చేస్తూనే ఉన్నాడు! కాని పరిస్థితులు ఆయనకు అనుకూలంగా ఎచ్చట నిర్మితమయ్యాయి? మీరు చెప్పండి? కుటుంబ కలహాలతో పరివారమంతా చనిపోయారు (యాదవ కులమంతా). తరువాత ఆయన తన రాచరికపు వ్యవస్థను చాలా శ్రమకోర్చి నిర్మించారు.

ఈ ప్రపంచం నీ కోసం సృష్టించబడలేదు. మీ కోర్కెలు నెరవేరాలన్నచో మీకు తగిన పాత్రత ఉండాలి మరియు పూర్వజన్మ సుకృతం ఉండుట తప్పనిసరి. ఇవి కలిగిననాడు అన్నీ నీ ఇచ్ఛానుకూలంగా జరుగుతాయి. మీ అంతట మీరు మారండి. ఏమి మారుతుంది? ముసలితనంపోయి యవ్వనం వస్తుందా? రానే రాదు. ఇది మీ చేతిలో లేనిది. మీ శరీరాన్ని ప్రకృతి తయారుచేసింది. ప్రకృతే దాని యజమాని! ప్రకృతి కోరుకొన్నప్పుడు మొలిపిస్తుంది. అట్లే కోరుకున్నప్పుడు తిరిగి తీసుకుంటుంది. నీవు ప్రకృతికి యాజమానివా? ముసలివానిని నవ యువకునిగా మార్చగలవా? చేయలేవు. మరణించినదానికి ప్రాణం పోసి ప్రపంచగతిని మార్చగలవా? చేయజాలవు. మనిషికి పరిధులున్నాయి. దీనికి మనిషి బందీగా ఉన్నాడు. నీవు దానిని గుర్తించి మాట్లాడు, ఆలోచించు, అప్పుడు అవి పూర్తి అయ్యే వీలున్నది. అలా కానివానిని గురించి ఆలోచిస్తాం! అసంభవమైనవానిని గురించి కల్పనలు చేస్తాం. మంచిగా తయారుచేసి సిద్ధంగా ఉంచి, హైరానాపడుట తప్ప మరే ఫలితం లభించదు. కావున హైరానాపడవద్దు. కాని చక్కగా ఆలోచించి, సంభవమైనవానిని చేయి. నీ ప్రయత్నం ద్వారా మారినవానిని గురించి ఆలోచించు! మీ మనస్సు మారుతుంది. నీ భయాన్ని తొలగించుకో, మారుటను నీ అలవాటుగా చేసికో. నీ ఆలోచనా విధానాన్ని మార్చుకో. నీ స్వభావాన్ని మార్చుకో. వీనిని మార్చుకొనుట ముమ్మాటికీ సంభవమే.

మీరు ఇచ్చటి నుండి వెళ్ళేటప్పుడు ఈ ప్రపంచాన్ని మీతో తీసికొని వెళ్ళండి. ఎలా మార్చవలసింది, విధివిధానాలు అర్థమవుతాయి. రూపము (ఆకృతి) మారదు. కాని ప్రకృతి మారుతుంది. ఆకృతి ఏవిధంగా మారుతుంది? మీ శరీరం నిర్మాణం మారదు. మీ స్వభావం మారుతుంది. ఇప్పటివరకు మీ జీవితములలో రెండు పనులు జోడింపబడ్డాయి. వానిలో ఒకటి మీ పొట్టను నింపుకొనెడి పని. రెండవది లోభంతో కూడినది. అదే సంతానాన్ని కనెడి బాధ్యత. పెండ్లి చేసికొని లెక్కకు మించిన సంతానాన్ని కనుట. తదుపరి ఈ సంతానం యొక్క సంతాన బరువును (మనుమలు, మనుమరాండ్రు) భుజానికెత్తుకొనుట. వీరందరి పోషణకై ఉచితానుచిత పనుల చేస్తూ ఉండుట. రాత్రింబవళ్ళు వీరందరి యొక్క పాలన, పోషణ గురించి చింతించుట. ఇంతకు మించి మీరంతా చేయుచున్న పని

**శ్రమ ఆయుధంగా మారితే, విజయం బానిస అవుతుంది**

ఏమిటి! చెప్పండి? మీలోని కొందరు పై రెండింటికి తోడు మీలోని అహంకారాన్ని పెంచి పోషిస్తూ సంపదల పెంపొందిస్తూ తోటివారి మధ్య మీ గొప్పతనాన్ని ప్రదర్శిస్తూ దానితో సంతృప్తిజెందుచూ మీ గర్వమతిశయించే రీతిలో మూడవ పనిని చేస్తున్నారు. దీనివలన ఎదుటివారి కళ్ళల్లో మిమ్ముల చూచి కలిగెడి ఆశ్చర్యాన్ని మీరు చూస్తున్నారు. ఇట్టి పనిని అందంగా ఉన్న ప్రతిమలు మరియు ఫోటోలు కూడా చేస్తాయి. మీరు మరింతగా గర్వించుట నిజమే గదా. ఇట్టి పనులు మీరు చేస్తున్నారు. యావత్ విశ్వం మీ ఈ పనుల వలన సర్వ వినాశదిశగా పయనిస్తున్నది. కాని నిజంగా మీరు చేయవలసింది ఇది కాదు. మీ వ్యక్తిత్వ విలువల్ని పెంచుకొనుట మీరు చెయ్యాలి. ఇతరులు మిమ్ముల చూచి ఆశ్చర్యపడుటకు బదులుగా వారు మిమ్ముల ఆరాధించేలా మీ సంస్కారాలను పెంపొందించుకోవాలి.

దయచేసి మీరు అర్థం చేసికోండి. మీ జీవితంలో మరో నూతన విధానానికి ప్రాణం పోయండి. మేము మీ స్వభావాన్ని మార్చుతాం. మీ ఆలోచనల్ని మార్చుతాం. మేము మీ ఆచరణల మార్చుతాం. మేము తరచుగా ఆలోచించెడిది మీ కుటుంబ అలవాట్లను మార్చటం, తద్వారా మీ అంతట మీరు మారుట జరుగుతుంది. వీని ద్వారా ప్రగతిశీల సమాజ నిర్మాణానికి, ఉన్నత విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి మీరు తోడ్పాటు నందించాలి. ఈ రీతిగా దృఢ సంకల్పాన్ని గైకొని, కార్యక్రమాన్ని రూపొందించుకొని, పూర్తిగా సంసిద్ధులై మీరు ఇచ్చటి నుండి తిరిగి వెళ్ళినచో, మీకు నేనొక అభయాన్ని ఇస్తున్నాను. "మీ యొక్క భవిష్యత్తు ఎంతగా మారిపోతుందంటే మిమ్ముల చూచిన ప్రతివారు మీలో సంభవించిన మీ ఆలోచనా ప్రగతిని, మీ సౌశీల్యాన్ని, మీ ఉన్నతిని, మీ ఆత్మసంతృప్తిని, మీలోని శాంతిని గాంచి మిక్కిలి ఆశ్చర్యచకితులవుతారు" అప్పుడే మీరు పాల్గొన్న ఈ శిక్షణా శిబిర లక్ష్యం నెరవేరుతుంది. – మీ రాకకు సంపూర్ణ ఫలితం లభిస్తుంది"

ఓం శాంతిః శాంతిః శాంతిః

*– యుగనిర్మాణ యోజన*

*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

## స్నేహబంధం

*నిమాయీ, రఘునాథ్... ఇద్దరూ సహపాఠులు. ఇద్దరి మధ్యా మంచి స్నేహబంధం ఉన్నది. రఘునాథుడు ఒక గ్రంథం వ్రాసి, సమీక్షించమని నిమాయికి ఇచ్చాడు. కొన్ని రోజులు గడచిన పిదప రఘునాథుడు తన గ్రంథ రచన ఎలా ఉన్నదని నిమాయిని ప్రశ్నించగా, నిమాయి "అద్భుతం! ఒక్క తప్పు కూడా లేదు" – అని ప్రశంసించాడు. తరువాత నిమాయి తాను న్యాయశాస్త్రంపై వ్రాసిన భాష్యాన్ని పరిశీలించమని రఘునాథుడికి ఇచ్చాడు. రఘునాథుడు నాలుగు పంక్తులు చదవగానే అతడి కన్నుల వెంట అశ్రువులు జాలువారాయి. అందుకు కారణం చెప్పమని నిమాయి పదే పదే ప్రశ్నించిన మీదట రఘునాథుడు– "మిత్రమా! నీ పుస్తకం ముందు నా గ్రంథం ఏపాటిది? అసలు దానిని చదవాలని ఎవ్వరూ అనుకోరు కూడా!" అన్నాడు.*

*"చాలు, ఇంకేమీ చెప్పవద్దు" – అని అంటూ నిమాయి తాను రచించిన పుస్తకం పైన తన పేరు కొట్టివేసి, రఘునాథుడి పేరు లిఖించాడు. అందుకు రఘునాథుడు ఎంతమాత్రము అంగీకరించలేదు. అప్పుడు "ఇది నా కానుకగా భావించి స్వీకరించు" – అని చెప్పి అతనిని ఒప్పించాడు.*


*మిత్రుని ఔన్నత్యానికి, ఔదార్యానికి రఘునాథుడు పరవశించాడు. (గద్గదుడైనాడు). కాలక్రమంలో "నిమాయి" చైతన్యప్రభువుగా ప్రఖ్యాతిగాంచినాడు. రఘునాథుడు వ్రాసిన ఎన్నో కృతులు ప్రజల హృదయాలకు మార్గదర్శనం చెయ్యటంలో అగ్రభాగాన నిలచినాయి.*

*– అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

**భయపడి పారిపోయేవాడు పిరికివాడు - ఎదిరించి నిలచిపోరాడేవాడు, సాహసవంతుడు**

చెయ్యెత్తి జై కొట్టు! ఓ భారతీయుడా! గతమెంత ఘనకీర్తి గలవోడా! - 2

# 'మానవతకు ప్రతిరూపం భారతీయతకు చిరునామా' - అబ్దుల్ కలాం



***పూర్తిపేరు:*** అవుల్ ఫకీర్ జైనులాబ్దీన్ అబ్దుల్ కలాం

***తల్లిదండ్రులు:*** హాజీ అమ్మాళ్, జైనులాబ్దీన్

***ఉదయాన్నే వినేది:*** ఎం.ఎస్. సుబ్బలక్ష్మి మధుర భక్తిగీతాలు

***ఇష్టమైన రాగం:*** శ్రీరాగం

***చదువు:*** రామేశ్వరంలో, రామనాథపురంలో, తిరుచురాపల్లిలో, చెన్నైలో

***ఇష్టమైన ఆధ్యాత్మిక గ్రంథాలు:*** వేదాలు, భగవద్గీత

***కలాం బాల్యం:*** 15 అక్టోబరు 1931లో రామేశ్వరంలో నిరుపేద కుటుంబంలో జన్మించాడు. తండ్రి చేపల పడవ యజమాని. తండ్రికి చేదోడువాదోడుగా నిలచి బాల్యంలో వార్తాపత్రికల పంపిణీచేస్తూ ధనార్జన చేశాడు. పాఠశాలలో సగటు మార్కులు వచ్చేవి. నేర్చుకోవాలనెడి తపనతో రగిలిపోయేవాడు.

### కలాంగారు తన జీవిత అనుభవసారాన్ని ఈ క్రింది అమృతవచనాల రూపంలో మనముందుంచారు

- నీ పనిలో విజయం సాధించాలంటే నీ మనసంతటినీ లక్ష్యసాధనపై పెట్టాల్సిందే.
- లక్ష్యసాధన ఎంత బలంగా ఉంటే విజయం అంత సులువుగా సొంతమవుతుంది.
- నీ భవిష్యత్తును నువ్వు మార్చుకోలేవు. కానీ నీ అలవాట్లను నువ్వు మార్చుకోగలవు. నీ అలవాట్లే నీ భవిష్యత్తును తీర్చిదిద్దుతాయి.
- దేశ పౌరులు ఏమేరకు మంచివారైతే ఏ దేశమైన ఆమేరకే మంచిదనిపించుకుంటుంది. ఆ పౌరుల విలువలు, వారి శీలం, వారి సంస్కారం ఆ దేశ ముఖచిత్రంలో ప్రతిబింబిస్తాయి.
- ఆదర్శ నాయకుడు తనతో పనిచేసెడి ప్రతి ఒక్కరికి తన విజయంలో భాగస్వామ్యాన్ని ఇస్తాడు. కాని వైఫల్యాన్ని తాను మాత్రమే జీర్ణం చేసుకుంటాడు.
- కష్టాలు వచ్చేది నిన్ను నాశనం చెయ్యడానికి కాదు. నీలోని శక్తి సామర్థ్యాలను వెలికితీసి నిన్ను నువ్వు నిరూపించుకోవడానికే వస్తాయి. నిన్ను కష్టపెట్టడం చాలా కష్టమని గుర్తించి కష్టాలు కూడా పారిపోతాయి.
- జీవితం మరియు సమయం ఈ రెండు ప్రపంచానికి అత్యుత్తమ ఉపాధ్యాయులు. సమయాన్ని సద్వినియోగం చేసుకొమ్మని జీవితం చెబుతుంది. జీవితం ఎంత విలువైనదో కాలం బోధిస్తుంది.
- సమాజంలో ఎవరో వస్తారు ఏదో చేస్తారనెడి ధోరణి పెరుగుచున్నది. ఇది సమాజానికి మంచిది కాదు.
- మనలో మార్పు తేగలిగినవారు ముగ్గురే – వారే తల్లి, తండ్రి మరియు ఉపాధ్యాయుడు.
- నీ భాగస్వామ్యం లేనిదే నీవు నెగ్గలేవు. నీ భాగస్వామ్యంతో నీవు అపజయాన్ని పొందవు.
- నీ ఆలోచనలే నీ పెట్టుబడి కావాలి – ఎన్ని అవాంతరాలు ఒడుదుడుకు లెదురైనా దృఢ ప్రయత్నంతో అర్థవంతమైన ఫలితాలను పొందగలరు. పైపై మెరుగుల వెంటపడి తాత్కాలిక ఆనందాన్ని పొందకండి.
- మనందరికి సమానమైన నిపుణతలు లేవు. కాని వానిని మెరుగుపరచుకొనుటకై సమాన అవకాశాలున్నాయి.
- ఒకరిని ఓడించుట సులభం కాని ఒకరిని జయించుట చాలా కష్టం.
- సూర్యునిలా వెలగాలంటే మొదట సూర్యునిలా మండాలి.
- మనిషికి కష్టాలు కావాలి. అప్పుడే జీవితంలోని విజయాలను చవిచూడగలము.
- గెలవాలనెడి దృఢకాంక్ష ఉన్నప్పుడు విజయం పట్ల నీ విశ్వాసం బలీయంగా ఉండాలి.
- వానలో పక్షులన్నీ తమ తమ గూళ్ళలో తలదాచుకుంటాయి. కాని గ్రద్ద మేఘాలపై ఎగురుతూ వాన నుండి తప్పించుకుంటుంది. ఇదే కార్యదక్షతకు చిహ్నం.

**మోములోని అందం వయస్సుతో క్షీణిస్తుంది - హృదయంలోని అందం వయస్సుతో ఇనుమడిస్తుంది**

## హిందూ ఆధ్యాత్మికత పట్ల చెరిగిపోని నమ్మకము

ఈ నమ్మకమే ఆయనను ఆదర్శపథం వైపు నడిపించింది. ఆయన ముస్లింగా పుట్టినప్పటికి చిన్ననాటి నుండి హిందూ జీవన విధానం పైన, హిందూధర్మం పైన అచంచల విశ్వాసాన్ని కలిగివున్న వ్యక్తి. ఆయన యుద్ధ విమాన పైలట్‌గా ఎంపికై భారతదేశ వైమానికదళంలో పని చేయాలనెడి తీవ్రమైన కోర్కె కలిగి ఉన్నాడు. పైలట్ శిక్షణకై పెట్టిన పరీక్షలో ఎంపిక కాలేదు. దీనికి బదులుగా ఆయన రక్షణ పరిశోధనా ప్రయోగశాలలో శాస్త్రవేత్తగా ఎంపికైనాడు.



ఈ పదవి పట్ల తీవ్ర అనాసక్తి కలిగివున్న వ్యక్తి అయినందున నిరాశకు లోనై, విరక్తితో హిమాలయాలలోని స్వామి శివానంద ఆశ్రమంలో చేరాడు. అచ్చటి స్వామీజీని దర్శించుకున్నాడు. ఈ యువకునిలోని నిరాశను, విరక్తిని పసిగట్టిన స్వామీజీ ఆ యువకుడిని సమీపించి, 'కుమారా! ఏమి నీ బాధ!' అని కలాంను ప్రశ్నించాడు. కలాం జవాబిస్తూ "స్వామీ! నేను కోరుకున్నది ఒకటి! దానికి భిన్నమైనది నాకు లభించింది. ఆ ఉద్యోగము చేయుట నాకిష్టము లేదు" అన్నాడు. స్వామీజీ చిఱునవ్వు నవ్వి "కుమారా! నీవు కోరుకొన్నదానికన్నా భిన్నంగా భగవంతుడు మరో చక్కని మార్గాన్ని నీకై ఎంపిక చేశాడేమో! బహుశ నీవు ఈ రంగములో చక్కగా రాణించి, దేశానికి, సమాజానికి గొప్ప మేలు నీ ద్వారా చేయ భగవంతుడు సంకల్పించి ఉండవచ్చు. నీవు కాదనకు. భగవంతుని ఇచ్ఛానుసారము నడచుకో! అన్నీ మన మేలుకే జరుగుతూ ఉంటాయి!" అని యువకుడైన కలాంను సమాధానపరచాడు.

**స్వామీజీ మాటలలోని అంతరార్థాన్ని గ్రహించిన బుద్ధి శాలియైన కలాం తన నూతన ఉద్యోగంలో ప్రవేశించి అనూహ్యంగా ఎదిగి, తన ప్రతిభాపాటవాలను దేశానికి, విశ్వానికి చాటాడు. అతిపేద కుటుంబంలో పుట్టి, చదువుల తల్లి ముద్దుబిడ్డగా ఎదిగి, తన నడవడికతో అననుకూల పరిస్థితులను అవకాశాలుగా మార్చుకొని బ్రహ్మచర్యదీక్షతో దైవీశక్తుల కృపకు పాత్రుడై, వినమ్రుడై, తాను రూపొందించిన మిస్సైలా నింగిలోనికి దూసుకుపోయిన రీతిలో తాను రాష్ట్రపతి పీఠాన్ని అలంకరించిన వామనమూర్తి మన అబ్దుల్ కలాం.**

దేశ ప్రథమపౌరుడు ఏ రీతిగా మసలుకోవాలో ఆచరించి చూపిన ఆదర్శమూర్తి.


రాష్ట్రపతి నిలయంలో తానుండగా తన బంధుగణము వచ్చి కొన్ని రోజులు తనతో గడపగా, ఆ సమయంలో వారికి అయిన ఖర్చు లెక్కగట్టి తన స్వార్జిత సొమ్ము నుండి ప్రభుత్వ ఖజానాకు జమచేసిన **అపర చాణక్యుడు, అపర విదురుడు.**

దేశ ప్రథమపౌరునిగా పదవీ విరమణ చేసినవారికి వారి శేష జీవిత బాగోగులను ప్రభుత్వమే చూసుకుంటుం దని తెలియగానే **తన కష్టార్జితాన్నంతా ధార్మిక సంస్థపరం గావించిన త్యాగమూర్తి, ఆదర్శప్రాయుడు, అపర దానకర్ణుడు.**

దేశ రాష్ట్రపతి పదవి నుండి పదవీవిరమణ చేసిన అబ్దుల్ కలాం తన విలక్షణ జీవనశైలితో దేశప్రజలనేగాక, విదేశీ ప్రముఖుల సైతం అత్యంత ప్రభావితం గావించాడు. వీరిలో కెనడా దేశపు ప్రస్తుత గవర్నర్ జనరల్ డేవిడ్‌జాన్‌స్టన్‌గారు ఒకరు. వీరు కెనడాలోని పేరెన్నికగన్న వాటర్‌లూవిశ్వవిద్యాలయ ఛాన్సలర్‌గా 2010 లో ఉన్నారు. డా॥ కలాంగారికి గౌరవ డాక్టరేట్‌ను తన చేతుల మీదుగా ప్రదానం చేసెడి గౌరవాన్ని తాను దక్కించుకోవాలని కెనడా గవర్నర్ జనరల్ పదవీ ప్రమాణ స్వీకార సమయాన్ని వాయిదా వేసికొనుట, కలాం వ్యక్తిత్వానికి లభించిన అత్యంత అరుదైన పురస్కారం. రాష్ట్రపతి పదవీ విరమణానంతరం మూడుమార్లు కెనడాను సందర్శించిన ఏకైక మాజీ రాష్ట్రపతి కలాం తన వ్యక్తిత్వంతో కెనడా ప్రజల మానసాన్ని చూరగొన్న మాంత్రికుడు. కెనడాలో ఎవరెవరిని కలుస్తారు అని ప్రశ్నిస్తే, విద్యావేత్తలను, పరిశోధకులను మరియు విద్యార్థులను అని సమాధానమిచ్చారు. ఆయన మనస్సు ఎల్లవేళలా వివేకానందునిలా భారతదేశ ప్రగతి, భారత ప్రజల సౌభాగ్యాన్ని గురించి కలలుకంటూ ఉంటుంది. కెనడాలో నయాగారా జలపాతాన్ని సందర్శించి వస్తూన్నప్పుడు నదుల అనుసంధానం జరిగిన దృశ్యం ఆయన కంటపడింది. వెనువెంటనే తన ప్రక్కనున్న లక్ష్మణ్ (ప్రముఖ శాస్త్రవేత్త, గ్రీన్ టెక్నాలజీ కెనడా నివాసి)ను ఉద్దేశించి, భారతదేశ నదులను అనుసంధానం

**పేదవాని ఆస్తి అతనికున్న సమర్థత**

గావించుటకై కెనడా దేశపు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ఆకాంక్షించారు.



### దేశ రాష్ట్రపతిగా ఆయన ఎన్నో ప్రత్యేకతల కనబర్చారు

1) తొలి బ్రహ్మచారి రాష్ట్రపతి 2) సుఖోయ్ యుద్ధవిమానంలో పయనించిన తొలి రాష్ట్రపతి. 3) అత్యంత ఎత్తైన సియాచిన్ సరిహద్దు ప్రాంతాన్ని దర్శించి సైనికుల మధ్య గడిపిన తొలి రాష్ట్రపతి. 4) భారత సైన్సు కాంగ్రెసులో ప్రసంగించిన తొలి రాష్ట్రపతి.

***ఆయన వ్రాసిన గ్రంథాలు:*** 1) వింగ్స్ ఆఫ్ ఫైర్ (ఒక విజేత ఆత్మకథ తెలుగులో) 2) ఇండామిటబుల్ స్పిరిట్ 3) ఇగ్నైటెడ్ మైండ్స్ 4) ఇండియా 2020 5) మై జర్నీ

### అబ్దుల్ కలాం కోరుకున్న భారతదేశ రూపురేఖలు

"యూ ఆర్ యూనిక్" అనెడి తన గ్రంథము నుండి...

**1) సాంకేతిక ప్రగతిని పుణికిపుచ్చుకుని అత్యధిక ఉపాధి సామర్థ్యాన్ని సంతరించుకుని సుస్థిర సంపదతో భరతమాత తులతూగాలి.**

**2) గ్రామీణ పట్టణ వ్యత్యాసాలు లీలామాత్రంగా కూడా లేకుండా పోవాలి.**

**3) సామాజిక ఆర్థికపరిస్థితుల ప్రాతిపదికన ప్రతిభావంతులకు విద్య మృగతృష్ణ కారాదు. (కుల ప్రాతిపదికగా కాకూడదు).**

**4) ప్రపంచవ్యాప్తంగా నున్న మేధావులు, శాస్త్రవేత్తలకు భారత్ విద్యాపీఠం కావాలి.**

**5) ఎయిడ్స్, టి.బి. ఇతర అంటువ్యాధులు, గుండెజబ్బులు, క్యాన్సర్ వంటి మహమ్మారులు అంతరించిపోవాలి.**

**6) పారదర్శకత, అవినీతిరహిత పరిపాలన రావాలి. పేదరికం, నిరక్షరాస్యత, మహిళలపై నేరాల జాడే లేకుండాపోవాలి. శాంతి సంతోషాలు పరిఢవిల్లాలి. అడుగడుగునా ఐశ్వర్యం నడయాడాలి. భూలోకస్వర్గంగా భాసిల్లాలి. ప్రతి భారతీయుని పెదవులపై నిరంతరం చిఱుదరహాసం మెఱవాలి. ఇదే నేను ఆకాంక్షించెడి నా ప్రియ భారతావని.**

### అబ్దుల్ కలాం ఆదర్శ జీవితంలోని ఆఖరి క్షణాలు


27 జులై 2015 న అస్సాంలోని "ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్" కళాశాలలోని విద్యార్థుల ఉద్దేశించి ప్రసంగించుటకు అస్సాంలోని గౌహతిని చేరుకున్నారు. విమానాశ్రయం నుండి కారులో సభాస్థలికి బయలుదేరారు. వీరికి రక్షణగా సిపాయిల వాహనం ముందు వెళ్తున్నది. ఒక సిపాయి నిలబడి పహరాకాస్తున్నాడు. మిగిలినవారు కూర్చొని ఉన్నారు. కలాం దృష్టి ఆ నిలబడ్డ సిపాయిపై పడింది. అతనిని కూర్చుండ పెట్టుటకై శతవిధాల ప్రయత్నించారు. సిపాయి తనకై శ్రమించుట చూచిన ఆయన హృదయం తల్లడిల్లిపోయింది. తన మజిలీకి చేరుకోగానే ఆ సిపాయిని తన వద్దకు పిలిపించుకొని సుఖాసీనుని గావించి కుశలమడిగి ఏమైనా తింటారా? అని ప్రశ్నించి, తనకై కష్టపడుచున్న అతనికి ధన్యవాదాలు తెలుపగా ఇంతటి ఆప్యాయతను తన జీవితంలో ఎన్నడూ చవిచూడని సిపాయి చలించిపోయాడు. ఆనంద భాష్పాలు రాలాయి. "అయ్యా! మీ రక్షణకై ఏకధాటిగా ఆరు గంటలైనా నిలబడతాను" అని అత్యంత వినయంగా బదులిచ్చాడు.

తదుపరి తన అనుచరునితో చర్చిస్తూ దేశ పరిస్థితిని ఉద్దేశించి ఈ క్రింది విషయాలపై తన బాధను వ్యక్తపరచాడు కలాం.

**మొదటిది:** పంజాబ్ పోలీసుఠాణాపై ఉగ్రవాదుల దాడి. భూగ్రహం అందరూ సుఖశాంతులతో జీవించుటకు అనువుగా ఉండాలని ఆకాంక్షించారు. మానవ సృజన శక్తులు మానవ ప్రగతికి బదులుగా మానవజాతి వినాశనానికి తోడ్పడుట చూచి ఆయన బాధపడ్డారు. కాలుష్యంలా ఇది సమాజాన్ని రక్తమోడేలా చేస్తున్నది అని వాపోయారు.

**రెండవది:** దేశ పార్లమెంటులో జరుగుచున్న రభస – దేశ ప్రజాస్వామ్య మనుగడకు వెన్నెముకగా నిలచిన పార్లమెంటు స్వార్థపర, అధికార వ్యామోహ రాజకీయాలకు నిలయంగా మారుట ఆయనను బాధించింది. దేశ అభివృద్ధి అంశాలపై

**సముద్రపు అలలు, గాలులు సమర్థవంతమైన నావికులకు తోడ్పడతాయి**



జరగవలసిన చర్చలు అనర్థదాయక స్వార్థపర అంశాలపై జరుగుట చూచి ఆయన మనస్సు క్షోభించింది.

దీనికి పూర్వం గతంలో కలాం తన అనుచరుడిని ఈవిధంగా ప్రశ్నించారు – "దేనికి నీవు (నీ జీవితం) జ్ఞాపికగా నిలుస్తావు నిర్ణయించుకో!" యువకుడైన ఆ అనుచరునికి జవాబు స్ఫురించలేదు. అనుచరుడు తెలివిగా అదే ప్రశ్నను కలాంగారికి సంధించాడు. "మిమ్మల్ని ఏ రీతిగా గుర్తు పెట్టుకోవాలి? రాష్ట్రపతిగానా? శాస్త్రవేత్తగానా? రచయిత గానా? మిస్సైల్ మనిషిగానా? భారతదేశ 2020 గానా? అని ప్రశ్నించగా అనుచరుడిని ఆశ్చర్యపరుస్తూ "ఉపాధ్యాయునిగా" గుర్తుపెట్టుకోమన్నారు.

## తన కన్నతల్లిపై ప్రేమ

తన చిన్ననాడు ఒకరోజు ఆకలితో తల్లి వద్దకు పళ్ళెరము తీసుకొని వచ్చి అమ్మా ఆకలి అవుతున్నది అన్నం పెట్టు అన్నాడు. బిడ్డ ఆకలిని గమనించిన తల్లి వెంటనే రెండు రొట్టెలను వేడిచేసి కూరతో పళ్ళెములో వడ్డించింది. చకాచకా తిని అమ్మ ఒడిలో సేదతీరాడు కలాం. కుమారుని తల నిమురుతూ "ఇంత చిన్న వయసులో ఎంతలా శ్రమిస్తున్నావు నాయనా! భగవంతుడు నిన్ను చల్లగా చూస్తాడు. నీ శ్రమయే నీకు అల్లా రక్షా అని దీవించింది." ఆక్షణంలో ఆమె కనుకొలకుల నుండి రెండు వేడి కన్నీటి బిందువులు కలాంపై పడ్డాయి. ఈ సంఘటన కలాం మదిలో బలంగా నాటుకుపోయింది. అమ్మ పట్ల తనకు గల ప్రేమ– ఆరాధనగా మారింది.

దేశ రాష్ట్రపతి పదవిని అలంకరించి ఆసేతుహిమాచల దేశ ప్రజలచే జేజేలు కొట్టించుకున్నవేళ కలాంకు తన తల్లి అందించిన ఆశీస్సులు మదిలో మెదిలాయి. తన మదిలో ఒక మౌనరాగం అమ్మ గురించి మెదిలింది. అమ్మా! ఆనాడు నా ఆకలి తీర్చుతూ నాకు పెట్టిన ఆ అమృత సమానమైన రొట్టెలు ఈ శరీరంలో జీర్ణమై అమృతతుల్యంగా మారి నన్ను నేడు దేశ ప్రథమపౌరునిగా నిలిపాయి. నేడు కృతజ్ఞతగా నీ పాదాల చెంత నా శిరస్సు తాకించాలన్నా నా ఈ కోరిక నీవు లేనందున తీరకున్నది. కావున నా ఈ తనువును చాలించిన పిదప నీవు ఉన్న ఆ లోకానికి నీవు ధరించిన శరీరం లాంటి శరీరంతో వచ్చి నీ చరణస్పర్శ గావించుకొనెద అని మౌనంగా ఉద్వేగ భరితుడైనాడు.

పై సంఘటనకు పూర్వము, అనుచరునితో దేశ సామాజిక, కుటుంబ స్థితిగతుల ప్రస్తావిస్తూ "పిల్లలకు తమ తల్లిదండ్రులను సంరక్షింపవలసిన బాధ్యత వారిపై నున్నది. ఇది కొన్నిసార్లు జరుగుటలేదు. ఇది చాలా బాధను కలిగిస్తున్నది. పెద్దలు కూడా తమ కర్తవ్యాన్ని వారు పాలించుట లేదు. సంపదను తల్లిదండ్రులు వారి చివరి క్షణాల వరకు తమ స్వాధీనంలో ఉంచుకొని మరణశయ్యపై విడచిపోవుచున్నారు. ఇది కుటుంబ కలహాలకు దారితీస్తున్నది. రెండవది ఆఖరి క్షణం వరకు పనిచేస్తూ పోయెడివాడు అదృష్టవంతుడు, దీర్ఘరోగాల బారినపడక చివరి క్షణం వరకు నిలబడే ఉండాలి. ఆఖరి వీడ్కోలు సూక్ష్మంగా ఉండాలి. నిజంగా వీడ్కోలుకు చాలా తక్కువ సమయం ఉండాలి" అని తన మనస్సులోని ఆలోచనలను వెల్లడించారు.

తన ఆలోచనలకు అనుగుణంగా అబ్దుల్ కలాం అనెడి ఈ ఋషిపుంగవుడు తన జీవితాన్ని చాలించాడు.

**తన ఆలోచనలకు అనుగుణంగా :**

1) ఆఖరిక్షణం వరకు "ఉపాధ్యాయునిలా" బోధిస్తూ చిట్ట చివరి శ్వాసను విడచాడు.
2) తన జీవితంలోని చిట్టచివరి క్షణం వరకు ప్రసంగిస్తూ నిలబడే ఉన్నాడు.
3) ఆఖరి వీడ్కోలు అత్యంత సూక్ష్మంగా పూర్తిచేసికొని వెళ్ళాడు.
4) తన భౌతికసంపదల ఖాతాను శూన్యం గావించుకొని ఆధ్యాత్మిక సంపదల ఖాతాను సంపూర్ణంగా నింపుకొని ఈ కలల సాకార పురుషుడు తన కలల పండించుకొని "దేవమానవునిలా" మనల వీడిపోయాడు.

*– సంకలనం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**అసమర్థుడైన మిత్రుని కన్నా సమర్థుడైన శత్రువు మేలు**

అతీంద్రియ విజ్ఞానం-5

# శ్రవణ-దర్శనములకు సంబంధించిన దివ్యశక్తులు

భవిష్యద్దర్శనము అనేది ఏదో ఒక పెద్ద దుర్ఘటన లేదా మృత్యుసంకటము వంటిది త్వరలో రాబోతున్నప్పుడు సంభవిస్తుంది. ఎక్కువమంది ప్రజలకు ఇలాంటి సందర్భం జీవితములో ఒక్కసారో, అరసారో ఏర్పడవచ్చు. అదికూడా ఆ వ్యక్తికి తత్సంబంధమైన అనుమానము ఏమాత్రము కూడా కలగనటువంటి స్థితిలో అకస్మాత్తుగా, విచిత్రముగా సంభవిస్తుంది. చాలామందికి తమకు అత్యంత ప్రియమైనవారి మృత్యుకాలము యొక్క సూచన కొన్ని వారాలు లేదా నెలల ముందుగానే లభిస్తుంది. ఐతే ఈ సంఘటనలు ఎలాంటి ప్రాముఖ్యతా లేని అతి సాధారణ వ్యక్తులకు దర్శనమౌతు ఉంటాయి. వారికి ఏ సంఘటన గురించైనా ముందుగానే తెలియడమన్నది ఏవిధంగా జరుగుతున్నది అన్నదే సమస్య.

ఈ విషయమై ఈ రంగములో పరిశోధన చేస్తూ వున్న వైద్యురాలు లుయిసా ఈ రైన్ అనే అమెరికన్ మహిళ తాను వ్రాసిన 'ట్రేసింగ్ హిడెన్ చానెల్స్' (గుప్తప్రవాహముల పరిశోధన) అనే పుస్తకములో జరగబోయే సంఘటనను ముందుగానే దర్శించే ఘటనలు అధికముగానే ఉంటున్నాయి. అవి ఏవిధముగా జరుగుతున్నాయి అనేదే ఆశ్చర్యము కలిగిస్తున్న విషయము' అని వ్రాస్తూ తిరిగి ఆమెయే దీనికి సమాధానమును కూడా చెప్తున్నారు.

ఈ సంఘటనలు ఒక వ్యక్తి దైనిక జీవితములోని ఏదో ఒక చిన్న అంశమునకు సంబంధించి ఉంటాయి. అది ఎప్పటి నుండో బాగా పట్టిపీడిస్తున్న తీవ్రమైన సమస్యకు సంబంధించి నది కావచ్చు లేదా త్రోవలో వెళ్ళేటప్పుడు ఏదో ఒక వాహనము మనకు అనుకోకుండా గుద్దుకోవడము లాంటి ఆకస్మిక సంఘటనకు చెందినదైనా కావచ్చు. ఇలాంటి సంఘటనలు సంపూర్ణముగా ఉండవు. అవి జీవితమునకు పూర్తిగా సంబంధించినవీ అయ్యుండవు. తక్కువమంది వ్యక్తులు మాత్రమే తాము చూసిన సంఘటనల గురించి అవి జీవితమునకు సంపూర్ణముగా సంబంధించినవే అని గట్టిగా నమ్ముతుంటారు.

ఇదే అంశము మీద ఇంకొంచెము ముందుకుసాగి శ్రీమతి రైన్ 'ఈవిధమైన భవిష్యద్దర్శనములో ఒక తమాషా ఇమిడి ఉన్నది. అదేమిటంటే వారందరూ సంబంధిత వ్యక్తులై ఉండుట. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో జరుగబోయే సంఘటనలను ముందుగానే చూడగలగటమనేది ఎక్కడో ఎవరికో జరుగు తుంటుంది. ఎక్కువ భాగము ప్రజలకు తమ సమీప సంబంధీకుల విషయంలోనే జరుగబోయే సంఘటనల గురించి తెలుస్తూ ఉంటుంది' అని చెప్పినది.

అయినప్పటికినీ ఈ విద్యను సాధన చేసేవారు వెల్లడించే కొన్ని తిరుగులేని ఋజువులను విన్నప్పుడు శాస్త్రజ్ఞులుకూడా నిశ్శబ్దముగా ఉండిపోవలసివచ్చింది. అమెరికాలో మనోవిజ్ఞాన పరిశోధనాసంస్థ 1400 ఉదాహరణలను కూర్చిపెట్టింది. వాటిలోని కొన్ని సంఘటనలు ఎలాంటివంటే ఏమాత్రము నమ్మకము లేనివారికి, అవిశ్వాసులకు కూడా భవిష్యత్ దర్శనములోని సత్యతను నమ్మవల్సివచ్చింది. 'టీ కప్పులో తుఫాను' అనే శీర్షికతో వచ్చిన సంఘటనలో ఈ క్రింది విధముగా వివరించబడింది.

అమెరికాలోని కాలిఫోర్నియా నగరానికి చెందిన శాండియాగోలో పోలీస్‌సూపరింటెండ్‌గా పనిచేసే వాల్టర్ జె మేసీ ఒకరోజు తన కార్యాలయమునుండి ఇంటికి వస్తూ దారిలో తన భార్యస్నేహితురాలైన శ్రీమతి హాఫ్‌మైన్ ఇంటి వద్ద ఆగాడు. ఆ సమయమునకు వాల్టర్ భార్య కూడా అక్కడకు వచ్చి ఉండటం చేత ఆమెనుకూడా తీసుకొని ఇంటికి వెళ్ళవచ్చనే ఉద్దేశ్యముతో ఆ ఇంటివద్దకు వచ్చాడు. హాఫ్‌మైన్ టీ త్రాగమని వాల్టర్‌ని అడిగింది.

మాటల మధ్యలో శ్రీమతి హాఫ్‌మైన్ 'వాల్టర్‌గారూ! మీరు ఇష్టపడితే కనుక మీరు త్రాగుతున్న టీకప్పులోకి తొంగిచూస్తూ రాబోయే లేదా జరుగబోయే ముఖ్యమైన సంఘటన గురించి మీకు తెలియజేస్తాను' అని అన్నది. వాల్టర్ 16 సంవత్సరముల నుండీ పోలీస్ వృత్తిలో కొనసాగుతున్నాడు. రకరకాలైన తుంటరులు, నేరస్థులు, చోరులు మొదలైనవాళ్ళ మధ్య రాత్రిం

తక్కువ తెలిసినవారు ఎక్కువ వాదిస్తారు

బవళ్ళు గడుపుతూండటము చేత వాళ్ళ వ్రేలిముద్రలు చూస్తే వాళ్ళు ఎవరో, ఏమిటో కనుక్కోవటమూ అలవాటై పోయింది. అందుచేత ఇలాంటి దైవికమైన అంశముల పట్ల ఆయనకు నమ్మకము లేదు. ఐనప్పటికినీ ఈ తమాషా పని ఏమిటో చూద్దామని తాను త్రాగుతున్న టీకప్పును ఆమె ముందుకు జరిపాడు.

టీ కప్పులోకి చూస్తూనే ఆమె విహ్వలంగా 'ఈ కప్పులో మృత్యువు దర్శనమిస్తున్నది. రెండు మరణములు సంభవించ నున్నాయి. అందులో ఒకరు చదువుకున్న వ్యక్తి. తుపాకీగుండు తగిలి మరణించిన కారణముగా అతడి మొహం జల్లెడ వలె తూట్లుతూట్లు పడిపోయింది. రెండవ వ్యక్తి ఒక వ్యాపారి. అతడు యూనీఫామ్ ధరించి, నల్లని చెప్పులు వేసుకుని ఉన్నాడు' అని సవివరముగా చెప్పింది.

వాల్టర్ ఇలాంటివాటిని ఎంతమాత్రమూ నమ్మడు. కానీ శ్రీమతి హాఫ్‌మైన్ మొహము చూసి అతడు ఎంతో కొంత ప్రభావితుడైనాడు కాబట్టి మర్నాడు ఆయన తన పై అధికారైన జీడొరన్‌తో దీనిని గురించి చర్చించాడు. ఆయన ఇతడిని మించిన అవిశ్వాసి. అతను వాల్టర్ చెప్పిన మాటలను విని విపరీతముగా నవ్వి హేళన చేశాడు. కానీ శ్రీమతి హాఫ్‌మైన్ చెప్పిన రీతిగా తరువాతి ఆదివారము నాడు ఒక బందిపోటు కాలిఫోర్నియా థియేటర్ లోకి చొరబడి అక్కడున్న మేనేజర్‌ను హత్యచేశాడు. తనను వెంటాడిన ఒక పోలీస్‌సార్జెంట్‌ను గాయపరిచాడు. రక్షణ వ్యవస్థా యంత్రాంగము ఆశ్చర్యపోయి ఆ బందిపోటుగుంపును వెంబడించింది. రక్షణశాఖలోని వారంతా కల్సి ఒక రహస్య ప్రదేశంలో దాగియున్న బందిపోటు గుంపులోనుండి ఒకరిని తుపాకీతో కాల్చి చంపారు. తుపాకీ గుండ్లు దూసుకుపోవడంతో అతడి ముఖం నిజముగా జల్లెడ వలె తూట్లుపడిపోయింది.

ఇలాంటిదే ఒక ప్రయోగమును సర్‌జోసెఫ్ అనే పెద్దమనిషి చేశాడు. ఒక ప్రత్యేక రకమైన అద్దములో ఆయన దృష్టిని కేంద్రీకరించి–తన భార్య పరిస్థితి గురించి తెలుసుకోవాలను కున్నాడు. ఐతే అద్దములో ఆయనకు మంచి ఆభరణములు, వస్త్రములు ధరించిన ఒక సంపన్నయువతి దర్శనమిచ్చింది. ఆమె ముఖకవళికలు తన భార్యకు కొంచెము దగ్గరగానే ఉన్నాయి. కానీ తన భార్య ఇంత గొప్ప ఆభరణములు ధరించదు కాబట్టి ఈ విషయమును నేను నమ్మను అన్నాడు. కానీ ఇంటికి వచ్చి తన భార్యను చూసిన ఆయన ఆశ్చర్యము నకు అంతేలేదు. సరిగ్గా తాను అద్దంలో చూసినటువంటి మేలిరకపు వస్త్రాభరణములను ఆమె ధరించియున్నది.

అప్పటినుండీ జోసెఫ్ భారతీయవేదాంతము పట్ల ఎంత ప్రభావితుడయ్యాడంటే ఒక విద్యార్థి లాగా దాన్ని అధ్యయనం చేశాడు. చాలారోజుల వరకూ ఆయన మనస్సులో 'చూడలేని దానిని కూడా చూడగలిగినట్టి, తెలియనిదానిని కూడా తెలిసి కొనగలిగినటువంటి 'ఆత్మశక్తి' నిస్సందేహముగా భౌతిక శక్తులన్నింటితోనూ పరిపూర్ణమైనదై ఉండాలి' అన్న ఆలోచన మెదలుతూవుండేది. అటువంటి పరిపూర్ణమైన చేతనాస్థితిని గురించి తెలుసుకొనటము ఎంతో అవసరము. అదే జీవుని యొక్క అంతిమస్థితి. దానిని పొందిన పిదప ప్రపంచములో ఇంక పొందవల్సినదేదీ ఉండదు.

ఈనాడు శాస్త్రవేత్తలు రకరకాలైన కంప్యూటర్లను తయారు చేశారు. వాటి యొక్క ఎలక్ట్రానిక్‌శక్తికి సంబంధించినవి గానీ, గణిత సంబంధిత సిద్ధాంతములకు చెందినవి గానీ ఎన్నో విషయములను తెలియజేస్తుంది. కంప్యూటర్ శరీరములోని వ్యాధులను గురించి చెప్తుంది. లక్షలకాంతి సంవత్సరముల దూరములో నున్న నక్షత్రముల యొక్క దూరము, దిశ, కోణము మొదలైన వాటన్నింటిని గురించి చెప్తుంది. కానీ ఒక మనిషి ఎప్పుడు, ఎలా మరణిస్తాడు, ఏ సంవత్సరములో–ఏ నెలలో–ఏరోజు అసలు ఈ మనిషి యొక్క పరిస్థితి ఏమిటి? మొదలైన అంశములతో కూడిన సచేతనమైన జ్ఞానము ఏ పదార్థము దగ్గరా లేదు. ఏ యంత్రము దగ్గరా లేదు. అది ఒక్క ఆత్మ చేతనత్వము యొక్క శక్తికి మాత్రమే సాధ్యపడుతుంది. అది మనకు తెలిసిగానీ, తెలియకుండా గానీ మానవులను ప్రేరితులను గావిస్తుంది, ప్రభావితము చేస్తుంది. ఇలాంటి సంఘటనలను ప్రపంచంలోని అన్ని దేశములలోనూ మనము చూడగలము.

భవిష్యత్తును గురించి తెలియజేయబడిన అనేక సంఘటన లలో ఈ క్రింది సంఘటనకూడా ఒకటి. ఇందులో సంపూర్ణమైన ఆరోగ్యముతో ఉన్న ఒక వ్యక్తికి రాబోయే మరణమును గురించి ఒక సూచన ముందుగానే కలిగింది, తర్వాత అది అక్షరాలా నిజమైంది.

**పోరాటం సల్పేవాడు గెలువనూవచ్చు, ఓడిపోనూవచ్చు - కాని పోరాటాన్ని విడిచినవాడు ఓడినవాని క్రిందేలెక్క**

ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రములోని మురదాబాద్ జిల్లాలోని 'సబాయీ' గ్రామమునకు చెందిన సంఘసేవకుడూ, అందరికీ ఆత్మీయుడూ ఐన గజరాజసింహుడు అనే వ్యక్తికి తన మరణమును గురించిన సూచన నాలుగురోజులు ముందుగానే అందింది. అప్పటికే కొంచెం అస్వస్థతగా ఉన్నప్పటికీ రోజూవారీ పనులు చేసుకుంటూ మామూలుగానే తిరుగుతున్నాడాయన. ఇంటిలోనివారికి తన మరణమును గురించిన సమాచారమును నాలుగు రోజుల ముందే చెప్పి, శ్మశానమునకు వెళ్ళి తనను దహనము చెయ్యవల్సిన స్థలమును చూపించి స్వహస్తములతో ఆ ప్రదేశమునంతా శుభ్రము చేయటమే కాదు; కట్టెలు, శవం మీద కప్పే గుడ్డ, అంతెందుకు నేల అలకటానికి పేడతో సహా వస్తు సామగ్రినంతా తానే సిద్ధముచేసి ఉంచాడు. అంతకు ముందు భోజనము చేస్తూన్నప్పటికీ నాలుగురోజులనుండీ పాలు-గంగాజలము మాత్రమే పుచ్చుకుంటున్నారాయన. చుట్టు ప్రక్కల గ్రామస్థులను పిలిచి వారికి కావల్సిన సలహాలు కూడా ఇచ్చారు. తాను మరణించబోయే సమయం మధ్యాహం 2 గంటలకు కాబట్టి, కుటుంబసభ్యులందరినీ అంతకుముందే భోజనము చెయ్యమని బ్రతిమిలాడి వారందరూ ఆ పని ముగించేలా చూశారు. ఆశ్చర్యమును కలిగిస్తూ మృత్యువు సరిగ్గా చెప్పిన సమయమునకు ఆయనను వరించింది. అంతకు 15 నిమిషముల క్రితం వరకూ కూడా ఆయన ఆరోగ్యముగానే ఉన్నారు.

తాను వ్రాసిన 'ద హ్యూమన్ పర్సనాలిటీ ఎండ్ ఇట్స్ సర్వైవల్ ఆఫ్టర్ వరల్డీడెత్' అనే ప్రసిద్ధ పుస్తకములో శ్రీమేయర్స్ 13 ఉదాహరణలను పొందుపరచాడు. వాటిలో ఎంతో అద్భుతమైన జ్ఞానశక్తులను గురించి వివరిస్తూ 'జ్ఞానము యొక్క అద్భుతమైన శక్తులు పదార్థమునకు సంబంధించినవి కావు' అని చెప్పే ప్రయత్నము చేశారాయన. ఇది తప్పనిసరిగా ఏదో ఒక చేతనాశక్తి యొక్క క్రీడయే! ప్రఖ్యాత గణితజ్ఞులైన వాస్ మరియు ఏంపియర్‌ల ఉదాహరణలు కూడా ఇందులో ఎన్నో కూర్చబడి ఉన్నాయి. అన్నీ కూడా సప్రామాణికమైనవే. అందులో సందేహము లేదు.

అమెరికన్ చరిత్రనుండి రెండు సంఘటనలు గ్రహించ బడినవి. అక్కడ క్రీ.శ 1844 ఫిబ్రవరి 28న ఒక మహత్త్వ పూర్ణమైన కార్యక్రమము జరుగబోతున్నది. యూ. ప్రిన్స్‌టన్ అనబడే ఒక క్రొత్త భారీ యుద్ధనౌక నిర్మాణము చెయ్యబడి సిద్ధముగా నున్నది. దాని ఆవిష్కార కార్యక్రమానికి చాలామంది గొప్ప గొప్ప వాళ్ళను ఆహ్వానించడము జరిగింది. అందులో కర్నల్ డేవిడ్‌గార్డినర్, ఆయన కూతురు జూలియా, జలసేన సెక్రెటరి థామస్‌గెల్‌మర్, అతని భార్య ఏనీ కూడా ఉన్నారు.

ఈ ఇద్దరు స్త్రీలకు 27వ తేదీ రాత్రి ఒక కల వచ్చింది. అందులో జూలియా తండ్రీ, ఏనీ యొక్క భర్తా ఇద్దరూ మరణించబోతున్నట్లు స్పష్టమైన సంకేతాలు లభించాయి. భయముతో వణికిపోయిన జూలియా తన తండ్రిని ఈ కార్యక్రమములో పాల్గొనవద్దని గట్టిగా పట్టుపట్టింది. అదే విధముగా ఏనీ కూడా తన భర్తను అడ్డుకొనటానికి చాలా ప్రయత్నించింది. కానీ మగవాళ్ళిద్దరూ కలలో వచ్చే ఇట్టి విషయములకు అంత ప్రాధాన్యతనివ్వవల్సిన అవసరము లేదంటూ పడవ మీద బయలుదేరి వెళ్ళిపోయారు.

అక్కడ ఒక ఫిరంగిని సముద్రము వైపు నడిపిస్తూండగా అది అకస్మాత్తుగా పేలిపోవటమూ, ప్రక్కనే నిలబడియున్న గార్డినర్, థామస్‌గెల్‌మర్ ఇద్దరూ కూడా తక్షణమే మృతి చెందటమూ వెనువెంటనే జరిగిపోయాయి.

ఏనీకూడా అక్కడే ఉన్నది కానీ ఆమె సురక్షితముగా బయటపడింది. శోకతప్తహృదయముతో ఆమె 'నా మాటలను ఎవ్వరూ నమ్మరెందుకు?' అని విలపించినది. ఈ ప్రమాదము జరిగిన సమయములో జూలియా పడవ డెక్ క్రింద ఉన్నది. తండ్రి మరణించాడని వినగానే ఆమె 'అయ్యో! నా కల నిజమయిందే!' అని దుఃఖముతో కేకలు పెట్టి రోదించినది.

*(సశేషము)*

– అనువాదము: *శ్రీమతి కృష్ణకుమారి*

**యుగశక్తి గాయత్రి**

**మాసపత్రిక చదవండి !**

**చదివించండి !!**

**భవనం యొక్క పునాది బయటికి కనిపించని రీతిలో మనిషి నిజ స్వభావం బయటికి కనిపించదు**

# వందనీయ మాతా భగవతీదేవి పుణ్య స్మరణ



సృష్టిని మంచి సంస్కారాలతో నింపుటకై భగవంతుని అవతారంతోపాటు, ఆయన యొక్క మహాశక్తి కూడా అవతారం తీసికొని, ఆయన పనుల నిర్వర్తించుటలో సహాయకారిగా నిలచుట పరిపాటి.

వర్తమానయుగంలో ఆ మహాశక్తి మాతా భగవతీదేవి రూపంలో 20 సెప్టెంబరు 1926లో ఈ అవనిపై అవతరించింది. పరమపూజ్య గురుదేవుల యొక్క సహధర్మచారిణిగా రూపుదాల్చి గురుదేవుల ఈశ్వరీయ పనులలో సహాయమందిస్తూ మనందరి ఎదుట మాతృశక్తి రూపంలో అనేకానేక రూపాలలో మన ముందు నిలచారు. ఆదర్శగృహిణిగా, ఆదర్శమాతగా, ఆదర్శ తపస్విలా, ఆదర్శ యోగసాధకురాలిలా, రచయిత్రిగా, ప్రసంగీకురాలిగా, ప్రచారకురాలిగా, ఒక ఆదర్శ గురు స్వరూపంగా మనందరి సమక్షంలో ప్రకటితమయ్యారు. ఆమె యొక్క పవిత్ర సాధనా సంసన్న జీవితం ద్వారా భారతనారి యొక్క గౌరవాన్ని మాతా అన్నపూర్ణ స్వరూపంతో అభివ్యక్తీకరించారు. స్త్రీ యొక్క నిజశక్తి స్వరూపాన్ని వందనీయ మాతాజీ మనకు దర్శింపజేశారు.

పరమపూజ్య గురుదేవుల యొక్క తీవ్ర సాధన జరిగెడి కాలమది, వరుస మహాపురశ్చరణల సాధన చివరి దశకు చేరుచున్న కాలమది, అఖండజ్యోతి మాసపత్రిక ప్రచురణ ప్రారంభమయిన సమయమది. నేటి సువిశాల గాయత్రీ పరివార్ ఆనాడు అఖండజ్యోతి కుటుంబ రూపంలో క్రమ క్రమంగా నెమ్మదినెమ్మదిగా వేళ్ళూనుకొనుచున్నది. ఇట్టి మొక్కను సాకి సంరక్షిస్తూ, పెంచి పోషించగల మాతృమూర్తి ఆవశ్యకత ఏర్పడిన సమయమది. తల్లి జన్మనిచ్చెడిది అని మాత్రమే చెప్పుటయే కాక, ఆమె తన నీడలో తన సంతానానికి తగిన సంస్కారాలను అందించి శ్రేష్ఠులనుగా చేస్తుందనేది కూడా వాస్తవం. తల్లి తన సంతానంలో ప్రాణ శక్తిని నింపి సంతానాన్ని సంపూర్ణ వికాసవంతంగావించి, శ్రేష్ఠ మానవులుగా తీర్చిదిద్దుటలో తన జీవితాన్ని అర్పిస్తుంది. జన్మనిచ్చిన తల్లి చేయలేని పనిని పరమవందనీయ మాతాజీ చేసింది. ఆమె తన ఆరాధ్యుని సంపర్కంలో ఉంటూ అనేక కష్టతరమైన సాధనలను లోతుగా అభ్యసించి ఒక శ్రేష్ఠ శిష్యురాలి రూపంలో నిలచింది. ఆమె తన తపస్సును ఆవల్‌ఖేడాలోని గృహంలో, అదే సభ్యుల మధ్య ఆరంభించి, పూజ్య గురుదేవులు ప్రజ్వలింప చేసిన అఖండదీవం సన్నిధిలోనే కొనసాగించింది.

అఖండజ్యోతి పత్రికా ప్రచురణ కొంతకాలం పాటు ఆగ్రాపట్టణములో జరుగగా, అటు పిమ్మట మధురలో కొనసాగింది. ఆవల్‌ఖేడా నుండి ఆగ్రా చేరుకొని, తిరిగి మధురలోని ఘియామండిలో నివాసం ఏర్పాటు చేయుట జరిగింది. సందర్శకులు, జిజ్ఞాసువులు, సాధకుల సంఖ్య పెరుగుచున్న కొలది, వందనీయమాతాజీ యొక్క సహాయ సహకారాలతో మిషన్ వ్యాప్తి చెందసాగింది. పరివార్‌లో తాయిజీ (గురుదేవుల తల్లి), పిల్లలు మినహా మిగతా బంధుగణం రాసాగింది. పరమ వందనీయ మాతాజీ కూడా తన ఆరాధ్యునితో కూడి ఈ మిషన్ వ్యాప్తికి తన వంతు సహకారాన్ని అందించసాగింది.

ఘియామండి నివాసంలో ఉంటూ పరమవందనీయ మాతాజీ అనేక బాధ్యతల పూర్తిచేయసాగింది. ఆమె స్నేహం, మమత, సదాశయతలు, సహిష్ణుత మరియు శ్రమశీలతలకు ఒక ఉదాహరణగా నిలిచింది. అందరికన్నా ముందు లేచి రాత్రి అందరూ విశ్రమించిన పిదప విశ్రమించేది. ప్రాతః కాలమందు తెల్లవారుఝామున 3 గంటలకు నిద్రలేచుట నిశ్చయం కాని రాత్రి విశ్రమించెడి సమయం అనిశ్చితం. కొన్ని క్రొత్త పనులు అనగా అతిథులకు భోజనం సిద్ధం చేయుట వంటివాని వలన కూడా ఆలస్యం అవుతూ ఉండేది. ఉదయాన ప్రాతఃకాలమందు పూజ–ఉపాసనలో నిమగ్నమై, పూజా వేదికపై తన ఆరాధ్యుడైన పూజ్య గురుదేవుల చిత్తరువును, గాయత్రీమాత చిత్తరువును ప్రతిష్ఠించి ఉంచేది. పూజ–ఉపాసనల అనంతరం, ఇంటి కసువును ఊడ్చి, వంటపాత్రల శుభ్రపరచుట, కార్యాలయ పనితో ఆమె తన పనులన్నింటినీ

**అదృష్టం ఒక్కసారే తలుపు తడుతుంది - దురదృష్టం మాత్రం తలుపు తెరిచేవరకూ తడుతూనే ఉంటుంది**

పూజలా శ్రద్ధానిష్ఠలతో చేస్తూ ఉంటుంది. గృహములోని పనులనన్నింటిని భగవంతుని కర్పించి చేసినచో, అవి పూజతో సమాన ఫలితాన్నిస్తాయి అని ఆమె చెప్తూతూ ఉండేది. ఆమె తన ఆరాధ్యుని పనులలో (పూజ్య గురుదేవులు) ప్రతిదానిని అత్యంత శ్రద్ధానిష్ఠలతో సమర్పణతో చేసేది.

వచ్చేవారి సంఖ్య నిరంతరం పెరుగుతూ ఉండేది. అప్పుడప్పుడు ఈ సంఖ్య 30–40 కి చేరుకుంటూ ఉండేది. వీరందరికీ వండి వడ్డించుట పెద్ద పని. ఎట్టి స్థితిలోనైనా, ఆమె కాశీ అన్నపూర్ణలా వారందరికీ తన చేతులతో వడ్డించి తినిపించేది, ఏనాడు ఆమె కోపగించుట లేక చిఱ్ఱుబుఱ్ఱులాడుట ఎవ్వరూ చూడలేదు. ఆమె ఎల్లప్పుడు చిఱునవ్వుతో, స్నేహ భావంతో సహచరులకు పనిలో సహకరిస్తూ ఉండేది.

కొంతకాలం కార్యాలయమందు మాతాజీ ఎక్కువ సమయాన్ని అందిస్తూ ఉండేది. వచ్చిన ఉత్తరాల చదివి గురు దేవులకు వినిపిస్తూ ఉంటే ఆయన జవాబులిస్తూ ఉండేవారు. దీనితో లేఖల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అఖండజ్యోతి పత్రిక కవరుపై పోస్టు తపాలాబిళ్ళలను అంటించి పోస్టు చేయుట, పరివార జనుల స్నానపానాదుల పట్ల శ్రద్ధ వహించుట, అతిథుల పట్ల శ్రద్ధ వహించి పనిచేయుట మాతాజీ తన బాధ్యతగా నెరవేర్చేది.

తల్లి యొక్క మాతృత్వ అనుభూతి చాలా గొప్పది: పరమ వందనీయ మాతాజీ వద్దకు ఏ అఖండజ్యోతి పరిజనుడు వచ్చినా, ఆమె స్నేహమాతృత్వ చల్లని సంవేదనలను అనుభూతి చెందేవాడు. తన కన్నతల్లి వద్దకు చేరిన అనుభూతిని పొందుతాడు. చిన్న, పెద్ద, వృద్ధులు అందరూ ఆమెలో తమ కన్నతల్లిని దర్శించుట కద్దు. ఆమె అందరిపట్ల చూపించెడి మమతానురాగాలు ఎన్నడూ వసివాడవు.

ఇంటిలో, అబ్దుల్ లతీఫ్ పేరుగల ఒక ముస్లిం యువకుడు అఖండజ్యోతి పత్రిక ముద్రణా సంస్థలో ముద్రణాయంత్రంపై పని చేస్తున్నాడు. అతనిని తన కుమారుడైన మృత్యుంజయ శర్మ మరియు పుత్రిక శైలుతో సమానంగా చూస్తూ ఉండేది. అతని అన్నపానీయాలపైన, స్నానపానాదులపైన కూడా అత్యంత శ్రద్ధ వహించేది. ఒక్కొక్కసారి కొందరు మాతాజీతో అతడు ముస్లిం అయినందున అతడు తిన్న కంచాన్ని తీసి శుభ్రం చేయుట మాతాజీకి తగదని చెప్పేవారు. అప్పుడు పరమ వందనీయ మాతాజీ ఇలా సెలవిచ్చేవారు. “ఆచార వ్యవహారాలలో అంటరానితనానికి తావులేదు. మరియు మన ఆలోచనలలో పనులలో అత్యంత పవిత్రత మరియు నిర్దోషిత్వం ప్రకటితమవ్వాలి” అనేవారు. ఆమె విస్పష్టంగా ప్రకటించారు. “నేను హిందువుకు తల్లినే, ముస్లింకు తల్లినే. నాకు సతీష్ మరియు శైలు ఎలాగో, అబ్దుల్ కూడా అలాగే. “దీనితో అందరికీ అర్థమయింది”, ఆమె మానవురాలు కాదు, మనిషి రూపంలో నున్న దేవత. దీనిని గ్రహించిన అబ్దుల్లా కంటి వెంట అశ్రువులు రాగా “అమ్మా! నిజమైన అమ్మవు నీవే. నీ ప్రతిష్ఠ దేవతల కన్నా మిన్నయైనది. మీరు ఎచ్చట నిలబడెదరో అచ్చటి ధూళిని తలదాల్చుట ఉత్తమం, ఉన్నతం మరియు మోకరిల్లుట ఉత్తమం”

మధురలో లేక శాంతికుంజ్‌లోగాని ఆమె ఆత్మీయతను పొందిన పరిజనులు వారి జీవితాలలో మరపురాని మధురానుభూతిని చవిచూచినామని భావించేవారు. ఆమె చేతి వంట ఒక్కసారి రుచి చూచినవారు ఆ మాధుర్యాన్ని తమ జన్మలో మరచిపోలేరు. ఇది ప్రతిఒక్కరికి కలిగిన అనుభవమే.

ఆమె దేవమాతకు ప్రతీక. విశ్వమాతకు ప్రతీక. ఆమెయే మనందరి మాతాజీ! వందనీయ మాతా భగవతీదేవిశర్మ!!

*– యుగనిర్మాణ యోజన*
*హిందీ అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

## ఆధ్యాత్మిక చింతన అనివార్యం

*ఆధ్యాత్మిక చింతన పట్ల విముఖత ప్రదర్శిస్తూ కేవలం లోకోపకారక పనులలో మునిగితేలుతూ, తమ యొక్క సఫలతలు మరియు సద్గుణాల పట్ల మోహితులవుతూ ఉంటారు. ఇట్టివారు తమను తాము లోక సేవకులుగా చెప్పుకుంటూ ఉంటారు. ఇట్టి స్థితిలో వీరు, తాము చేసెడి పనులను జనులు ప్రశంసించాలని, చెప్పుకోవాలని అభిలషించుట పరిపాటి. కాని వీరు తమకు తెలియకుండా ఎంతోమంది జనులను తమకు శత్రువులగా తయారు చేసికొనెదరు. తత్ఫలితంగా వీరి ప్రజాసేవ, వీరిని నిజమైన ప్రజాసేవకులుగా గుర్తింపు పొందుటకు తోడ్పాటు నందించుటకు బదులుగా వీరిని లోక వినాశకారకులుగా గుర్తింపునిస్తుంది.*

*– అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**గెలిచినప్పుడు చేసెడి పొగడ్తకన్నా, ఓడినప్పుడు అందించే ఒక్క ఓదార్పు అత్యంత విలువైనది, ప్రభావశాలి**

# అఖండ అగ్ని - అఖండదీపము

ప్రాచీనకాలమందు యజ్ఞభగవానునికి వేదానుమోదిత ఉపాసన చేసెడి అగ్నిహోత్రులందరు కూడా వారి వారి అఖండ అగ్నులను స్థాపించుకొనెడివారు! మందిరాల్లో ఏ రీతిగా భగవంతుని విగ్రహాలను స్థాపించి, మూడు కాలాల్లో ఆ విగ్రహానికి పూజలు, హారతులు వగైరాలు చేస్తూ మరియు కొన్ని వేళల్లో ప్రాణప్రతిష్ఠలు చేస్తూ ఉంటారో అదే రీతిలో యజ్ఞ ఉపాసకులకై యజ్ఞశాలల రూపంలో మందిరాలందు అగ్నిరూప దేవప్రతిమల స్థాపిస్తూ దేవార్చన ప్రాతఃకాల, సాయంకాలాల్లో అగ్నిహోత్రానికి పూజలు చేసెడి విధానమున్నది.

అగ్నిహోత్రులు అఖండజ్యోతి అగ్నిని సురక్షితంగా ఉంచుతారు. ఇది ఆరిపోకుండా అగ్నిహోత్రి పరివారమంతా పూర్తి ధ్యాస వహించెదరు. ఇచ్చటి అగ్ని ఎంత పురాతనమైనదైతే, అంత దీర్ఘసాధనాపరునిగా అతనిని గుర్తించెదరు. అతని 'నిష్ఠ' కనుగుణంగా ప్రతిష్ఠ ప్రాప్తిస్తుంది.

కుటుంబంలోని అన్ని పనులు చేసుకుంటూ తల్లిదండ్రులు ఏ రీతిగా తమ కడగంటి శిశువుపై సైతం శ్రద్ధ వహిస్తూ ఉంటూ, ఆ శిశువుకు కావలసిన సంపూర్ణ రక్షణను అందిస్తూ కంటికి ఱెప్పలా చూసుకుంటూ ఉంటారో అదేవిధంగా అగ్నిహోత్రులు కూడా తన యజ్ఞాగ్నిని నిరంతరం సంరక్షిస్తూ ఒకే పద్ధతి ప్రకారం ప్రభుచింతన చేస్తూ మందిరంలో పూజారి వలె పద్ధతిగా తన మనోభూమిలో యజ్ఞభగవానుడిని ప్రతిష్ఠించు కొనెదరు. నిరంతరం నియమితరూపంలో ఉపాసన చేస్తూ తద్వారా తమలో సూక్ష్మ ఆధ్యాత్మిక విశేషతలను దినదిన ప్రవర్ధమానం చేసుకుంటూ ఉంటారు. యవ్వనంలో నున్న బాలిక పుష్టికరమైన ఆహారాన్ని సేవిస్తూ వికసితమవుతూ బలమైన పరిపుష్టి యువతిగా రూపుదాల్చుతుంది. ఈ రీతిగా యజ్ఞకుండంలో ప్రజ్వరిల్లుచున్న అగ్ని కూడా నిత్యము నెయ్యి, మృష్టాన్నం, హవిస్సులు మున్నగువానిని గూడి శ్రేష్ఠతరమైన ఔషధుల ఆరగిస్తూ ప్రచండశక్తిసంపన్న రూపాన్ని ధరించి, భవాని ఆకారాన్ని తలపింపజేస్తూ ఉంటుంది. ఈ అగ్ని ప్రభావంతో అనేకానేక అనిష్ట రోగాలు నశించిపోతాయి.

ఏ రీతిగా బంగారము, వెండి, వజ్రము, మణి మున్నగు వాని భస్మం అనేక రోగాలు నశింపజేస్తుందో; అదే రీతిలో యజ్ఞభస్మము కూడా గొప్ప విశిష్టమైన ఔషధులతో కూడినదై శక్తివంతమైవుంటుంది. దీని ఫలితంగా ఎన్నో శారీరక రుగ్మతలు దూరమౌతాయి. అట్లే మనోరోగాలనూ ఇది దూరం చేస్తుంది

చిన్న బాలలు మరియు వయస్సు పైబడిన పురుషుల మధ్య ఉన్న తేడా ఇట్టిదే. ఈ తేడాయే వెంటనే ఉత్పన్నమై నిరంతరం వెలిగే అగ్నిలో కూడా ఉంటుంది. వయోవృద్ధుల కిచ్చిన దానమంతగా పిన్నలకిచ్చిన దానము ఫలప్రదం కాదు. ఏలనన పిన్నల కన్నా, వయోవృద్ధులు తమ కందిన దానాన్ని సద్వినియోగం గావించెడి బాధ్యతను తీసికొనెదరు. దాన మందించెడి దాతలకు అధికతర ఉపకారాన్ని చేయుటలో సమర్థులుగా ఉంటారు. ఈ కారణం వలన సాధారణ అగ్నిహోత్రి ప్రతినిత్యము తనను సంరక్షించెడివారిని సంరక్షిస్తూ సమర్థులనుగా చేస్తుంది.

నేడు జనులు సోమరితనము మరియు అశ్రద్ధల కారణంగా అఖండఅగ్ని యొక్క విశిష్టతను మహత్యాన్ని మరచిపోయారు. ఫాస్పరస్, గంధకం మున్నగు దుర్గంధిత అశుద్ధ పదార్థాలతో కూడిన వానితో రగిల్చిన అగ్నితో హవనాన్ని చేస్తున్నారు. ప్రాచీన కాలములో యజ్ఞ ప్రేమికులు అరణిని మథించుట ద్వారా మరియు సూర్యకాంతమణి మున్నగువాని సహాయంతో అగ్నిని రగిల్చెడివారు. అఖండఅగ్నికై ఉపాసన చేయుట సనాతన ధర్మమును పాటించుటయే. ఇది అవసరము. ఆర్య సమాజ వ్యవస్థాపకులైన మహర్షి స్వామిదయానంద సరస్వతి మహనీయుడు దీనిని గౌరవించాడు, అనుసరించాడు. ఆయన శాహపూర్ నరేష్‌గారికి ప్రేరణనిచ్చి వారిచే అఖండఅగ్నిని స్థాపితం చేశారు. అది నేటికీ విధివిధానంతో పూజింపపడుతూ ఉంది. దేశంలో ఇప్పుడు అఖండాగ్నిహోత్రులు ఎచ్చట లేరు. కాని కొందరు నిష్ఠాగరిష్టులు దీనిని విధిపూర్వకంగా పరిరక్షిస్తున్నారు. వీని సంఖ్య వ్రేళ్ళతో లెక్కింపవచ్చును. గాయత్రి తపోభూమిలోని అఖండాగ్ని గత 62 సంవత్సరాల నుండి నిరాటంకముగా సురక్షితంగా సంరక్షింపబడుచున్నది.

**సంతోషాన్ని వెతికేవారు సంతోషాన్ని పొందజాలరు**

అగ్నికి ప్రతిరూపం – అఖండదీపం యొక్క మహత్యం అసాధారణమైనది. శుద్ధమైన నేతితో అఖండదీపాన్ని వెలిగించి కాపాడుట, ఒకవిధంగా నేతితో యజ్ఞము నిరంతరం మీరు చేస్తున్నట్లుగా భావించవచ్చు. అట్టి దీపం ఏ స్థానంలో ప్రకాశిస్తూ ఉంటుందో, దాని సమీపంలో కూర్చొన్నచో ఉపాసన యొక్క విశేష ఫలితాన్ని పొంద వీలున్నది. అట్లే సామాన్య అనుష్ఠానాలు చేసెడి సమయంలో నేతితో దీపాన్ని వెలిగించి ఉంచుతారు. విశేష అనుష్ఠాన సమయంలో నేతితో దీపాన్ని అఖండంగా వెలిగించి ప్రతిష్ఠ చేస్తారు. ఒకవిధంగా ఇది అఖండాగ్ని. ఇది కేవలం హవనం చేసెడి సమయమందే ప్రజ్వలింపబడుతుంది. కాని దీపమనెడి నిరంతర ప్రకాశంతో అచ్చటి వాతావరణాన్ని దివ్య ప్రకాశంతో నింపుతూ ఉంటుంది. అగ్నిలో రెండుసార్లు హవనం జరుగుతుంది. కాని దీపం ద్వారా అహర్నిశలు (ఎల్లప్పుడు) హవనం జరుగుతూ ఉంటుంది. అగ్ని యొక్క అఖండతలో ఇబ్బందులు, ఖర్చు మరియు సంరక్షణ, అలంకరణ వగైరాలు తక్కువ. దీపాన్ని అఖండంగా ఉంచుటకై పై ఖర్చులు, ఇబ్బందులు అధికంగా ఉంటాయి. దీనితోపాటు దీనివలన లభించెడి ఫలితాలు కూడా తగిన విధంగానే ఉంటాయి.

ప్రసూతి సమయమందు గృహాల్లో అనిష్టకరము, శంకల నివృత్తిని 10 దినాలు అఖండఅగ్నిని ఉంచి నివారించవచ్చును. అట్లే మరణం సంభవించిన స్థలాల్లో అఖండదీపాన్ని వెలిగించి ఉంచినచో మృతశరీరం నుండి వెలువడిన అంటువ్యాధి కారకాలు మరియు కీటకాలు, కీటాణువులు, మానసిక వేదన, బాధలు, కలతజెందుట, జాలి, మోహము, శోకము మున్నగు వానిని తొలగించుకొనుటలో అఖండదీపము ఎంతో సహకారిగా నిలుస్తుంది. మరణం సంభవించిన స్థానాన్ని శుద్ధపరచుటకు ఇంతకు మించిన మార్గము లేదు. ఈ రీతిగా పరిశుద్ధముగాని స్థలములందు భూత బాధలు, దుస్వప్నాలు, ఉన్మాదం, అపస్మారకం మున్నగు శారీరక, మానసిక బాధలు అనుభవం లోనికి రావచ్చు. పితృశాంతి కర్మలు చేయువేళ దీపమును తప్పక ఉంచెదరు. సత్కార్యాల యందు దీపం వెలిగించి ఉంచుట తప్పనిసరి. గంగా, గోదావరి మున్నగు పుణ్య నదీ తీరాలందు చేసెడి క్రతువులందు దీపం వెలిగించి ఉంచెదరు. దీపావళి అనగా దీపాల పండుగే. వ్యాపకం ద్వారా అఖండ దీపాల పండుగను గౌరవిస్తూ దరిద్రదేవత శక్తిని తొలగించి, లక్ష్మీదేవతా శక్తిని పెంపొందింపజేయుట పరిపాటి. ఈ సద్ లక్ష్యాలను క్రొవ్వొత్తులు లేక విద్యుత్ కాంతులతో సాధింప జాలము. పార్శీ జాతి ప్రజలు అఖండఅగ్ని గొప్పతనాన్ని విశిష్టతను సంపూర్ణంగా అర్థం చేసికొన్నారు. వారి ధర్మంలో అనగా వారి జీవన విధానంలో అఖండఅగ్నిని ఒక దేవతలా అత్యంత భక్తి ప్రపత్తులతో ఆరాధిస్తూ సముచిత స్థానాన్ని ఇచ్చారు.

అఖండఅగ్ని మరియు అఖండదీపం యొక్క లాభాలు అపరిమితం. అందరూ దీనిని అనుభవంలోనికి తెచ్చుకోవచ్చు. 700 సంవత్సరాలు నాటి హిమాలయాలలోని అఖండఅగ్నిని పూజ్యగురుదేవులు తెచ్చి తపోభూమిలో స్థాపించారు. ఆనాటి నుండి ఎడతెరిపి లేకుండా అనునిత్యము యజ్ఞము చేయబడుచున్నది. అట్లే ఇదే అగ్ని శాంతికుంజ్‌కు తీసికొని పోబడి గత 90 సంవత్సరాల నుండి సంరక్షింపబడుచున్నది. ఇది గురుదేవుల చేత ప్రజ్వలింపబడింది. ఈ కారణం చేతనే గాయత్రీ తపోభూమి– శాంతికుంజ్ మున్నగు స్థలాలు దైవీ శక్తుల సిద్ధపీఠాలుగా మారాయి.

*– యుగనిర్మాణ యోజన జూన్, 2015*
*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

## తపస్సు

*తపస్సు అపారమైన శక్తి కలది. ఈ విశ్వంలో అధిక శక్తి సంపన్నమైన తత్త్వం తపస్సు నుంచే ఉద్భవిస్తుంది. సూర్యుడు అనునిత్యం తపిస్తూ, తద్వారా ఉద్భవించిన శక్తితో విశ్వానికి ప్రాణదాతగా నిలిచాడు. గ్రీష్మతాపానికి వాయు మండలం తపించుటచే వర్షం కురుస్తున్నది. బంగారం తపించడం వల్ల తేజస్సు విలువను సంతరించుకొంటున్నది. సున్నపురాయి, నత్తగుల్లలు తపించుటచే సున్నంగా మారి భవన నిర్మాణానికి ఉపయోగపడుతున్నాయి.*

*ప్రకృతి తపించుటచే సృష్టి సంచాలన వ్యవస్థ నడుచు చున్నది. జీవుడు తపనతో అంతఃకరణలోని పురుషార్థం పరాక్రమం, సాహసం, ఉల్లాసం, జ్ఞానం, విజ్ఞానం అనే అమూల్యరత్న సంపద వెలికివచ్చి మానవుడు దేవ మానవుడుగా మారుచున్నాడు.*

*– అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*


**అందరు మిమ్మల్ని వదిలే సమయంలో మిమ్ముల చేరుకొనేవారే మీ నిజమైన మిత్రులు**

పూజ్య గురుదేవుల అమృతవాణి

# ఆధ్యాత్మిక ఔన్నత్యమునకు సోపానాలు యోగము మరియు తపస్సు - 1

*పరమపూజ్య గురుదేవుల వ్యక్తిత్వములో ఉన్న విభిన్న ఆయామములను సమగ్రముగా పరిశీలించటానికి బహుశః శతాబ్దములు కూడా సరిపోవేమో! ఒక వక్తగా గురువర్యులు వివిధ విషయములపై తమ ఆలోచనలను ప్రకటీకృతము చేశారు. వారి ప్రతి ప్రవచనమూ కూడా స్వయముగా ఒక పరిశోధనాగ్రంథము కాగలదు. ఆ వరుసలో నుండే స్వీకరించబడిన ప్రస్తుత ప్రవచనములో పరమపూజ్య గురుదేవులు 'యోగము-తపస్సు' అనే రెండింటినీ ఆధ్యాత్మిక ఉన్నతికి రెండు సోపానములుగా ధృవీకరిస్తున్నారు. 'పూజ-ఉపాసన ప్రారంభించటానికన్నా ముందు ఆస్తికతను సరిగ్గా అర్థము చేసుకొనుట ఎంతో అవసరము. ఆస్తికత అంటే మాలను త్రిప్పుతూ జపము చెయ్యటము మాత్రమే కాక; ఒక తోటమాలి తన తోటను ఎంత అందముగా తీర్చిదిద్దుకుంటాడో ఆవిధముగా తన వ్యక్తిత్వమును ఔన్నత్యపరచుకోవాలి. ఈ పనిలో యోగమూ-తపస్సూ అనే రెండు క్రియలూ కూడా ఆధ్యాత్మికత అనే తోటకు ఎరువు-నీరు వలె పనిచేస్తాయి' అని తెలియజేస్తున్నారు. రండి! వారి అమృతవాణిని మరింతగా హృదయంగమము చేసుకుందాము!*

### ఆధ్యాత్మిక జీవితములో పూజ - ఉపాసన



ఈ రెండింటికీ ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. సాధారణ వ్యక్తులు మొదలుకొని సిద్ధులు, మహాత్ములు, సాధుసత్పురుషులు, ఋషులు మొదలైనవారందరూ దీన్ని తమ జీవితంలో అనివార్యమైన అంగముగా తయారుచేసుకుని ఆత్మోన్నతి దిశగా ముమ్మందుకు సాగటములో సఫలీకృతులైనారు. మీకు పూజ అంటే ఏదో హాస్యముగా, ఎగతాళిగా ఉంటుంది. మేము స్వయముగా పూజ-పారాయణ చేశాము. లక్షల మందిని అందులో నియోగించాము. 24 సంవత్సరముల పాటు నిత్యము నియమముగా పూజ-ఉపాసనలో గడిపాము. ఇప్పుడు కూడా మా జీవితము అదే రీతిలో సాగుతున్నది. మేము ప్రతిరోజు రాత్రి రెండు గంటలకే నిద్ర నుండి మేల్కొంటాము. ప్రపంచమంతా చలికి వణుకుతూ ముసుగుతన్ని విశ్రాంతి తీసుకునే వేళ మేము మా పూజ ప్రారంభిస్తాము. రాత్రి రెండుగంటల నుండి దాదాపు 5 గంటలయ్యే వరకు పూజలోనే గడుపుతుంటాము.

పూజ-ఉపాసన వ్యర్థమైనవైతే మేము ఎందుకు అందులో నిమగ్నమౌతాము? మేము లక్షలమందికి గాయత్రీమంత్ర దీక్షనిచ్చి పూజ-ఉపాసనలో నిమగ్నులను కావించాము. మీకు అందులో నమ్మకము తగ్గుతుందేమోనన్న భయము మాకు ఉన్నది. అందు చేతనే మీరు పూజలు చెయ్యదలచుకుంటే విధివిధానంతో నియమపూర్వకముగా క్రమము తప్పకుండా చెయ్యండని మీకు పదే పదే చెప్తున్నాము.

ఇలా చెయ్యటము వలన మీరు నాస్తికులు అయ్యే ప్రమాదము నుండి రక్షించబడతారు. ఉపాసన చెయ్యటము వలన 'ఫలానా లాభములు కలుగుతాయి' అని మేము మీకు చెప్పిన లాభములు తప్పక లభించితీరుతాయి. అలా జరగక పోతే మీరు కమ్యూనిష్టుల వలె నాస్తికులైపోతారు. భగవంతుడు ఉన్నాడా? లేడా? ఆయనను పూజించడము వలన మేలు కలుగుతుందా? లేదా? అన్న విశ్వాసము వాళ్ళకు లేదు. ఎవరైనా వాళ్ళకు అలాంటి విశ్వాసమును కలుగజెయ్యగల్గితే కనుక వాళ్ళు మీకన్నా ఎక్కువ శ్రద్ధావంతులు కాగలరు. ఎందుకంటే వాళ్ళు తాము నమ్మిన సిద్ధాంతము పట్ల ఎక్కువ నిజాయితీగా ఉంటారు. ఒకవిధముగా చెప్పాలంటే మీరే నాస్తికులు. ఎందుకంటే మీరు భగవంతుడి సిద్ధాంతములను, నియమాలను, విధివిధానములను ఒకపట్టాన అంగీకరించరు. మీకోసము ప్రపంచములోని నీతినియమములన్నీ మార్చి

**ముసలితనం ఒక్కటే మనకు శ్రమలేకుండా లభిస్తుంది**

వేయబడాలనీ, ప్రతీదీ సునాయాసముగా తక్కువ కష్టముతో మీ చేతికి చిక్కాలనీ, స్వల్పమైన వెలకే నాణ్యమైన వస్తువులు మీ స్వంతం కావాలనీ కోరుకుంటారు మీరు.

### ఆస్తికత - నాస్తికత ఈ రెండింటికీ అర్థమును తెలుసుకోండి

తక్కువ వెల అంటే భజన చెయ్యడము. ఇందులో మీరు ఏమాత్రమూ చెమట చిందించవలసిన పనిలేదు. నాగలి పట్ట నవసరము లేదు. గొడ్డలి ఎత్తనక్కరలేదు. ఎండలో నిలబడి కష్టపడవలసిన పనిలేదు. మీరు చెయ్యవల్సిన పనల్లా పద్మాసనము వేసుకుని కూర్చుని జపమాలను త్రిప్పటమే. ఇంత తక్కువ శ్రమతో మీరు ఏమేమి కోరుకుంటున్నారు? ధనము కావాలి, కొడుకులు, కూతుళ్లు కావాలి, ఉద్యోగములో పదోన్నతి కావాలి. స్వర్గమూ–శాంతీ లభించాలి. ఇవన్నీ మీ కోరికలు. అందుకోసమై దేవతలను మీ బానిసలుగా చేసుకోవాలని చూస్తున్నారు. ఇంకా ఏవేవో కోరుకుంటున్నారు మీరు. మీకన్నా కమ్యూనిష్టులు నయము. 'కష్టపడితేనే దేనినైనా పొందగలము. లేకుంటే దేనినీ పొందలేము' అన్న సత్యమును నమ్ముతారు వాళ్ళు. అందుచేత వాళ్ళు కాదు, మీరే నాస్తికులు. కాబట్టి ఆస్తికత నుండి మీరు ఏమైనా లాభపడాలనుకుంటే దాని లోతుల లోపలికి వెళ్ళాలి. పొలము మీదనో, తోట మీదనో లాభములు పొందాలనుకుంటే ముందర మీకు వ్యవసాయము చెయ్యడమో; తోటపని చెయ్యడమో వచ్చితీరాలి. ఎండా, వానా, బురదా అని చూడకుండా 24 గంటలూ ప్రకృతితో ఏకమై పనిలో లీనము కాగలగాలి. మంచిపంట కోసుకోవాలనుకుంటే రాత్రివేళ నిద్ర త్యాగము చేసి పొలమునకు కాపలా కాయాలి. నిర్ణీత సమయమునకు మొక్కలకు నీళ్ళు పొయ్యాలి. మీకు పంట కావాలికానీ కష్టపడే తత్త్వము మాత్రము మీకు లేదు.

### యోగము-తపస్సు ఆధ్యాత్మికత అనే తోటకు 'ఎరువు-నీరు' వంటివి

ఆధ్యాత్మికత కూడా ఒక తోట లాంటిది, ఒక పంట వంటిది. ఇందులో రామనామ మనే విత్తనము నాటడముతో పని ప్రారంభమౌతుంది. మరి మీరు విత్తనము నాటకుండా పంటకోసుకోవాలని ఎలా అనుకుంటారు? విత్తనాలు నాటకుండా తోట ఎలా పెంచగలరు? విత్తనము నాటడమనే పని వరకూ మీరు చెయ్యగలరు. కానీ మన ఉపాసనను సార్థక్యవంతము చెయ్యగల్గిన క్రియలు మరింత విలువైనవి. మీకు జపము, పూజ చెయ్యటము వరకూ నేర్పించాము. ఇప్పుడు ఆధ్యాత్మికత అనే తోటకు యోగము–తపస్సు అనబడే ఎరువు ఎలా వెయ్యాలో నేర్పించటానికే మిమ్మల్ని ఇక్కడకు పిలిపించాము.

ఇప్పటివరకూ మీకు జ్ఞానమునకు సంబంధించిన నాలుగు ధారలను తెలియజేశాము. వాటిని అర్థము చేసుకొనడము ద్వారా మీ బుద్ధి సరియైన మార్గములో నడుస్తుంది. మీ ఆలోచనా విధానము చక్కబడుతుంది. ఎప్పుడైతే మీ ఆలోచనా విధానము చక్కబడుతుందో అప్పుడు ప్రపంచము సుఖ సంతోషములతో తులతూగుతూ మీకు ఆనందమును పంచుతుంది. అలా కాక మీ ఆలోచనావిధానము తప్పుగా ఉంటే ప్రపంచము మహాభయంకరముగా, ప్రమాదభరితముగా కనిపించడమేగాక ఎక్కడచూసినా వికృతులే దర్శనమిస్తుంటాయి. ఐతే వాస్తవానికి ఈ ప్రపంచము మీకు కనిపించినంత ప్రమాద కరమైనదేమీ కాదు. అది కేవలము మీరు చిత్తభ్రమకు లోను కావటము వల్లనే జరుగుతుంది. మీ బుద్ధియే ప్రమాదకారిగా మారి మిమ్మల్ని భయభ్రాంతులకు గురిచేస్తూ మీ ముందు కొస్తుంది.

ఈ సందర్భముగా మాకొక సంఘటన గుర్తుకొస్తున్నది. ఇంగ్లండ్‌లో మొట్టమొదటిసారిగా రైలుబండి నడపబడింది. విక్టోరియా మహారాణిని ప్రప్రథమముగా ఆ క్రొత్త రైలులో ప్రయాణింపజెయ్యాలని ఆ దేశ అధికారులు నిర్ణయించారు. సరే రాణి రైలు ఎక్కింది. ఆవిడ రక్షణకై బాడీగార్డ్స్, రైలు రక్షణకై సైన్యము కూడా ఎక్కి కూర్చున్నారు. ఎక్కడా ఎలాంటి ఆపదా రాకుండా అత్యధిక జాగ్రత్తలు తీసుకున్నారు.

రాత్రయ్యింది. రైలు నడుస్తూనే ఉన్నది. అకస్మాత్తుగా రైలు బండితో పాటే రహదారి మధ్యన ఒక ఏనుగు నడవటము కనిపించినది. డ్రైవర్ హారన్ మ్రోగించాడు. కానీ ఫలితము లేదు. ఏనుగు రహదారి గట్టు అంచున నడుస్తున్నది కానీ; అకస్మాత్తుగా కొంచెము ముందుకొచ్చి రైలుబండిని ఢీకొడితే బండి తల్లక్రిందులయ్యే ప్రమాదముంది. డ్రైవర్ ఆందోళన చెందసాగాడు. బాడీగార్డ్ ఇంజన్ దగ్గరకు వచ్చి నిలబడ్డాడు. టెలిస్కోప్ అమర్చాడు. ఏనుగు కదలికలను బట్టి గమనిస్తే

**విజయం మిమ్మల్ని ప్రపంచానికి పరిచయం చేస్తే అపజయం మీకు ప్రపంచాన్ని పరిచయం చేస్తుంది**

దాని తోకా, తొండమూ కూడా పెద్దవిగానే అనిపించాయి. ప్రమాదకారియైన ఆ జంతువును ఎలాగైనా వదిలించుకోవాలని సైన్యవిభాగ రక్షకుడు స్టెన్‌గన్ తీసి సిద్ధము చేసి దానితో తూటాలను వదిలాడు. ఏనుగు ఇసుమంతైనా కదలలేదు, మెదలలేదు. ఇప్పుడేమి చెయ్యాలి? రైలుబండి ఆగితే ఏనుగు ఆగుతున్నది. బండి కదిలితే అది కూడా కదులుతున్నది. అప్పుడు సైనికులు 'ఇది కాదు పని. మనము వేరొకవిధముగా ప్రయత్నిద్దాము. ఏనుగు రైలుబండితో పాటే కదా కదులు తున్నది. అందుచేత మనము దాని దగ్గరగా వెళ్ళి ఒక్కసారిగా తూటాలు పేల్చేద్దాము' అనుకొని నేలమీద పడుకొని, నెమ్మదినెమ్మదిగా పాకుతు దానివరకూ చేరుకుని సన్నద్ధముగా నిలబడ్డారు. ఇక తూటాలు పేలుద్దాము అని చూస్తే ఏనుగు మాయమైంది.

అరే ఏమిటిది? ఇదేమన్నా భూతమా? మాయా? అని అందరూ ఆశ్చర్యపోయారు. మళ్ళీ రైలుబండిలోకి ఎక్కి బండినంతా క్షుణ్ణముగా పరిశీలించి చూడగా ఆ భూతము కళ ఏమిటో అర్థమైనది. బండి లోపల ఒక దీపమున్నది. అద్దము మీద ఒక మిడత కూర్చునున్నది. మిడత యొక్క నీడ దీపపుకాంతితో కలిసి రహదారి మీద ప్రసరించినప్పుడు అది ఒక ఏనుగు లాగా రూపము దాల్చి భ్రాంతి కలిగించినది. అయ్యో! ఇంతా చేస్తే ఇది మిడతా? ఎంత భయభ్రాంతులను చేసింది అని అందరూ తేలికగా ఊపిరి పీల్చుకున్నారు. దీపంబుడ్డి మీద అతుక్కొని ఉన్న ఆ మిడతను పట్టుకున్నారు.

ఇప్పటికీ దానిని ఇంగ్లండ్‌లోని శాహీవస్తుప్రదర్శనశాలలో చూడవచ్చు. ఆ మిడతను షోకేస్‌లో ఒక చెక్కముక్కకు వ్రేలాడ దీసి దాని క్రింద 'ఏనుగు లాగా భ్రాంతి కలిగించి, రాణి బండిని నాలుగుగంటలపాటు ఆలస్యము చెయ్యటమే కాదు; 400 రౌండ్ల తుపాకీగుండ్లను పేల్చేటట్టు చేసిన మిడత ఇదే' అని వ్రాశారు.

### మనకు జీవితములో కష్టములు ఎటువంటివి?

అసలు మీకు జీవితములో ఎదురౌతున్న కష్టము లేమిటి? మిమ్మల్ని విసిగించి బాధపెడుతున్నది అదిగో పైన చెప్పిన మిడత లాంటి భ్రమయే! పేదరికమా? అది ఎలాంటిది? భోజనము చేస్తున్నాము, వస్త్రములు ధరిస్తున్నాము. చాలు. ఇంకేమి కావాలి? సికిందర్ ఎంతో ఆస్తినీ, సంపదనూ ప్రోగుచేసుకున్నాడు. కానీ అతను చనిపోయేటప్పుడు ఏమి తీసుకుపోగలిగాడు? మరణసమయములో 'అయ్యో! ఇంత సంపదనూ ఇలా వదిలివేసి వెళ్ళాలని తెలిస్తే నేను కూడా సుకరాతులాగానో, బుద్ధునిలాగానో ధ్యానము చేసి జ్ఞానమును సముపార్జించుకునేవాడినికదా!' అని విలపించాడట.

మీరు సంపాదించిన డబ్బుతో ఏమి చెయ్యగలరు? రెండు రొట్టెలను తినగలరు, వస్త్రములను ధరించగలరు. అంతకు మించి ఏమీ చెయ్యలేరు. మిగిలిన ధనమంతా మనవళ్ళు, మనవరాళ్ళకూ లేదా ప్రభుత్వమునకూ వెళ్ళిపోతుంది. ఈ విషయమును తెలుసుకుంటే మన జీవనశైలి వేరొకవిధముగా ఉంటుంది. లోభి వలె, పిసినారి వలె జీవితమును గడపము.

మీ బుద్ధి సక్రమముగా ఉంటే అన్నీ బాగుంటాయి అనే విషయమును మీకు అర్థమయ్యేలా చెప్పాలనేదే మా ప్రయత్నము. మనకు భగవంతుడు మంచి తెలివినిచ్చాడు. బి.ఎ.లో, ఎమ్మే.లో ఉత్తీర్ణులమయ్యాం. పెద్ద పెద్ద అధికారుల మయ్యాం. కానీ జీవిత గమ్యమును తెలుసుకోలేకపోతున్నాము. మనకు తారసిల్లిన వ్యక్తులను శత్రువుల వలె చూస్తాము. కానీ కొంచెము తెలివిగా ప్రవర్తిస్తే వాళ్ళు ఎంత చక్కటి మిత్రులు అవుతారో ఆలోచించలేము.

మనకు లభించిన వస్తువులను వ్యర్థమైనవిగా భావించకుండా వాటిని సరైన రీతిలో ఉపయోగించుకొనగల్గితే జీవితములో ఎంతటి ఆనందము లభిస్తుందో తెలుసుకునే ప్రయత్నము చెయ్యాలి. మనకు లభించిన ఈ శరీరమును సరిగ్గా ఉపయోగించుకొనడము మనకు రాదు. దాన్ని ధ్వంసము చేసి చిత్తుచిత్తుగా నాశనము చేసిపారేశాము. మళ్ళీ మనకు మరింత ఆయుర్దాయమును ప్రసాదించమని భగవంతుడిని వేడుకుంటాము. ఎందుకు మరింత ఆయుర్దాయము? భగవంతుడు మీకు ఎంత గొప్ప బుద్ధిని ప్రసాదించాడు? దానిని మీరు సరిగ్గా వినియోగించుకుంటున్నారా? మీరు, మీ కుటుంబ సభ్యులు దానివలన లాభము పొందగలిగితే వినోభాగారి తల్లి వలె మీరు కూడా మీ సంతానమును అమరులనుగా చెయ్యగలరు. మనకు లభించినదాన్ని మనము చక్కగా వినియోగించుకుంటే ఆనందము కలుగుతుంది. జీవితములో సంతోషము వెల్లివిరుస్తుంది. శాంతి లభిస్తుంది. తద్వారా ఈ జన్మలోనే మనము మహాపురుషులము కాగలము.

– *అఖండజ్యోతి, జనవరి 2015*
*అనువాదము: శ్రీమతి కృష్ణకుమారి*

**కన్ను తెరిస్తే ఊయల! కన్ను మూస్తే మోయాలి**

నావారితో నా మాట

# అత్యాధునిక విజ్ఞానమే జ్యోతిర్విద్య



## ప్రకాశమునకు మరొకపేరే జ్యోతిషము

జ్యోతిషము అంటే ప్రకాశమునకు మారుపేరు. ప్రకాశమునకు మూలస్రోతమైన ప్రాచీనకాలము నాటి ఆ మహత్తర విజ్ఞానము కాలాంతరములో చీకటితో క్రమ్మివేయబడి అవహేళనకు గురైంది. కొందరు దీనిని ప్రారబ్ధంతోను, అదృష్టముతోను ముడిపెడితే, మరికొందరు సోమరితనంతో, పనికి రానివాటితో ముడిపెట్టారు. కొందరు దీనిని పూజిస్తే, మరికొందరు ఈ గ్రహ నక్షత్రాల భయమును చూపించి నిలువరించే ప్రయత్నాలు చేస్తున్నారు. అటువంటి వారిది తెలివైన అమాయకత్వం అని అనుకోవాలి. అనేకమంది చూపించే చాతుర్యానికి ఇందులో దాగి ఉన్న వైజ్ఞానికత లోపించింది. ఈ మహావిద్యను సమర్థించేవారు, విమర్శకులు ఇద్దరూ తమకు ఉండవలసిన వైజ్ఞానిక మానసికస్థితిని కోల్పోయారు. ఐన్‌స్టీన్ అను శాస్త్రవేత్త "ఐడియాస్ ఎండ్ ఒపీనియన్స్"లో ఇలా చెప్పాడు– 'ఎవరు ఈ ఉపకరణాలను, విధివిధానాలను ప్రయోగించడము నేర్చుకున్నారో వారు నిజమైన వైజ్ఞానికులు. అయితే నేను వారిని వైజ్ఞానికులు అని ఒప్పుకోను, వైజ్ఞానిక–మానసికస్థితి ఉన్నవారి గురించి మాట్లాడుతున్నాను". ఇందులో ఐన్‌స్టీన్ వైజ్ఞానిక మానసికస్థితి గురించే నొక్కి వక్కాణించాడు.

లండన్‌లో ప్రచురించబడిన 'సైన్స్ ఇన్ హిస్టరీ' లో జె.డి. బర్నార్ వైజ్ఞానిక మానసికస్థితి యొక్క సారాంశాన్ని వివరిస్తూ 'అడగడానికి వీలుపడే సామాన్యమైన ప్రశ్నలకు సమాధానాలు సామాజికవికాసపు ఏ దశలోనైనా ఇవ్వడం కుదురుతుంది. ఐతే వాటి సమాధానాలను వివరించేందుకు, పరీక్షించేందుకు, అనుసంధానించేందుకు చేసే ప్రయోగాలు కొంచెం మానసికమైన, కొంచెం శారీరికమైన పనుల ద్వారానే సాధ్యపడతాయి. ఈ కార్యపద్ధతుల సముచ్చయమే వైజ్ఞానికపద్ధతి'. ఇవిమాత్రమే కాక ఉపయోగపడే సమాధానాలివ్వగలిగే ప్రశ్నలన్నీ ఎక్కువ గణితము, భౌతికము, ఖగోళశాస్త్రములలోనే ఉంటాయి. **ఖగోళానికి చెందిన అధ్యయనం మరియు విజ్ఞానమే జ్యోతిర్విజ్ఞానము. విజ్ఞానమును గ్రుడ్డినమ్మకమని చెప్పడం కూడా ఒకరకమైన గ్రుడ్డినమ్మకమే.** జ్యోతిషశాస్త్రం అనేకమైన భవిష్యవాణులు చెప్తుంది. అవి తప్పు కావచ్చు, ఒప్పు కావచ్చు. సంయోగ వశాత్తూ ఒక్కొక్కసారి అనుకున్నవి జరుగుతాయి. అవి జరగకపోతే కనుక మొత్తం విజ్ఞానమునే అంధ విశ్వాసమని అనేస్తారు. చాలా మంది వైద్యులు సరైన వైద్యం చెయ్యలేరు. అయినప్పటికీ ఆ వైద్యవిద్యను గ్రుడ్డినమ్మకం అనరు. **జ్యోతిర్విజ్ఞానం అంటే కేవలం భవిష్యవాణి మాత్రమే కాదు. భవిష్యవాణికి సంబంధించిన 'ఫలిత భాగము' కూడా. ఈ స్వల్పవిజ్ఞానం ఇందులోని అతి చిన్న భాగం అనేది ఖచ్చితమైన అంశం.**

జ్యోతిర్విజ్ఞాన ఫలిత భాగానికి చెందిన విషయానికొస్తే ఇది ప్రకృతి యొక్క కార్య–కారణములు అనే ఒక సంక్లిష్టమైన విశ్లేషణా విధానము. దీనిని ప్రకృతి యొక్క కర్మఫలవిధానము అని కానీ, కర్మసిద్ధాంతము యొక్క వైజ్ఞానిక వివేచన అని కూడా అర్థం చేసుకోవాలి. జీవితము వర్తమానమైతే అందులో ఎన్నోరకాల పరిస్థితులు ఉంటాయి. అప్పుడు వర్తమానములోని ఈ కార్యమునకు గడిచిన కాలంలోని కారణాలు కూడా ఉండే ఉంటాయి. **జ్యోతిశ్శాస్త్రం ఈ కార్య–కారణముల మధ్య ఉండే సంబంధమును సరిగ్గా తర్కపూరిత వివేచనతో మన ముందు ఉంచుతుంది.** కొంతమంది భవిష్యత్తును గురించి తెలుసుకోవడం కుదరదు అంటారు. బ్రహ్మాండీయ విజ్ఞానవేత్త స్టీఫెన్‌హాకింగ్స్ భవిష్యత్తును అజ్ఞాతవిషయమని ఎన్నడూ అనుకోలేదు. కొన్ని సంవత్సరాల క్రితం ఆయన సమయాన్ని దాటిపోగలిగే విమానాన్ని తయారు చేయగలమా? అని అడిగాడు. విపరీతమైన వేగమున్న విమానం సమయమును దాటి ముందుకు దూసుకుపోగలిగితే మనము భవిష్యత్తులోకి చేరుకోలేమా? వైజ్ఞానికుల ప్రశ్నలను, ప్రయత్నాలను గ్రుడ్డి నమ్మకాలని కొట్టిపారవేయలేము. హాకింగ్స్ కొద్ది నెలల క్రితం ఒక ఆసక్తికరమైన విషయాన్ని లేవదీశాడు. అదేమంటే

ఏ వ్యక్తి జన్మతః గొప్పవాడు కాడు - అతని పనులతోనే గొప్పవాడవుతాడు

బ్రహ్మాండమంతా ఎటువంటి ఆధారమూ లేకుండా ఎలా వ్రేలాడుతున్నది? ఈ ఆసక్తికర అంశంపై కొంత పని జరగాలి.

**ఋగ్వేదఋషులు వేల సంవత్సరాల క్రిందట సూర్యుడు దేని ఆధారంగా వ్రేలాడుతున్నాడు అని ప్రశ్నించారు.** మనకు తెలియదు, తెలుసుకోవాలనుకోవడం లేదు కూడా! వైదిక ఋషులు సూర్యుడు, చంద్రుడు, కుజుడు, బుధుడు, గురువు మొదలైన గ్రహాల మీద దృష్టిసారించారు. సౌరమండలానికి చెందిన గ్రహం మన పృథ్వి. అంతరిక్షం యొక్క ప్రభావం భూమి మీద పడుతుంది. మన పూర్వీకులు వైదికపరమైనవారు, యజ్ఞప్రియులు మరియు ఉత్సవప్రియులు కూడాను! వారు ప్రకృతి సహజమైన ఆపదలను దృష్టిలో ఉంచుకొని గ్రహ నక్షత్రాల గతివిధుల మీద దృష్టిని సారించి జ్యోతిర్విజ్ఞానమును అభివృద్ధి చేశారు. శిక్ష, కల్పం (సమయం), వ్యాకరణం, నిరుక్తం, ఛందస్సు మరియు జ్యోతిషములను జ్యోతిర్విజ్ఞానము యొక్క ఆరు అంగాలుగా రూపొందించారు.

## వైదికపరమైన జ్ఞానము గ్రుడ్డినమ్మకం కాదు

గ్రుడ్డిగా దేనినీ నమ్మడం కూడా సరైన పద్ధతి కాదు. జ్యోతిశ్శాస్త్రముపై, వైద్యునిపై, దుకాణదారునిపై, చివరికి స్వయంగా మన శక్తిపై కూడా మనం గ్రుడ్డిగా నమ్మకం పెట్టుకో కూడదు. ఐతే వీటితో కలిసివున్న జ్ఞానవిజ్ఞానములు మాత్రం అంధ విశ్వాసం కాదు. ఆధునిక విజ్ఞానం యొక్క విస్తరణ అనేది శూన్యంలో నుండి జరగలేదు. ఉనికి ఉన్నదాని యొక్క గతి, ఆ గతి గురించిన అధ్యయనం ద్వారా కాలగణనను అభివృద్ధిపరచడం అనేది వైదికకాలంలో జరిగిన సంగతి. ఋగ్వేదంలో 12 నెలలు, 720 రాత్రిపగలు అనే జంటల గురించిన వివరణ ఉంది. లోకమాన్యతిలక్ గణితంలో మహా పండితుడు. ఆయనను అంధవిశ్వాసమున్నవాడని అనలేం కదా! ఆయన నక్షత్రయోగమును ఆధారంగా చేసుకొని 'ఋగ్వేదము అనేది 10, 15 వేల సంవత్సరాల పూర్వమునాటిది' అని చెప్పారు. ఆకాశంలో లెక్కలేనన్ని తారలు ఉన్నాయి. ఆ తారల సమూహాన్ని నక్షత్రాలు అంటాము. ఒక తారల సమూహపు ఆకృతి మృగశిర వలె ఉంటే అది మృగశిరా నక్షత్రమైంది. తిలక్‌గారి ప్రఖ్యాత పరిశోధనా గ్రంథం పేరు 'ఆరోయన మృగశిర'. చేతి ఆకారంలో ఉండే తారల సమూహాన్ని హస్తా నక్షత్రం అంటారు. ఇటువంటివే 27 నక్షత్రాలు, 9 గ్రహాలు ఉన్నాయి. ఇందులో ఏడు గ్రహాలు ప్రత్యక్షంగా కనపడతాయి. వీటి పేరుతోనే ఏడు రోజులు ఏర్పడ్డాయి. రాహుకేతువులు బలమైనవి, ప్రభావవంతమైనప్పటికి ప్రత్యక్షంగా కనిపించవు. 2 1/4 నక్షత్రాలు కలిపి ఒక్కొక్క రాశిగా తయారైంది. వీటన్నింటి గమనములు, యోగసంయోగాల గురించిన వివరణయే జ్యోతిషానికి ముఖ్యమైన ఉపకరణాలు.

**ఇటువంటి లోతైన వైజ్ఞానిక దృష్టికోణమును, వైజ్ఞానిక మానసికతను లెక్కపెట్టలేనన్ని వైజ్ఞానిక ప్రయోగాలను, ప్రక్రియలను తనలోనే ఇముడ్చుకున్న ప్రాచీన భారతీయ ఖగోళ విద్య, జ్ఞానము, గణితములను అంధవిశ్వాసములని చెప్పటానికి మనలో అంధవిశ్వాసమేమీ లేదు.** జ్యోతిషపరమైన కాలగణన అనేది భౌతికమైనది. **5 వ శతాబ్దిలో ఆర్యభట్టు– సూర్యుడు స్థిరంగా ఉన్నాడనీ, పృథ్వి ఆయన చుట్టూ తిరుగుతున్నదనీ ప్రకటించాడు.** ఇదే విషయమును కోపర్నికస్ 15వ శతాబ్దములో ధృవీకరించాడు. **సూర్యుడు, చంద్రుడు, తారలతో వెలుగుతున్న సౌరమండలానికి సంబంధించిన లోతైన రహస్యములు భారతదేశము ముందే తెలుసుకున్నది.** పశ్చిమ దేశాలు ఏది చెప్తే అది పవిత్రం. భారతీయుల జ్ఞానమంతా అంధవిశ్వాసము అనే ప్రచారము దీనిని వెలుగులోనికి రానివ్వ లేదు. **ఖగోళము, సూర్యుడు, చంద్రుడు, తారలు, గ్రహాలతో కూడిన సంపూర్ణ సౌరమండలంపై భారతీయులదైన ఈ జ్ఞానము నెమ్మదిగా యూనానీల వశమైంది. పైథాగరస్ వంటి గణితజ్ఞుడు, దార్శనికుడు కూడా దీని ప్రభావంలోకి వచ్చాడు. కాలగణనకు, ఖగోళము కొరకు మాత్రమే గణితంపై ఆధార పడుట మొదలైంది. జ్యోతిష్యమనేది ఒక గణితం. మరి గణితమును అంధవిశ్వాసమని చెప్పకూడదు. గణితములోని ప్రతి ఒక్క అంకె భారతదేశములోనే ఆవిర్భవించినది. 'ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ బ్రిటానియా'ను అనుసరించి 1 నుండి 10 అంకెల ప్రతీక భారతదేశములోనే ఆవిర్భవించినది.** అరబ్బులు వాటిపై విస్తృతంగా ప్రయోగాలు చేశారు. ఇవి అరబ్బుల నుండి యూరప్‌కు లభించాయి. వైజ్ఞానిక దృష్టి కోణము కొరకు గణితము చాలా అవసరము. స్థానమును బట్టి సున్నాను ఉపయోగించడము వల్ల అంకె విలువ పెరుగు తుంది. ఇది కూడా భారతీయుల ప్రతిభ చేసిన చమత్కారమే!!

ఋగ్వేదంలో సంఖ్యావాచక శబ్దములు చాలా ఉన్నాయి. వైదిక సాహిత్యములో పదివేలను–ఆయతమనీ; లక్షను– నియుతమనీ; పదిలక్షలను ప్రయుతములనే పేర్లతో పిలుస్తారు.

**కాలం ఉన్నప్పుడే కలసి ఉండండి - కాలం దాటిపోయాక కలవరించినా కలుసుకోలేరు**

గణితములో వచ్చిన ఈ వికాసము ప్రాపంచికమైనది, అది కాలగణనలో కలుపబడియున్నది. కాలమునకు సంబంధించిన ఒక చిన్న అంశమైనా, క్షణమైనా, అరక్షణమైనా మనలను ఆశ్చర్యచకితులను చేస్తాయి. మొత్తము ప్రపంచము పైన వీటి ప్రభావము ఉంటుంది.

**జ్యోతిషము అనేది వేదపురుషుని కన్నుగా చెప్పబడినది. దీని గురించిన జ్ఞానము లేకపోతే జీవితము చీకటైపోతుంది. వేదాంత జ్యోతిషము యొక్క రచయిత పేరు లగధ్. ప్రాచీన కాలము నుండి ఈయన యొక్క వైజ్ఞానికత పరీక్షింపబడుతూనే ఉంది. నిరూపించబడుతూనేవుంది. భారతీయ జ్ఞానవిజ్ఞానం, సంస్కృతిని అధ్యయనము చేసే విదేశీ విజ్ఞానవేత్తలందరూ ఈ విద్యవల్ల ప్రభావితులై తమ తమ భాషలలోకి అనువాదము కూడా చేసుకున్నారు. భారతదేశమునకు ఏయే దేశాలతో వ్యాపార, ధార్మిక, సాంస్కృతికపరమైన సంబంధాలు ఉన్నాయో వారంతా ఇక్కడికి వచ్చి తమను తాము శోధించుకొని తమ అనుభవాలను లిపిబద్ధం చేసి వెళ్ళారు.** క్రీ.పూ. 7 నుండీ 8 శతాబ్దం వరకూ బాబిలోనియాలో ఈ జ్యోతిర్విజ్ఞానమునకు విస్తృతమైన ప్రచారము లభించినది. పిమ్మట యూదులు, గ్రీకులు నేర్చుకోవటం ప్రారంభించారు.

## సమస్త విశ్వంలో వ్యాపించియున్నది జ్యోతిషవిద్యయే

మధ్యఆసియాలో ప్రాచీనకాలమునాటి 'ఎజెటిక్, మాయన్' అనే సంస్కృతులలో కూడా జ్యోతిర్విజ్ఞానము బాగా వాడుకలో ఉన్నది. పిమ్మట ఇది గ్రీకులకు అత్యంత ప్రియమైనదిగా మారిపోయింది. ముస్లింల్లోని ప్రముఖ జ్యోతిషవిద్యాచార్యుల్లో 'ఇబ్రేవతూతా, అల్బరూనీ' అనేవారు ముఖ్యులు. యాత్రికులుగా భారతావనికి వచ్చిన వీరు మిగిలిన విద్యలతోపాటు ఈ విద్యను కూడా అధ్యయనము చేశారు. తదుపరి వారు అరబ్‌దేశాల్లో ఈ విద్యను విస్తరింపజేసే ప్రణాళికలను వేశారు. అల్బరూనీ భారతదేశానికి గజనీతో పాటు వచ్చాడు. జ్యోతిషశాస్త్రమునకు ప్రభావితుడై అతను భారతదేశంలోని జ్యోతిషశాస్త్రమునందున్న 'పౌలిససిద్ధాంతము, బ్రహ్మగుప్తము'లపై వివరణ ఇస్తూ అరబ్ భాషలో ప్రామాణిక గ్రంథములను రచించారు. అరబ్బీభాషలో 'ఇండికా' అనే గ్రంథము రచించాడు. సంస్కృతము, జ్యోతిష శాస్త్రములలోని రహస్యములను తెలుసుకున్నాడు.

జర్మన్ విద్వాంసుడు శ్రీ. సాత్రో 'ఇండికా'లో వర్ణించిన సూక్ష్మజ్యోతిర్విజ్ఞాన సూత్రములు విశేష ప్రభావవంతమైనవని తెలిపారు, ఇండికాను జర్మన్‌భాషలోనికి అనువదించాడు. **భారతదేశంలోని జ్యోతిర్విజ్ఞానమునకు ప్రభావితులై చాలా మంది జర్మన్ విద్వాంసులు ఇక్కడకు వచ్చి ప్రాచీన వైదిక గ్రంథములను అధ్యయనము చేయటమే కాకుండా మరెక్కడా లభించని అపురూప, దుర్లభ గ్రంథములనెన్నింటినో తమతో పాటు తీసుకెళ్ళిపోయారు. అవి ఇప్పుడు మనకు అలభ్యములు. ఇది మన దురదృష్టము.**

దాదాపు క్రీ.పూ. నుంచే యూరోపియన్లు, అరబ్‌కు చెందిన అరబ్బీ విద్వాంసులందరూ భారతీయ జ్యోతిర్విజ్ఞానము పట్ల విశేష ఆసక్తిని కనపరచేవారు. ఆ కారణంగానే వారు తరచూ వాటిని అధ్యయనము చేసేందుకు ఇక్కడకు వచ్చేవారు. అక్బర్ సంస్థానములోని నవరత్నాలలో ఒకరైన అబ్దుల్‌రహీమ్ కేవలం భారతీయ సంస్కృతిని గౌరవించే మహాకవి మాత్రమే కాదు, జ్యోతిర్విద్వాంసుడు కూడా. అతను రచించిన 'ఖేటకౌతుకమ్, ద్వావింశత్‌యోగావళి' అనే గ్రంథములు ఈనాటికీ జ్యోతిష శాస్త్రమును అధ్యయనము చేసేవారికి మార్గదర్శనం చేస్తున్నాయి. దీనిని మనకు పట్టిన దౌర్భాగ్యముగా భావించాలి. ఎందుకంటే **మనదేశమునకు వచ్చిన విదేశీ పర్యాటకులు, విద్వాంసులు మోసంతో, బలంతో, ధన ప్రలోభాలను చూపించి మన జ్ఞాన భాండాగారమును లేవనెత్తుకుని తీసుకుపోతుంటే మనం కళ్ళు-నోరు మూసుకుని, చేతులు కట్టుకుని కూర్చునివున్నాము. ఇప్పటికీ మన కళ్ళు తెరుచుకోలేదు. మన యొక్క సోమరితనం, పనికిమాలినతనం ఇంకా సమాప్తం కాలేదు. ఈనాటికీ మనం మన యొక్క జ్ఞానవిజ్ఞానములను అంధవిశ్వాసములు అని చెప్తూ; అదేనోటితో మన జ్ఞానరాశిని తీసుకెళ్లిన విదేశీ భాషాకోవిదులు తమకనుగుణమైన రీతిలో మనముందుంచిన విషయాలను చూసి గొప్ప చమత్కారములు అని ఆశ్చర్యపోయి కీర్తిస్తుంటాము. ఇది మనజాతికి పట్టిన గ్రహణము.**

వైదిక **జ్ఞానవిజ్ఞానములకు సంబంధించిన ఏయే జ్ఞాన ధారలను లెక్కలేనంతమంది విదేశీ విద్వాంసులు స్వీకరించి తమ సొంతం చేసుకున్నారో; వాటిలో జ్యోతిర్విజ్ఞానముతోపాటు చికిత్సాశాస్త్రము కూడా చాలా ముఖ్యమైనది.** గ్రీకు విద్వాంసుడు 'మార్సిలీకిలనోం' జ్యోతిర్విజ్ఞానముపై 'లిబర్టీవిటా' అనే ఒక పుస్తకంలో అంతర్‌గ్రహీయ ప్రభావాలను గురించి విస్తారముగా వర్ణించాడు.


**(కొనసాగింపు 44వ పేజీలో ఉంది)**

రగులుతున్న చెట్టుపై పక్షి వాలదు - కోపంతో రగిలిపోయే వాని దరికి ఎవ్వరూ చేరరు

## ఆయుర్వేద వైద్యం-5

# నిమ్మకాయలోని ఆరోగ్య రక్షణ గుణాలు

ప్రకృతి మానవాళికై అనేక రకాలైన పండ్లను, ఓషధులను అందించుచున్నది. వీనిని సరియైన రీతిలో సదుపయోగం చేసికొనుటకై అంతర్‌దృష్టి యొక్క ఆవశ్యకత నేడు ఏర్పడింది. ఇట్టివానిలో నిమ్మకాయ ఒకటి. ఇది అన్ని కాలాలలో లభిస్తుంది. మన నిత్యజీవితంలో 'సి' విటమిను ఆవశ్యకత ఎంతగానో ఉంది.



ప్రకృతి చికిత్సాలయాలలో జలోపవాసం చేసెడివారి ఆరోగ్య సంరక్షణకై రోజూ 4 నిమ్మకాయల రసాన్ని నీటిలో కలుపుకొని త్రాగమని సలహా ఇస్తూ ఉంటారు. దీనివలన వారిలో రోగనిరోధకశక్తి పెరిగి, శరీరంలోని విషంతో కూడిన టాక్సిన్లు వెలుపలికి పోతాయి.

వేడి చేసి త్రాగినచో విటమిన్ 'సి' నష్టపోయెడి ప్రమాదం ఉన్నది. దీనికై విటమిన్ 'సి'ని పొందుటకై ప్రకృతిసిద్ధంగానే ఈ నిమ్మరసాన్ని సేవించాలి. నారింజ, టొమాటో, నిమ్మ, బత్తాయి, కమలా, దానిమ్మ మున్నగు పండ్లలో విటమిన్ 'సి' లభ్యత ఎక్కువగా ఉంటుంది. ఉదయానే పరగడుపున అర్ధనిమ్మకాయరసాన్ని పిండుకొని సేవించినచో, ఆరోజుకు శరీరానికి అవసరమైన 'సి' విటమిను అవసరం తీరుతుంది. భోజనంతో పాటు నిమ్మరసాన్ని సేవించుట వలదు, దానితో పొట్టలో ఆమ్లములు ఏర్పడి ఆహార జీర్ణము ఇబ్బందికరంగా మారుతుంది.

**హెచ్చరిక:** అధికంగా నిమ్మకాయ సేవనం ఆమ్లశాతాన్ని పెంచుతుంది. అల్సరు ఉన్నవారు అసలు వాడరాదు.

**ఆయుర్వేద మతానుసారం గుణ-ధర్మాలు:**

నిమ్మకాయరసం రక్తాన్ని శుద్ధిచేస్తుంది. జఠరాగ్నిని పెంచు తుంది. కాలేయమునకు సంబంధించిన వికారాలను తొలగిస్తుంది. వాత, పిత్త మరియు కఫాన్ని సమపాళ్ళలో ఉంచుతుంది. కళ్ళుతిరుగుట, అజీర్ణము మున్నగువానిని ఉపశమింపచేస్తుంది. హృదయానికి మంచి చేస్తుంది. బలవర్ధకమైనది. మొలలవ్యాధి, శ్వాసకోశాన్ని, దగ్గు, కఫము, శూలవ్యాధి వగైరాలు బారినుండి ఉపశమనాన్ని ఇస్తూ రోగనివారణ గావిస్తుంది. మలేరియా వగైరాల నివారణలో తోడ్పడుతుంది. రక్త-పిత్త నివారణ గావిస్తుంది. నోటి దుర్గంధాన్ని తొలగిస్తుంది, రుచిని పెంపొందిస్తుంది.

**ఇంటిలో ఉపచారాలు:**

**1) జల-ఉపవాస వేళ:** జలోపవాసము చేసెడి సాధకులు, ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ దీర్ఘ ఉపవాసాలు చేయుట ద్వారా జటిలమైన రోగాల నుండి విముక్తిని కోరుకుంటూ ఉంటారు. ఇట్టివారు నీటితోపాటుగా 24 గంటల్లో 4 నిమ్మకాయల రసాన్ని సేవించుట ద్వారా వారి శరీరంలోని టాక్సిన్ల (విషాలను) ఇంద్రియాలకు విజాతీయమైనవానిని శరీరం నుండి వెలుపలికి పంపించుట సులభతరమవుతుంది. ప్రకృతిసిద్ధమైన ఉపచారములో ఉపవాసము ద్వారా పటిష్టమైన చికిత్సలో నిమ్మ గొప్ప ఉపయోగకారిగా ఉంటుంది. ఉపవాస చికిత్సకుడు పరిశీలించి, గుర్తించి పనిని నిర్వర్తిస్తాడు.

**చర్మ సంబంధిత వ్యాధులందు:** 1) రక్తం కారుటను విరోధించెడి (యాంటిసెప్టిక్) గుణము కల్గి ఉన్నందున- చర్మ సంబంధిత దోషాలను దూరం చేస్తుంది. బాహ్యోపచారముల రూపములో నిమ్మకాయరసం ఒక బక్కెట్ నీళ్ళలో పిండి, ఆ నీటితో స్నానమాచరించుట మంచిది.

**2) తామర వగైరా నల్లని మచ్చలు మానుటకు:** మల్లె పూలను నూనెతోపాటు నిమ్మకాయరసాన్ని కలిపి మచ్చలపై రుద్దాలి. నిత్యము ఉదయాన్నే పరగడుపున నిమ్మకాయరసం నీటిలో ఒక చెంచా తేనెను కలిపి సేవించిన లాభకరము.

**3) చర్మం మచ్చలు:** తేనెలో నిమ్మకాయ రసాన్ని చేర్చి రోజూ ఆ మచ్చలపై లేపనంలా రాసినచో మచ్చలు సమసిపోతాయి.

**ఆధ్యాత్మికతలో బాధ్యత ఇవ్వబడదు - తీసుకోబడుతుంది**

**4) గజ్జిపైన:** కొబ్బరినూనెలో నిమ్మరసాన్ని పిండి గజ్జిపైన వ్రాసిన గజ్జి సమసిపోతుంది.

**ముఖంపైని మొటిమలు, మచ్చల వగైరా నివారణకు:** 1) పాలలోని మీగడతో నిమ్మరసాన్ని కలిపి మోహానికి పట్టించినచో లాభదాయకం. 2) నిమ్మకాయరసంలో నాలుగు రెట్లు గ్లిసరిన్ కలిపి ముఖానికి పట్టిస్తే కూడా లాభకారిగా ఉంటుంది.

**కిడ్నీలో రాళ్ళు నివారణకై:** ఉదయానే పరగడుపున నీటిలో ఒక నిమ్మరసాన్ని పిండుకొని, సేంధ్వాలవణంతో త్రాగాలి. దీనిని 6 నెలల పాటు కొనసాగించాలి.

పత్యం రూపంలో కీర, ముల్లంగి, కర్బుజా, పుచ్చకాయ, బొప్పాయి, ద్రాక్ష, కమలాలను అధికంగా తీసికొనుట మంచిది.

**సాధారణ ఎసిడిటి (ఆమ్ల-పిత్త దోషం):** ఒక గ్లాసు వేడి నీటిలో అర్ధనిమ్మకాయరసాన్ని పిండి సోడా కలిపి (సోడియం బైకార్బనేట్) ప్రతిరోజు ఉదయం పరగడుపున సేవించిన మంచిది.

**గమనిక:** అధిక ఎసిడిటి ఉన్నవారు నిమ్మకాయను వాడవలదు.

**అన్నిరకాల జ్వరములలో:** అన్నిరకాల జ్వరాలు నివారణలో నిమ్మకాయరసం ప్రయోజనకారియే. నీటిలో కలుపుకొని రోజుకు 4-5 కాయల రసాన్ని త్రాగవచ్చు.

నిమ్మకాయరసంలో సేంధ్వాలవణాన్ని, తేనెను తగినంత పటికబెల్లం కలుపుకొని ఎలక్ట్రోల్ మాదిరి రోజంతా కొద్దికొద్దిగా తీసికొనాలి.

ఎవరైతే నియమితరూపంలో నీటితోపాటు నిమ్మరసాన్ని నిత్యం సేవిస్తూంటారో వారు జ్వరముల నుండి రక్షింపబడతారు.

**టైఫాయిడ్‌తో పీడింపబడేవారు:** నిమ్మకాయరసం టైఫాయిడ్‌కు చెందిన జ్వరాన్ని సమాప్తం గావిస్తుంది. టైఫాయిడ్ మరియు పాండురోగముల రెండింటిలో నివారణార్థమై రోజులో 3-4 సార్లు నిమ్మకాయరసం నీళ్ళు సేవించుట అవసరం. దీనివలన కాలేయమునకు మేలు కలుగుతుంది. ఈ రోగాలందు రసాహారము లాభదాయకము. పండ్లరసాలు, పచ్చని కూరగాయలతో సూపు తయారుచేసికొని త్రాగుట మంచిది. మిర్చి, మసాలాల వాడకాన్ని పూర్తిగా నిషేధించాలి. కనీసం 3 మాసాల వరకు తేలికపాటి ఆహారాన్ని, బాగా వండిన సాత్విక ఆహారాన్ని సేవించుట ఉత్తమం.

**ఉత్తమ పత్యము:** మజ్జిగాన్నంతో కూడినది.

**బట్టతల నివారణకై-చుండ్రు నివారణకై:**

1) నిమ్మరసాన్ని శుద్ధమైన కొబ్బరినూనెలో కలిపి తలకు పట్టించండి. లీటరు కొబ్బరి నూనెలో 100 గ్రాముల నిమ్మరసం కలిపి, చిన్న మంటమీద కాయండి. నిమ్మరసం నూనెలో ఇగిరిపోగానే, నూనె గిన్నెను పొయ్యి నుండి దింపి చల్లార్చండి. సీసాలో నింపి ఉంచండి. ఈ నిమ్మనూనెను తలవెంట్రుకల మొదళ్ళకు పట్టించండి. నల్లధనం చేకూర్చుతుంది. చుండ్రు నివారింపబడుతుంది.

2) నిమ్మరసంలో ఉసిరికాయ చూర్ణాన్ని కలిపి తల వెంట్రుకల మొదళ్ళలో వ్రాసిన తలవెంట్రుకల మొదళ్ళు గట్టిపడి ఊడిపోవుట తగ్గిపోతుంది.

**లావు తగ్గుటకై:** ప్రతిరోజు ఉదయాన్నే ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో 5 గ్రాముల తేనె కలిపి దీనిలో అర్ధనిమ్మకాయరసాన్ని పిండి త్రాగినచో శరీరంలోని అనావశ్యకమైనదానిని కరిగించి వేస్తుంది. లావును తగ్గిస్తుంది. శరీరం ఆరోగ్యవంతమై జీవనీ శక్తి పెంపొందుతుంది.

**గమనిక:** మధుమేహంతో బాధపడెడివారు తేనెను వాడరాదు.

**రక్తపోటు మరియు హృదయ రోగులు :** అధిక లేక తగినంత రక్తపోటు లేని రోగగ్రస్తులిరువురికి నిమ్మ మంచి ఉపయోగకారి. రక్తనాళాలను పరిశుభ్రపరచి, హానికారకమైన క్రొవ్వు(కొలెస్ట్రాల్)ను నిమ్మరసంలోని 'నిమోలిన్' అనెడిది తొలగిస్తుంది. అనావశ్యక శరీరాన్ని తగ్గిస్తుంది. అవసరమైన ఖనిజ లవణాల లేమిని కూడా నిమ్మకాయరసం పూరిస్తుంది.

**ముక్కు నుండి రక్తం కారుట :** ముక్కు నుండి రక్తము స్రవించుచున్నచో రెండు చుక్కల నిమ్మరసాన్ని ముక్కులో వేసిన రక్తస్రావం ఆగిపోతుంది.

**ఆకలి మందగించిన :** అల్లమును నూరి దానిలో సేంధ్వా లవణాన్ని, నిమ్మరసాన్ని కలిపి చట్నీగా తయారుచేసి తినవచ్చు. ఈ చట్నీని భోజనానికి 20 నిమిషాల ముందు 5 గ్రాముల సేవించిన జఠరాగ్ని పెరిగి ఆకలి పెరుగుతుంది.

**పెద్ద లక్ష్యాన్ని చేరుటకు దార్శనికత అవసరం**

**మలద్వారం వద్ద దురద మొలల సంబంధిత రోగాలు:** మొలలవ్యాధితో మలవిసర్జన బాధతో కూడి ఉంటుంది. అట్టివేళ 5 గ్రాముల ఆవ లేక కొబ్బరినూనెలో ఒక గ్రాము నిమ్మరసాన్ని చేర్చి బాగుగా కలిపి మలద్వారంపై ప్రతిరోజు పిచికారి చేయాలి. మలద్వారం దురద కూడా నివారింపబడుతుంది.

**మొలలవ్యాధి నివారణకై :** ఉదయానే పరగడుపున ఒక గ్లాసు వడకట్టబడని లేక శుద్ధి చేయబడని గోమూత్రంలో అర్ధనిమ్మకాయరసాన్ని పిండుకొని వారంరోజుల పాటు వరుసగా సేవించాలి.

2) నిమ్మకాయను రెండు భాగాలుగా కోసి బాగా నలిపిన రెండు గ్రాముల కాసును వీటితో కలపాలి. రెండు భాగాలను రాత్రంతా ఆరుబయట గాలిలో ఉంచాలి. ఉదయానే సేంధ్వా లవణాన్ని చేర్చి రెండింటి రసాన్ని పిండి త్రాగాలి. ఈ రీతిగా 15 రోజులు క్రమం తప్పక చేయాలి.

**గర్భిణీ స్త్రీలు వేవిళ్ళతో బాధపడుచున్నప్పుడు :** నిమ్మకాయ డిప్పలను ఎండబెట్టి కాల్చి భస్మాన్ని అర్ధగ్రాము చొప్పున తేనెతో కలిపి తీసికోవాలి. 2 గంటలకొకసారి రెండుసార్లు తీసికోవాలి.

**తలనొప్పికి :** పంచదార లేకుండా టీ డికాక్షన్‌లో నిమ్మరసాన్ని కలుపుకొన్న తలనొప్పి ఉపశమిస్తుంది.

**పిత్తతత్త్వము వికృతిలో దాహం ఎక్కువగా ఉన్నచో :** దాహం లేక పిత్తదోషం నివారణకై నిమ్మరసంతో షర్బత్ తయారు చేసికొని త్రాగిన లాభం చేకూరుతుంది.

**పాలు అరగనిచో :** పాలను అరగించుకొనలేని పిల్లలకు పాలు త్రాగిన వెంటనే నీటిలో నిమ్మరసాన్ని కలిపి త్రాగించాలి. పాలు అరుగుతాయి.

**తామర చర్మవ్యాధి నివారణకు :** నిమ్మకాయ గింజలను నూరి తామరపై రాయాలి.

**గోళ్ళ సౌందర్యానికై :** రసాన్ని పిండిన తదుపరి ఆ నిమ్మ చెక్కలను గోళ్ళపై రుద్దాలి.

**తేలు కుట్టినచో :** నిమ్మకాయరసాన్ని పొటాషియం పెర్మాంగనేట్‌తో కలిపి బియ్యపుగింజ పరిమాణంలో తీసికొని తేలు కుట్టిన చిహ్నమున్న ప్రదేశంలో ఒక చుక్క నీటిని దానిపై వేయాలి. ఇది చమత్కారంగా నివారణను కలిగిస్తుంది.

---

**(41 వ పేజీకి కొనసాగింపు)**

ఇటువంటి ప్రపంచ ప్రసిద్ధ విద్వాంసులు, ఆలోచనాపరులు ఒకరు కాదు అనేకమంది జ్యోతిర్విజ్ఞానమును వైజ్ఞానిక-మానసికస్థితితో అర్థం చేసుకునే ప్రయత్నం చేశారు, దానిని మానవ జీవితానికి ఉపయోగపడేలా చేసుకున్నారు.

**ఎవరు తమకున్న మిడిమిడి జ్ఞానంతో దీనిని కేవలం అంధవిశ్వాసం అని అనుకుంటారో వారు తమ అభిప్రాయముల కారణముగానే అంధవిశ్వాసమున్నవారుగా చెప్పబడతారు. సత్యమేమిటంటే జ్యోతిర్విజ్ఞానము అనేది ప్రాచీన భారతీయ మహర్షుల మరియు మనీషుల యొక్క కఠినమైన, అనవరతమైన తపస్సుకు మరియు నిరంతర అనుసంధానము వలన లభించిన శ్రేయోదాయకమైన, అద్భుత పరిణామము.** ఈ ప్రకాశము గురించి ఇంకా ఎక్కువ స్పష్టముగా అర్థం చేసుకోవాలంటే మరొక భాగములో దీనిని వివరించవల్సివుంటుంది.

ప్రస్తుతం మన దేశ కవి మైథిలీశరణ్‌గుప్త్‌గారి రచనయైన 'భారత్-భారతీ' నుండి ఉటంకించబోయే కొన్ని పంక్తులు ఈ సత్యమును మనకు చాలా స్పష్టముగా తెలియజేస్తాయి. -

*వృత్తాంత్ పహలే వ్యోమ్ కా హమీ నే కియా,*
*వహ్ క్రాంతి మండల్ థా హమీసే అన్య దేశోం నే లియా ।*
*థే ఆర్యభట్, ఆచార్య భాస్కర్ తుల్య జ్యోతిర్విద యహా,*
*అబ్ భీ హమారే మానమందిర్ వర్ణనీయ నహీ కహా?॥*
*జిస్ అంక్‌విద్యా కే విషయ్ మే వాద్‌కా ముంహ్ బన్ద హై,*
*వహ్ భీ యహా కే జ్ఞాన్ రవి కీ రశ్మి ఏక్ అమంద్ హై ॥*
*దర్‌కర్ కఠోర కళంక్ సే, వా సత్య కే ఆతంక్ సే,*
*కహతే అరబ్‌వాలే అభీ తక్ 'హింద్‌సా' హి అంక్ సే ॥*
*ఉన్ 'సుల్వ సూత్రోం' కే జగత్ మే జన్మదాతా హై హమీ,*
*రేఖాగణిత్ కే ఆదిజ్ఞాతా యా విధాతా మై హమీ ॥*
*హమ్‌కో హమారీ వేదియాం పహలే ఇసే దిఖలా చుకీ,*
*నిజ రమ్య రచనా హేతు వే రేఖాగణిత్ సిఖలాచుకీ ॥*
*ఆకార్ దేఖ్ ప్రకార్ థే హమ్ జాన్ జాతే ఆప్ కీ,*
*వే శాస్త్ర 'సాముద్రిక్' సరీఖే బనతే ఆప్ హీ ।*
*విజ్ఞాన్ సే భీ 'ఫలిత్ జ్యోతిష్' హో రహా అబ్ సిద్ధ్ హై,*
*యద్యపి అవిజ్ఞోం సే హుఆ వహ్ నింద్య ఔర్ నిషిద్ధ్ హై ॥*

*- అనువాదం: శ్రీమతి వల్లీ శ్రీనివాస్*

**పురుషార్థాలలో ఆధ్యాత్మిక పురుషార్థం చాలా విలువ కలిగినట్టిది**

# స్ఫూర్తిదాయక గాయత్రీపరివార్ సభ్యులు - 16

## శ్రీమతి నూతక్కి పద్మావతి - శ్రీ బాలకృష్ణ చౌదరి దంపతులు, ఖమ్మం



శ్రీ నూతక్కి బాలకృష్ణచౌదరిగారు - శేషయ్య రంగ నాయకమ్మ దంపతులకు జులై నెల 1954లో మహబూబాబాద్ గ్రామంలో వరంగల్ జిల్లాలోని వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ప్రాథమిక మరియు ఉన్నతవిద్యను జన్మస్థలంలోనే పూర్తి గావించుకొన్నారు. మహారాష్ట్రలోని నాగపూర్ నగరంలో 1978లో అగ్రికల్చరల్‌లో ఎమ్.ఎస్.సి. పట్టాను పొందారు. అటు తరువాత వెంటనే అక్టోబరు 1978లో వ్యవసాయ డిపార్టుమెంట్‌లో ప్రభుత్వ ఉద్యోగిగా చేరారు. ఆనాటి నుండి ఖమ్మం జిల్లాలో వివిధ ప్రదేశాలలో పనిచేస్తూ మంచి పేరును సంపాదించారు.

తదుపరి న్యాయవాదపట్టాను పొందిన కృష్ణాజిల్లా ఊటుకూరు గ్రామ నివాసి కుమారి పద్మావతిగారు 1983లో వీరి సహధర్మచారిణిగా వీరి జీవితంలో ప్రవేశించుట జరిగింది. చక్కని సంసారం, ప్రశాంతంగా జరిగిపోవుచున్న ఉద్యోగంతో భౌతిక జీవితం పూర్ణత్వాన్ని సిద్ధించుకొన్న చౌదరి దంపతుల మనస్సులోని ఆలోచనలు ఆధ్యాత్మికత వైపు మరలాయి. తొలి అడుగు పిరమిడ్ ధ్యానం వైపు పడింది. దీనిలో కొంతకాలం గడిపిన ఈ దంపతులకు, ఆధ్యాత్మిక జీవన మార్గంలో మరింత లోతైన అనుభవాన్ని పొంద వలయు ననెడి ఆకాంక్ష రోజురోజుకు బలీయం కాసాగింది. పిరమిడ్ కేంద్రంలో శ్రీరామకృష్ణగారితో పరిచయమైంది. వీరిమధ్య ఆధ్యాత్మికత, ధ్యానము అనెడి వానిపై చర్చ జరుగు సమయంలో, రామకృష్ణగారు గాయత్రీ ప్రజ్ఞాపీఠము, మామిళ్ళ గూడెం, ఖమ్మంను సందర్శించవలసిందిగా చౌదరిగారికి సూచించుట జరిగింది. సూచన అందిన మరుక్షణము శ్రీ చౌదరిగారు మామిళ్ళగూడెంలోని గాయత్రీ ప్రజ్ఞాపీఠాన్ని సందర్శించుట జరిగింది. ఈ రీతిగా శ్రీ చౌదరి దంపతులు "గాయత్రీ" పరివార్‌లో సభ్యులుగా ప్రవేశించుట జరిగింది.

జన్మతః అబ్బిన శాంతము, ప్రేమ, వివేకము చౌదరిగారు 'గాయత్రీ' పట్ల, గాయత్రీమంత్రము పట్ల విశేషంగా ఆకర్షితులగుటలో ఆశ్చర్యము లేదు. దీనికి తోడు వారి ధర్మపత్ని పద్మావతిగారు 'గాయత్రీ' పట్ల సమర్పణతో, భర్తకు తగిన సహాయ సహకారముల నందించసాగారు. గాయత్రీ పరివార్ కార్యకర్తలైన శ్రీశంకరయ్య, శ్రీప్రసాద్ మున్నగువారు ఈ దంపతులిరువురికి గాయత్రీ పరివార్ కార్యక్రమాల నిర్వహణలో తమ సంపూర్ణ సహకారము లందించుటచే వీరు 'గాయత్రీ' కార్యక్రమాలకు మరింత చేరువైనారు. ఈ నేపథ్యంలో శ్రీ చౌదరిగారు తన వృత్తిధర్మాన్ని నిర్వర్తిస్తూ శాంతికుంజ్‌ను ఇప్పటికి 6 సార్లు దర్శించుట జరిగింది. అట్లే గాయత్రీ పరివార్ వరిష్ఠ కార్యకర్త శ్రీ తుమ్మూరిగారితో పరిచయం, తదుపరి నారాకోడూరు ఆశ్రమాన్ని పలుమార్లు దర్శించి, గురుదీక్ష పొందుట జరిగింది.

పై కార్యక్రమాల కొనసాగింపులో భాగంగా శ్రీ చౌదరి దంపతులు మామిళ్ళగూడెం ప్రజ్ఞాపీఠానికి మేరుదండముగా నిలచి, అనేకానేక గాయత్రీయజ్ఞాలను 5 కుండములు మొదలుకొని 24 కుండముల వరకు పదుల సంఖ్యలో చేయుట జరిగింది. తదుపరి ఒక పర్యాయం 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞాన్ని నిర్వహించుట జరిగింది.

వీని పర్యవసానంగా యుగశక్తి గాయత్రీ మాసపత్రికను అధిక సంఖ్యలో పాఠకుల వద్దకు చేర్చుటలో శ్రీ చౌదరిగారి కృషి అత్యంత శ్లాఘనీయం. వందల సంఖ్యలో పత్రికను పాఠకుల వద్దకు చేర్పించుచున్నారు.

పూజ్యగురుదేవుల ఆశయ సాధనలో భాగంగా, యుగ నిర్మాణ కృషిలో భాగంగా, విద్యార్థులలో చైతన్యాన్ని నింపి, తద్వారా వారిని సంస్కరిస్తూ వారి ద్వారా కుటుంబాలను, సమాజాన్ని సంస్కరించెడి దిశగా 2013 నుండి తన కృషిని ప్రారంభించారు. విసుగుచెందని విక్రమార్కునిలా, పూజ్య గురుదేవులపై ప్రగాఢ విశ్వాసముంచి, ధర్మపత్ని చేదోడు


**ప్రాపంచిక సంపదకు, ఆధ్యాత్మిక సంపదకు మధ్య ఇనుముకు-బంగారానికి ఉన్నంత తేడా ఉంది**

వాదోడుగా నిలిచి ఉండగా మొక్కవోని ధైర్యముతో, దృఢ సంకల్పంతో 25 పాఠశాలలను సందర్శించి దాదాపు 3500 మంది విద్యార్థిని, విద్యార్థులతో భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్షను వ్రాయిస్తున్నారు. పదవీ విరమణానంతరము అందరిలా తమ సంతానంపై మోహవివశుడుకాక, తన జీవితాన్ని సమాజశ్రేయస్సుకై, ధర్మపత్నిని వెంటనిడుకొని, గురుయుగ్మ మార్గదర్శనంలో పయనించుచున్న నిరంతర కృషీవలుడు, కార్యదక్షుడు, త్యాగశీలి. పూజ్యగురుదేవుల అంగ అవయవాలుగా తనను తాను మలచుకొన్న సమర్పణాశీలి.

పైవానిని గుర్తించిన గాయత్రీ చేతనాకేంద్రము, మూసాపేట హైదరాబాదు వారు 2015 గోదావరి పుష్కర కార్యకలాపాల నిర్వహణభారాన్ని మోపగా, చిఱునవ్వుతో బాధ్యతను స్వీకరించి దాదాపు 3 మాసముల పాటు శ్రమించి, ఆర్థిక భారాన్ని కూడా తలకెత్తుకొని తనకు అప్పగించిన కార్యాన్ని నిర్విఘ్నంగా నిర్వహించిన కార్యశూరుడు. భర్తకు చేదోడుగా నిలచి సహధర్మచారిణిగా తన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించిన శ్రీమతి పద్మావతి కృష్ణచౌదరి అభినందనీయురాలు.

వీరికి వీరి కుటుంబానికి పూజ్యగురుయుగ్మము అఖండ గురుసత్తా ఆయురారోగ్యముల ప్రసాదించి సకల సంపత్తులతో విరాజిల్లేలా ఆశీస్సులందించవలసిందిగా యుగశక్తి ప్రార్థిస్తున్నది.

## శ్రీ దాచేపల్లి వెంకయ్యగారు, ఖమ్మం



శ్రీ దాచేపల్లి వెంకయ్యగారు ఆగస్టు 1940వ సం॥లో శ్రీరామయ్య – రామమ్మ దంపతులకు తిరుమలాయ పాలెం గ్రామం ఖమ్మంలో జన్మించారు. పుట్టిన గ్రామంలోనే హైస్కూలు విద్య వరకు చదివి, తదుపరి తెలుగు భాషలో పి.డి.సి. మరియు పి.ఒ.ఎల్. కోర్సులు చదివి దానిలో ఉత్తీర్ణులై తెలుగు భాషా పండితునిగా మధిర గ్రామం ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగిగా స్థిరపడ్డారు.

శ్రీ ముప్పాళ్ళ రాజగోపాలం కళాశాల ఉపన్యాసకులతో పరిచయం కాగా, వారి ద్వారా గాయత్రీ పరివార్ ఖమ్మం శాఖవారితో పరిచయం లభించింది. 2006 నుండి ఖమ్మం జిల్లా మామిళ్ళగూడెం శాఖతో అనుబంధమేర్పడి ఆనాటి నుండి గాయత్రీయజ్ఞాలలో చురుకుగా పాల్గొనసాగారు. తదుపరి గాయత్రీ పరివార్ డా॥ తుమ్మూరిగారితో పరిచయం కలుగగా, నారాకోడూరులోని గాయత్రీశక్తిపీఠాన్ని 4 సార్లు దర్శించి, మంత్రదీక్షను తీసికొన్నారు. శాంతికుంజ్‌ను ఆరుసార్లు దర్శించుట జరిగింది. డా॥ తుమ్మూరిగారి వ్యక్తిత్వము మరియు శ్రీశంకరయ్యగార్ల సాంగత్యంలో వెంకయ్యగారు పూర్తిగా గాయత్రీ కార్యకలాపాల పట్ల ఆకర్షితులై పనిచేయసాగారు.

అనేక సమయాల్లో శ్రీ చౌదురిగారికి తోడుగా నిలచి తగిన సహకారాన్ని అందిస్తూ తన వంతు కర్తవ్యాన్ని పూర్తి చేస్తూ పరివార్ ఎదుగుదలకు కృషిచేస్తున్నారు. తన 74 ఏళ్ళ వయస్సులో అలుపెరుగని కార్యశూరునిలా గాయత్రీ వ్యాప్తికై తన కృషిని కొనసాగించుట మిగుల ఆనందదాయకం.

2015 గోదావరినది పుష్కరాలను పురస్కరించుకొని, గాయత్రీ చేతనా కేంద్రము పిలుపు మేరకు బాధ్యతను స్వీకరించి భద్రాచలక్షేత్రమందు 15 రోజులపాటు శ్రీ చౌదరిగారికి సహాయ సహకారమందిస్తూ పుష్కర కార్యక్రమాల నిర్వహణలో తోడ్పడినారు. 74 ఏళ్ళ వయస్సులో అలుపెరుగని అపర భీష్మునిలా సేవలందించుట గురువు పట్ల, మిషన్ పట్ల వారికి గల నిబద్ధతకు గీటురాయి.

సుఖశాంతులతో కూడిన వారికి వారి కుటుంబానికి ఆయురారోగ్యములను, సకల సంపదల నందించవలసిందిగా పూజ్యగురుయుగ్మము, అఖండ గురుసత్తాను యుగశక్తి గాయత్రీ ప్రార్థిస్తున్నది.

## భక్తి అనగా ఏమి?

*మహారాజ్! భక్తి అనగా ఏమిటి? అని రామకృష్ణ పరమహంసను ఆయన శిష్యులు ప్రశ్నించారు. దీనికి జవాబుగా స్వామి ఇలా బదులిచ్చారు. "భక్తి అనగా మనస్సు, మాటలను జోడించి క్రియ ద్వారా భగవంతుని పిలచుట! క్రియ అనగా చేతులతో భగవంతుని పూజిస్తూ, ఆయన ఉనికిని గుర్తించుటకై కాళ్ళను ఉపయోగిస్తూ చెవులతో భగవంతుని నామాన్ని, గుణాలను, భజనల వింటూ, కన్నులతో ఆయనను దర్శిస్తూ ఉండాలి. మనస్సు అనగా ఎల్లవేళల ఆయనను ధ్యానిస్తూ, ఆయననే ఆలోచిస్తూ ఆయన లీలలను స్మరిస్తూ ఉండుట. పలుకు (వాణి) అనగా గ్రంథాలను పఠిస్తూ, ఆయన భజనల పాడాలి. అప్పుడు ఈ మూడు కలిసి భగవంతుని పిలుస్తాయి. అప్పుడు భక్తి సార్థకమవుతుంది.*

*– తెనుగు సేత : ఎ. శారద*

**మహాత్ములు స్వార్థం కోసం గాక, విశ్వహితం కోసం తమ పురుషార్థాన్ని వినియోగిస్తారు**

# 9 రోజుల సంజీవని సాధనాశిబిరము - ప్రవచనముల పాఠము-4

*గత సంచిక తరువాయి...*

## 17.05.2015 - సా॥ 6.30 గం॥లకు "గర్భోత్సవం" అనే అంశంపై డా॥ శ్రీమతి గాయత్రీశర్మగారి ప్రవచనము

పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య వందనీయ మాతాజీ భగవతీదేవిశర్మల సూక్ష్మసంరక్షణలో నున్న మనము ఒకసారి గాయత్రీమంత్రాన్ని ఉచ్చరించుదాం.

"ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్"

మిత్రులారా! మనము ఇప్పుడు వైజ్ఞానికయుగములో జీవిస్తున్నాం! ప్రతిదానిని తర్కవితర్కంతో విశ్లేషించి, శాస్త్ర బద్ధంగా ఉన్నప్పుడు మాత్రమే దానిని స్వీకరిస్తున్నాం, విశ్వసిస్తున్నాం! ఇట్టి స్థితిలో మన ఉపాసన, సాధనలు కూడా హేతుబద్ధంగా, విశ్వసనీయంగా ఉండాలి.

నేడు మన సమాజంలో అనేక సాంఘిక రుగ్మతలు చోటు చేసుకున్నాయి. పిల్లలు–తల్లిదండ్రుల మధ్య సరియైన అవగాహన లోపించింది. పరస్పర ప్రేమ, కరుణ, మమతలు సన్నగిల్లాయి. స్వార్థచింతన ప్రబలింది.

ఈ స్థితిని లోతుగా పరిశీలించిన మనకు బోధపడేది– మన సంస్కారవిహీన జీవనము. తల్లిదండ్రులుగా మనము పిల్లలకు చిన్ననాటి నుండి అందించవలసిన సంస్కారాలను అందించకపోవుట ప్రధాన లోపంగా పరిశీలనలో తేలింది. ప్రాచీనకాలంలో మన ఋషులు, మునులు మనకందించిన విజ్ఞానాన్ని అనగా జీవించెడి కళను మనము విడచిపెట్టాం. మన ఋషులు అనగా ఆధ్యాత్మిక శాస్త్రవేత్తలు వారి తపస్సు ద్వారా దర్శించి అందించిన ఆధ్యాత్మిక మనోవిజ్ఞానాన్ని పూర్తిగా పెడచెవిన పెట్టాం. పిండము (శిశువు)ఉత్పత్తి మాతృగర్భములో ప్రారంభమైన నాటినుండి శిశువు తల్లి పొందెడి మనోభావాలకు ప్రభావితమగుట ప్రారంభిస్తుంది. ఈ ప్రభావితం చెందుట క్రమక్రమంగా పెరుగుతూ ఉంటుంది. గర్భముతోనున్న స్త్రీ పొందెడి ఆనంద, సుఖసంతోషాలు, దుఃఖ కష్ట తాపాలు గర్భస్థ శిశువుపై తమ ప్రభావాన్ని అనుక్షణం చూపిస్తూ ఉంటాయి.

మిత్రులారా! పురాణపరంగా అభిమన్యుడు, అష్టావక్రుని గాథలు పైవానికి ప్రత్యక్ష ఉదాహరణలుగా నిలుస్తాయి. అభిమన్యుడు తల్లిగర్భములోనుండగనే తండ్రి అర్జునుడు, భార్య సుభద్రకు పద్మవ్యూహాఛేదనను తెలుపుచుండగా గర్భస్థశిశువు అభిమన్యుడు విని దానిని తెలుసుకున్నాడు. అట్లే అష్టావక్రుడు, నేటి కాలంలో ఛత్రపతి శివాజీ, స్వామి వివేకానందుడు ఈశ్వర చంద్రవిద్యాసాగర్ మున్నగువారు గర్భస్థశిశువులుగా ఉండగానే వారి తల్లుల ద్వారా తగిన సంస్కారాలను పొందారు. "మదర్ ఈజ్ ది ఆర్కిటెక్ట్ ఆఫ్ ది ఛైల్డ్" అని ఇంగ్లీషు వాక్యం – "తల్లి బిడ్డ భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక నిర్మాణానికి శిల్పి" సమాజంలో ప్రతి భౌతికవిద్యకు అనగా న్యాయశాస్త్రానికి, వైద్యశాస్త్రానికి, సాంకేతికశాస్త్రానికి, యాజమాన్యశాస్త్రానికి విద్యాలయాలు ఉన్నాయి. కాని సంస్కారాల ద్వారా వ్యక్తి, సమాజ, రాష్ట్ర, విశ్వ నిర్మాణాన్ని తీర్చిదిద్దాలి. దీనికై ప్రజ్ఞామండళ్ళను, మహిళామండలులను గ్రామ గ్రామాన ఏర్పాటు చేయాలి. వైద్యశాలల ద్వారా, మహిళా వైద్యుల ద్వారా గర్భిణీ స్త్రీలకు ఈ శిక్షణను అందించాలి. ఈ సంస్కారాల విలువలను తెలియజెప్పాలి.

గర్భిణీ స్త్రీ నివసించెడి గృహము, అందలి పరివారము, వాతావరణము ఎట్లు ఉండాలనెడి దానిపై తగిన రీతిలో శిక్షణను అందించాలి. ఈ క్రింది జాగ్రత్తలు చేపట్టాలి.

1. భార్యాభర్తలు (గర్భిణీ స్త్రీ) అన్యోన్యంగా ఉండాలి.
2. అత్తాకోడళ్ళ మధ్య ప్రేమబంధం గౌరవాదరాభిమానాలు వెల్లివిరియాలి.
3. గృహంలో ఎల్లప్పుడు శాంతి సుహృద్భావ వాతావరణం నిండివుండాలి.
4. చక్కని భావోద్వేగాల నడుమ కుటుంబ సభ్యులు జీవించాలి.
5. సద్గ్రంథ పఠనం, సత్సంగాలు నిత్యం జరగాలి.

**సోమరితనం, విలాసములు, స్వార్థము, లోభం - నికృష్టమైనవి**

6. ప్రేరణాత్మకము, సందేశాత్మకము, ఉత్తమ మానవ సంవేదనలు పెంపొందించెడి కథలు, గాథలు వినిపించబడాలి.
7. ఆరోగ్యము, ఉల్లాసము, ఉత్సాహాన్ని కలిగించెడి ఆహారాన్ని గర్భిణికి అందించాలి.
8. గర్భిణీ స్త్రీ చక్కని యోగాసనాలు క్రమము తప్పక వేస్తుండాలి.
9. గర్భిణి నిద్రించెడి పడకగది గోడలను స్ఫూర్తిదాయకాలు, ప్రేరణాత్మకమైన చిత్తరువులతో అలంకరించాలి.

కారణశరీరంలో నున్న తన సంస్కారాల కనుగుణంగా తగిన తల్లిదండ్రులను ఎన్నుకొని, తండ్రి శుక్లము ద్వారా తల్లి గర్భములో పిండము ప్రవేశిస్తుంది. ఇది ఆధ్యాత్మికశాస్త్రము మనకు అందించిన సత్యము.

గర్భము దాల్చిన నాటి నుండి ప్రారంభమై పిండము గర్భములో నాలుగు నెలలు నిండేసరికి 80 శాతము మెదడు ఎదుగుదల పూర్తవుతుంది. దీనిని ఆధునిక శాస్త్ర విజ్ఞానం కూడా బలపర్చింది. కావున స్త్రీకి గర్భాదానం జరిగి గర్భ నిర్ధారణ జరిగిన నాటి నుండి సంస్కారాలు గర్భస్థశిశువుకు అందుట ప్రారంభం కావాలి. అప్పుడే శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా బలమైన శిశువు జన్మించుట జరుగుతుంది. లేనిచో పూజ్యగురుదేవులన్నట్లు ప్రమాదవశాత్తు పుట్టిన పిల్లలవుతారు. సంస్కారవిహీనులుగా జన్మిస్తారు.

మూడవమాసం నుండి మూత్రపిండాలు ఉత్పత్తి అవుతాయి. నాలుగవమాసం నుండి మెదడు కణాలు వ్యాప్తిజెందుట ప్రారంభమౌతాయి. దీనితో వాసనలు, గుణకారణాలు ఉత్పన్నమగుట ప్రారంభమవుతుంది. ఐదవ మాసానికల్లా అధిక శాతం మెదడు వికసించుట పూర్తి అవుతుంది. భాషలు నేర్చుకొనుట ప్రారంభమవుతుంది. గర్భస్థశిశువు స్పందించుట ప్రారంభిస్తుంది. తల్లి బాధలకు, ఆనందానికి, అశాంతికి, శాంతికి, దుఃఖానికి, సంతోషాలకు గర్భస్థశిశువు ప్రతిస్పందిస్తుంది. ఏడవమాసం నుండి తల్లిదండ్రుల మధ్య జరిగెడి వాద ప్రతివాదాలకు, గర్భస్థ శిశువు కూడా తల్లితో పాటు ప్రతిస్పందిస్తుంది. విదేశాలలో (జపాన్‌లో) దీనిపై ప్రయోగాలు జరిగాయి. సత్వగుణాల పెంపొందించెడి సంగీతం శిశువు మెదడుపై చక్కని ప్రభావాన్ని చూపింది. డిస్కోసంగీతాని కనువుగా గర్భస్థశిశువు గర్భంలో నాట్యం చేయుట అల్ట్రాసౌండ్ కెమేరా సహాయంతో చిత్రీకరించుట జరిగింది. ఇది మెదడుపై దుష్ప్రభావాన్ని పెంపొందించింది. ఇదే సమయంలో అమెరికాదేశంలో నాసా ప్రయోగశాల వారు "ఓం" లేక మంత్ర ప్రసారం ద్వారా గర్భస్థశిశువు ప్రతిస్పందనను నమోదుచేయగా శిశువు ప్రశాంతతో పాటు ప్రసన్నతను, ఆనందాన్ని వ్యక్తపరచుట గమనించారు. అనుదినము సత్సంగాలు, గాయత్రీమంత్రోచ్చారణ సద్భావనల మధ్య, అట్టి వాతావరణమున్న శాంతికుంజ్‌లో జన్మించిన శిశువులు సతోగుణాలను పెంపొందించుకొని పుట్టారు.

ఒక మానసిక వైద్యునితో 4-5 సంవత్సరముల మధ్య వయస్సు ఉన్న పిల్లవానిని పరీక్షింపజేశాడు. ఆ పిల్లవాడు పోలిష్‌భాషను గుర్తుపట్టి కొన్ని పదాలు ఉచ్చరిస్తున్నాడు. తల్లిదండ్రులకు ఈ భాష రాదు. పిల్లవానికి మరెచ్చట నేర్పించనూ లేదు. మరి ఎలా మాట్లాడగలుగుచున్నాడు అనెడి సందేహం వచ్చింది. విచారించగా, లోతుగా ప్రశ్నించగా తల్లి జ్ఞప్తికి తెచ్చుకుంది. తల్లి గర్భవతిగా నున్నప్పుడు ఆమె పని చేసే కార్యాలయంలో పోలిష్‌భాషను మాట్లాడేవారు పని చేస్తుండేవారు. వారిలో వారు మాట్లాడుకుంటూ ఉండేవారు. బహుశ గర్భస్థశిశువు ఆ సమయంలో ఆ భాషా పదాలను అందిపుచ్చుకొని ఉండి ఉంటాడు అన్నది తల్లి. గర్భస్థశిశువు ఉద్విగ్నశక్తి, ఆధ్యాత్మికశక్తి, వైజ్ఞానికశక్తులను తల్లి గర్భం నుండి పెంపొందించుకొనుట ప్రారంభిస్తుంది. ఇది ముమ్మాటికి సత్యం.

మిత్రులారా! గర్భిణీస్త్రీలకు అనునిత్యము గాయత్రీ మంత్రాన్ని, ఓంకారాన్ని వినిపించండి. తత్ఫలితంగా వారి శిశువులు చక్కని మానసికస్థితితో జన్మిస్తారు. ఇదే యుగ నిర్మాణానికి, ఉత్తమ జాతి నిర్మాణానికి తద్వారా భూమి పైన స్వర్గావతరణకు ప్రాతిపదికగా మారుతుంది. గర్భిణీ స్త్రీ అనుదినం ప్రాతఃకాలములో ఉదయించే సూర్యుడిని ఉపాసించుట చాలా చాలా ఉత్తమము. కర్ణుని వంటి తేజోగుణ సంపన్నుడు, త్యాగమూర్తి జన్మిస్తాడు.

*ఓం శాంతి శాంతిః శాంతిః*

**భారతజాతి సర్వతోముఖ వికాసానికి మూలం తపశ్శక్తి**

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## గోదావరి పుష్కరాలు

గాయత్రీ చేతనా కేంద్రము, హైదరాబాద్ వారి సారథ్యంలో 2015 గోదావరి నది పుష్కరాలలో ప్రప్రథమంగా 12 రోజులు పాల్గొని భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకనుగుణ్యంగా, పూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మ అందించిన విధి విధానాల అనుసరించి ప్రజలకు సేవలను అందించుట జరిగింది.

పూర్వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము రెండు రాష్ట్రాలుగా విడిపోయిన చారిత్రక సత్యానికనుగుణ్యంగా భద్రాచలక్షేత్రములో తెలంగాణ రాష్ట్ర ప్రజానీకానికి, రాజమండ్రిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజానీకానికి పుష్కర సేవలనందించుటకు తగిన ఏర్పాట్లు గాయత్రీ చేతనా కేంద్రము చేసింది.

**భద్రాచలక్షేత్రము:** భద్రాచలక్షేత్రములోని గోదావరి నది వంతెన ప్రక్కగా నిర్మించి ఉన్న శ్రీ అయ్యప్పస్వామి దేవాలయం యాజమాన్య సహకారముతో, ఖమ్మం జిల్లా గాయత్రీ పరివార్ సారథ్యంలో గాయత్రీ చేతనా కేంద్రము హైద్రాబాద్ వారి సూచన, సహాయ సహకారముల మేరకు దేవాలయ ప్రాంగణములో శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

ఈ శిబిరము ద్వారా పుష్కర యాత్రికులచే పితృతర్పణ, గాయత్రీయజ్ఞము మరియు సాయంత్రము దీపయజ్ఞము చేయించారు. ప్రజ్ఞాపుత్రుడైన శ్రీ శివాజీ (శాంతికుంజ్) గారి సారథ్యంలో పితృతర్పణలు నిర్వహించబడ్డాయి. వీరికి శ్రీ జుజ్జూరి సాంబశివరావు గుంటూరు, శ్రీ సత్యన్నారాయణ పొన్నూరు, గుంటూరు జిల్లా వారు చక్కని సహకారమందించిరి. నిత్యము పితృతర్పణ సామాన్లను, తదితర వస్తువులను తలపై పెట్టుకొని దాదాపు 2 కిలోమీటర్లు దూరం నడచి పోవలసి ఉన్నప్పటికి గోదావరినది ఒడ్డున నిర్మించిన ఘాట్‌లో దాదాపు 1000 మందికి 12 రోజులు ఈ సేవల నందించుట జరిగింది. ప్రాంతీయ బ్రాహ్మణులు చేసెడి కర్మకాండకు మన గాయత్రీ పరివార్ పద్ధతిలో చేసెడి పితృతర్పణ విధివిధానాలకు మధ్యగల వ్యత్యాసాన్ని పుష్కర యాత్రికులే గాక, ఇతర వైదిక బ్రాహ్మణులు సైతం గుర్తించి, మన విధివిధానం పట్ల అత్యంత ఆకర్షితులైనారు. దీనితో వైదిక బ్రాహ్మణులు సైతం వారి బంధుమిత్రులకు మన గాయత్రీ పరివార్ విధానంలో పితృతర్పణలు చేయించు కొనుట గమనార్హము. పితృతర్పణ ఘాట్‌కు యజ్ఞక్రతువు నిర్వహించెడి స్థలానికి మధ్య దూరము ఎక్కువగా నుండుట వలన, ప్రభుత్వ సహాయ నిరాకరణ వలన, గాయత్రీ చేతనా కేంద్రము ఊహించిన రీతిలో పుష్కర కార్యక్రమాలను విజయ వంతము గావింపజాలకపోవుట జరిగింది.

అన్నదాన కార్యక్రమం నిరాటంకంగా పుష్కర అన్ని దినాలలో సాగింది. పూజ్యగురుదేవుల సాహిత్య విక్రయాలు కూడా అనేకానేక ఇబ్బందుల వలన సంతృప్తికరమైన ఫలితాలను సాధింపజాలకపోవుట జరిగింది.

ఈ యావత్ కార్యక్రమాన్ని శ్రీ ఎన్.బి.కె. చౌదరి, ఖమ్మం పట్టణ వరిష్ట కార్యకర్త తన భుజస్కంధాలపై నిడుకొని వారి అర్ధాంగి సహకారం తీసికొంటూ అనేకానేక వ్యయప్రయాసల కోర్చి తన కర్తవ్యాన్ని పూరించారు. వీరికి తోడుగా శ్రీ వెంకయ్య గారు నిలచి, తన వయోభారాన్ని కూడా లెక్కించక చక్కని కృషిచేశారు.

శాంతికుంజ్ వరిష్ట ప్రతినిధి డా॥ బ్రిజ్‌మోహన్‌గౌడ్‌జీగారు 14వ తేది భద్రాచలం చేరుకొన్నారు. 14వ తేది సాయంత్రం దీపయజ్ఞంలో పాల్గొని పరిజనులకు పుష్కర విశిష్టతను, గాయత్రీ పరివార్ లక్ష్యాన్ని, పూజ్యగురుదేవుల ఆలోచనలను వినిపిస్తూ విజ్ఞానదాయకమైన చక్కని ప్రవచనం చేశారు. అట్లే 15వ తేది ఉదయం యజ్ఞములో ప్రవచనాన్ని తిరిగి అందించారు.

గాయత్రీ పరివార్ విశిష్ట కార్యకర్త ఇల్లందు పట్టణ నివాసి శ్రీ సతీష్ ఖండేల్వాల్ మరియు శ్రీమతి సావిత్రిగారు వారి వారి బంధుమిత్రగణము, సాటి పరివార్ మిత్రులతో కలిసి విశిష్ట సేవల నందించుట జరిగింది.

గాయత్రీ పరివార్ భద్రాచలపట్టణము, శ్రీ నరసింహా చార్యులు తదితరులు వారి సంపూర్ణ సహకారాల నందించి కార్యక్రమ విజయానికి తమవంతు సహాయ సహకారముల నందించుట అత్యంత ముదావహము.

**బ్రహ్మచర్యపాలన తపోసాధనకు ప్రధాన అంశం**

విజయవాడ వాస్తవ్యులు శ్రీ చంద్రశేఖరరావు దంపతులు నిత్య గాయత్రీహోమాన్ని, దీపయజ్ఞాన్ని నిర్వహించారు. సిరిసిల్ల కార్యకర్తలు శ్రీ బాదం ప్రకాష్‌గారి నాయకత్వంలో చక్కని సేవలను అందించారు.

**రాజమండ్రి గోదావరి పుష్కర్‌ఘాట్:** రాజమండ్రి పట్టణములో స్థల సేకరణకై చేతనాకేంద్రము పట్టణ స్థిర నివాసులైన శ్రీ ఓ.రవీంద్రరెడ్డిగారు మరియు శ్రీ గుప్తగార్ల సహాయ సహకారాలతో తీవ్రకృషి చేయుట జరిగింది. అచ్చటి ప్రభుత్వ యంత్రాంగం అందుబాటులో నున్న విశ్రాంతిగృహాలను, ఖాళీ స్థలాలను, పాఠశాలలు మరియు కళాశాల ప్రాంగణాలను, ధర్మసత్రాలను అన్నింటిని తమ అధీనములోనికి ముందుగనే తీసికొన్నది. చిట్టచివరకు వైదికకర్మలు నిర్వహించెడి విప్రులు సైతము ప్రభుత్వానుమతి గుర్తింపుపత్రంతో మాత్రమే పుష్కర కర్మకాండలు నిర్వహించాలనెడి నియమావళిని అమలులోనికి తెచ్చింది. దీనిని గమనించి, ముందస్తుగనే ఎండోమెంటు డిపార్టుమెంటువారికి, మున్సిపాలిటీవారికి, సబ్‌కలెక్టరుగారికి మరియు పుష్కరాల ప్రత్యేక అధికారిగారికి కూడా చేతనా కేంద్రము వారి అనుమతిని కోరుచూ అర్జీ దాఖలు చేసికొనుట జరిగింది. అధికారుల నుండి స్పందన కరువైనందున చిట్ట చివరకు పూజ్యులు శ్రీ శ్రీరామానందస్వామి గాయత్రీశక్తి పీఠము, అమలాపురంవారి సహాయాన్ని కోరి, ఆ రాష్ట్ర హోమ్ శాఖా మంత్రిగారిచేత అధికారికి లేఖ వ్రాయించినా ఫలితం దక్కలేదు. తత్ఫలితంగా రాజమండ్రిలో పుష్కర కార్యక్రమాలను చేపట్టజాలకపోవుట జరిగింది.

పూజ్యగురుదేవుల విరచిత సాహిత్యాన్ని ప్రజలకు చేర్చుటకై అతి కష్టముపై ఒక స్టాల్‌ను రుసుం చెల్లించి ఏర్పాటు చేయుట జరిగింది. దీనిని శ్రీమతి కె. నాగమణి, శ్రీమతి దుర్గారామకృష్ణ అమలాపురం మరియు శ్రీమతి మునిలక్ష్మి తిరుపతిగార్లు అన్ని ప్రతిబంధకాలను ఓర్చుకుంటూ నిర్వహించారు. శ్రీమతి నాగమణిగారు ప్రారంభము నుండి చివరి వరకు అసౌకర్యాలను, అనారోగ్యాన్ని సరకుగొనక దృఢ సంకల్పంతో నిలచి పూజ్య గురుదేవుల నారీజాగరణకు ప్రతీకగా నిలచి పేరుకు తగ్గట్టు మణిగా నిలచినందులకు వారిని గాయత్రీ చేతనా కేంద్రము అభినందిస్తున్నది. స్ఫూర్తిదాయనిగా చూస్తున్నది.

రాజమండ్రిలో, గాయత్రీ చేతనా కేంద్ర కార్యకర్త జ్ఞాన పిపాసి వయోవృద్ధులైన శ్రీ వై.వి.కృష్ణారావుగారి ప్రోత్సాహంతో, శ్రీసోనీజీగారి సహకారంతో దాదాపు 60మందికి గౌతమిఘాట్ వద్ద పితృ తర్పణ సేవలనందించుట జరిగింది. నిత్యము 2 కి.మీ. దూరం నడిచి ఈ కార్యక్రమాన్ని వీరు 4 రోజులపాటు నిర్వహించారు. వీరిని చేతనా కేంద్రము అభినందిస్తున్నది.

గాయత్రీ చేతనా కేంద్రము సంపర్కములోనికి నూతనంగా వచ్చిన శ్రీమతి పరమేశ్వరి-ప్రసాద్ దంపతులు రాజమండ్రిలోని వారి స్వగృహములో ఉండుటకు ఆశ్రయాన్ని కల్పించి, భోజన ప్రసాదాలను అందించి, మన పరివారానికి తోడ్పాటును అందించారు. వీరిని చేతనా కేంద్రము అభినందిస్తూ ధన్యవాదములు తెలుపుకొనుచున్నది.

పైనుదహరించిన అనేకానేక అనుభవాలను, అనుభూతులను దృష్టినందిడుకొని రానున్న కృష్ణానది పుష్కరాలకు తగిన ప్రణాళికను తయారుచేసికొని విస్తృతస్థాయిలో ఏర్పాట్లు చేయుటకు సంసిద్ధం కానున్నది.

గోదావరి పుష్కరాల సందర్భంగా తమ సేవల నందించిన కార్యకర్తలందరికి ఆయురారోగ్యాలతో, సద్బుద్ధిని, సంపదల ప్రసాదించి సంరక్షింపవలసిందిగా పరమపూజ్య గురుదేవులను, పరమవందనీయ మాతాజీని, అఖండ గురుసత్తాను చేతనా కేంద్రము ప్రార్థిస్తున్నది.

**ధర్మపురి గోదావరి పుష్కర్‌ఘాట్:** కరీంనగర్ జిల్లా, మంచిర్యాల వరిష్ఠ కార్యకర్త పుష్కర్‌ఘాట్ వద్ద గాయత్రీ పరివార్ పుష్కర పితృతర్పణ కార్యక్రమాలను 12 రోజులపాటు అత్యంత వ్యయ ప్రయాసల కోర్చి నిర్వహించింది. దీనిలో శ్రీ రాంరెడ్డి, జగిత్యాల వారి నాయకత్వంలో జగిత్యాల గాయత్రీ పరివార్ సభ్యులు, సేవా కార్యక్రమాల నిర్వహించారు. డా॥ పులి సత్యన్నారాయణ గారు పూజ్యగురుదేవుల విరచిత విక్రయశాలను నిర్వహించారు. సిరిసిల్ల నుండి కూడా గాయత్రీ పరివార్ సభ్యులు ఈ కార్యక్రమాలలో పాల్గొని సేవలనందించారు.

## కరీంనగర్‌లో

కరీంనగర్ జిల్లా కేంద్రమైన కరీంనగర్ పట్టణంలో 2015 జులై 12వ తేదిన "నవకుండీ గాయత్రీ యజ్ఞాన్ని గాయత్రీ పరివార్ వరిష్ఠ కార్యకర్త సిరిసిల్ల వాసి శ్రీ బాదం ప్రకాష్‌గారి సారథ్యంలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహింపబడింది. గాయత్రీ పరివార్ వరిష్ఠ కార్యకర్తలైన శ్రీ సదానందం మరియు వెంకటేశ్వర్లుగారు యజ్ఞాన్ని నిర్వహించారు. పట్టణంలోని ఆర్యవైశ్యులతో పాటు అనేకమంది యజ్ఞములో పాల్గొన్నారు.

**రాజనీతిజ్ఞులు, వైజ్ఞానికులు కలిసి చేస్తున్న పని లోకవినాశనానికి ఎక్కువగా దోహదపడుచున్నది**